1906

Mayhavish

THE

# MANORAMA.

A MONTHLY TELUGU MAGAZINE.

(Published in the third week of every month.)

EDITED BY

CHILAKAMARTHI LAKSHMINARASIMHAM.

Vol. 1. RAJAHMUNDRY. JANUARY 1906. No. 1.

CONTENTS.

| | | PAGE. |
|---|---|---|
| 1. | OURSELVES. ... ... | 1. |
| 2. | TIT-BITS. ... ... ... ... | 3. |
| 3. | TALES OF RAJASTAN. ... ... | 5. |
| 4. | RAJAH RAM MOHAN ROY. ... ... | 9. |
| 5. | PHYSICAL GEOGRAPHY.—By Rao Bahadur K. Viresalingam Garu ... ... | 17. |
| 6. | SELF-HELP.—By Mr. Ch. Veerabhadra Rao. | 25. |
| 7. | PRASANNAYADAVAM (A Drama).... ... | 33. |
| 8. | KARPURAMANJARI (A Novel). ... ... | 51. |

CHECKED

Rajahmundry:

PRINTED AND PUBLISHED BY

*Messrs S. GUNNESWARA ROW BROS.*

AT THEIR CHINTAMANI PRESS.

1906.

# విషయసూచిక.


1. స్వవిషయము. ... ... ... ... 1.
2. వినోదములు. ... ... ... ... 3.
3. రాజస్థానకథావళి. ... ... ... ... 5.
4. రామమోహనరాయలు. ... ... ... ... 9.
5. భౌతికభూగోళశాస్త్రము—రావుబహాదూరు కం. వీరేశలింగముగారు. ... 17.
6. స్వయంసహాయము—చిలుకూరి వీరభద్రరావుగారు. ... ... 25.
7. ప్రసన్నయాదవ నాటకము. ... ... ... 33.
8. కర్పూరమంజరి. ... ... ... ... 51.



# THE MANORAMA.

RATES OF SUBSCRIPTION (*Including Postage*)

For one year (*in advance*). ... ... ... Rs. 3-0-0

Single Copy. ... ... ... ... ,, 0-4-6

చందానిర్ణయము. (అంచెకూలితోడ)

సంవత్సరమునకు (ముందుగా చెల్లించిన) రు. 3- 0- 0. విడిప్రతి యొకటికి 0- 4- 6.

ఈపత్రికను గోరువారు తత్పత్రికాధిపతిగారికి వ్రాసికొనవలయును.



# దీనిని జదువుఁడు.

బ్రహ్మశ్రీ చిలకమర్తి లక్ష్మీనరసింహముగారిచే నిక్కడి హిందూనాటకసమాజమునకయి రచియింపఁబడి, యీతన్నాటకసమాజమువారిచే ననేకపర్యాయములు ప్రదర్శింపఁబడి, మిగుల మనోహరములుగ నుండునటుల రచియింపఁబడిన వగుటచే జనసామాన్యముయొక్క యాదరణమును గాంచిన పారిజాతాపహరణము, ద్రౌపదీపరిణయము, సీతాకళ్యాణము, గయోపాఖ్యానము ననునాలుగునాటకములు సాధ్యమైనంత శీఘ్రకాలములో మాచే ముద్రింపఁబడనున్నవి; కాన, నీనాటకములు గావలసినవారు తమపేరునామాల నీక్రింద చేవ్రాలు చేసినవారలకే తెలియఁబఱచినచో నాటకములు ముద్రింపఁబడిన తరుణముననే తెలియఁజేయఁబడును.

యస్. గున్నేశ్వరరావు బ్రదర్సు,

రాజమహేంద్రవరము.

శ్రీ

# మనోరమ.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.


| సంపుటము. 1. | రాజమహేంద్రవరము.<br>జనేవరినెల 1906. | సంచిక. 1. |
|---|---|---|


## స్వవిషయము.

ఆంధ్రభాషలో, సర్వజనసమాదరణీయ మగు నొకమాసపత్రికను బ్రకటింప వలయు నని మేము చాలకాలమునుండి యభిలషించుచుంటిమి. చిరప్రవర్ధిత మగు మాకోరిక హృదయములోనే యుడఁగిపోవక యిట్లు రూపముధరించి బయలువెడలునట్లు చేసిన పరమేశ్వరునకు ననేకవందనంబులు చేసి దీని నారంభించుచున్నవారము. అనేక పురాతనప్రబంధములను, రసవంతము లగుమహాకావ్యములను బ్రకటించి యశోలతలఁ బలుదెసల నలమికొనఁజేసిన మాసపత్రికలును, చిత్రము లగువృత్తాంతములఁ దెలియఁ బఱచు, వారపత్రికలు నెన్నో యుండఁగ నిప్పు డీనూతనమాసపత్రికను బ్రకటింపవలసిన యావశ్యకత యేలఁ గలిగె నని చదువరులకు సందియము గలుగవచ్చును. అట్టిసందిగ్ధ మనస్కు లందఱు మావిజ్ఞాపనము సావధానముగఁ జిత్తగింతురుగాక! కవితాప్రాగల్భ్యము గల తొల్లిఁటి తెనుఁగుకవు లందఱు, గీర్వాణభాషనుండి పురాణముల, మహాకావ్యముల నాంధ్రీకరించియుఁ బురాణేతిహాసములయందలికథలఁ గ్రహించి,వానిని విపులముగఁ జేసి, రసవత్ప్రబంధములుగ నల్లియు, తారు స్వయముగఁ గొన్నిచిత్రకథలఁ గల్పించియుఁ బద్యకావ్యములనే రచియించిరికాని, వచనప్రబంధములపొంతఁ బోవరయిరి. ఇటీవలి యాంధ్రకవులును, ప్రాచీనులమార్గములనే యనుసరించి, తొల్లిఁటియట్లు రసములు గుమ్మరించు కావ్యముల రచియింప నేరకున్నను దమకుం దోఁచిన

లాగుఁ బద్యకావ్యరచనకుం జొచ్చిరి. కాని గద్యప్రబంధముల దెసఁ జూడరయిరి. సంస్కృతమున నాలుగైదు గద్యప్రబంధము లున్నయవిగాని, యవి యతిదీర్ఘసమాసములతోడను, బహువిధశ్లేషలతోడను, క్లిష్టకల్పనలతోడను, నిండియుండుటంజేసి యాంధ్రీకరణమున కంత వలనుపడవు. ఏఁబదిసంవత్సరములనుండి యాంధ్రులు, వచనకావ్యముల రచియింప నారంభించిరి. కాని యావచనప్రబంధములలో ననేకములు మున్ను బద్యకావ్యములుగా నున్నవానికి వచనరచనలై క్రొత్తకల్పనలుగామి, చర్వితచర్వణన్యాయమును జ్ఞప్తికిఁ దెచ్చుచున్నయవి. మన తెనుఁగుభాషలో వేదములుగాని, సాంఖ్య, మీమాంస, వైశేషికాదిదర్శనములుగాని, తర్కజ్యోతిషాదిశాస్త్రములుగాని, యిప్పటికిని లేవు. ముప్పదిసంవత్సరములనుండి, నాటకములు రచియింపఁబడి కొంతవరకు వృద్ధిఁజెందినవి; జన్మమంతయుఁ బరోపకారార్థమై గడపిన మహాపురుషుల జీవితములు, దేశచరిత్రలు, దేశభాషలో స్వతంత్రముగ రచియింపఁబడిన నాటకములు, చిత్రవచనకావ్యములు (Novels) నెన్నఁదగినన్ని గానఁబడుచున్నవి. అవిగాక దేశోపకారకములు భాషాభివృద్ధికరములు జ్ఞానప్రదాయకములునగు ప్రకృతిశాస్త్రాదిగ్రంథములు వేనవేలు హూణభాషలోనుంచి తెనిఁగింపవలసిన భార మాంధ్రగ్రంథకర్తలపైఁబడియున్నది. కొన్ని సంవత్సరములనుండి, యాంధ్రదేశమున బయలువెడలిన, మాసపత్రికలు చాలవరకు, పురాతనప్రబంధములను బ్రచురించుట ముఖ్యోద్దేశముగాఁ గలిగియుండినట్లు గానఁబడుచున్నది. మంచిమంచిగ్రంథము లన్నియు నీవరకే ముద్రితములగుటంజేసి, యట్టికావ్యములు ముద్రింపవలయు నన్నను దొరకవు. ఒకవేళ దొరకినఁ బద్యకావ్యములు ముద్రించుట మాసంకల్పము గాదు. ఏవి లేకపోవుటచే నాంధ్రభాషకుఁ గొఱఁతగానున్నదో, యేవి రచియించుటచే దేశస్థులకెల్ల జ్ఞాన మభివృద్ధి నొందునో, యట్టిదేశచరిత్రములు, ప్రకృతిశాస్త్రములు, నీతిబోధకము లగుకథలు, శూరశిఖామణులజీవచరిత్రములు, పరోపకారుల సచ్చరిత్రలు, రాజకీయవ్యవహారవిషయములు, సంఘసంస్కారప్రసంగములు, మతవిషయికము లగుచర్చలు, వినోదములు, లోనగునవి వచనరూపకముగఁ బ్రకటించి, స్త్రీలకుఁ బురుషులకుఁ, బాలురకు, వృద్ధులకుఁ బండితులకుఁ, బామరులకు నుపయుక్తముగా నుండునట్లు మాపత్రికను జేయుటయే మాముఖ్యోద్దేశము; మహాపురుషుల చరిత్రములు వ్రాయునప్పుడు వారివారిప్రతిమలు నిందుఁ బొందుపఱచుటకు నిశ్చయించుకొన్నారము. అది వ్యయప్రయాసములకు లోనైయుండుటంజేసి, యాంధ్రభాషాభిమానులందఱు, మాయుద్యమమునకుం దోడ్పడి మమ్ముఁ గృతార్థులఁ జేయుదురుగాక! పత్రికాధిపతి.

# వినోదములు.

1. అడిదము సూరకవి యొకనాఁడు తాటియాకులమీఁద వ్రాఁబడిన మహాభారతమును జేతఁబట్టుకొని నడచిపోవుచుండఁగ, నొక వెలమదొర వానింజూచి, "అయ్యా! ఈవేళ వర్జ్య మెప్పు" డని యడిగెను. నేను కవిత్వముఁ జెప్పుదును గాని పంచాగము చెప్పను. అందుచేత నాకుఁ దెలియదని సూరకని ప్రత్యుత్తర మిచ్చెను. అంత పెద్ద పుస్తకముఁ జదువుకొన్నవాఁడవు; నీకు పంచాంగముఁ జెప్పుట తెలియదా? యని యా వెలమదొర కవిని బరిహసించి తనదారినిఁ బోయెను. మరునాఁ డా వెలమదొర చేతఁ బెద్దకత్తిఁ బట్టుకొనిపోవుచుండఁగ, సూరకవి వానినిసమీపించి "అయ్యా! నాకు క్షురకర్మఁ జేయఁగలవా?" యనియడిగెను. వెలమదొర యామాటలువిని యాశ్చర్యపడికోపముతో నేనుమంగలిననుకొంటివా యనిపలికెను. సూరకవి యామాటలువిని కత్తి యింతపొడవుగా నున్నది క్షవురముఁ జేయుటకేఁ బనికిరాని దీని ప్రయోజన మేమని పరిహసించిపోయెను.

2. అడిదము సూరకవి యొకనాఁడు కుక్కయొకటి తరుముకొని రాఁగా వడివడిఁ బరుగెత్తుకొని తనస్నేహితులు కూర్చున్న యొకతావునకు వగర్చుకొనుచు వచ్చెను. అప్పుడు స్నేహితులు వానింజూచి "యేమోయి? గాడిదవలె నిట్లు పరుగెత్తుకొని వచ్చితి" వని యడిగిరి. కుక్కకు భయపడి వచ్చితిని గాని యిప్పటికి మందలోఁ గలిసితి గనుక భయము తీరినదని ప్రత్యుత్తర మిచ్చెను.

3. కాకతీయప్రతాపరుద్రుఁ డోరుగల్లు నేలుచుండఁగ, నొకమారు బ్రాహ్మణులకును, విశ్వకర్మలకును వివాదము వచ్చెనఁట. విశ్వకర్మలు తాము విశ్వబ్రాహ్మణుల మనియు, తమసహాయములేక యేవర్ణమువారును జీవింపలేరనియు, నన్ని వస్తువుల తామే చేయవలయు ననియు, కావున తమరే బ్రాహ్మణులకంటె నెక్కువవార మనియు, వాదించిరఁట; అప్పు డొకనియోగిబ్రాహ్మణుఁడు లేచి చేత నొక గ్రుడ్డిగవ్వఁ బుచ్చుకొని విశ్వబ్రాహ్మణులలోఁ బెద్దకు నది జూపి "అన్ని వస్తువులు నీవు చేయఁగలనంటివి. ఇది నీవు చేసితివా" అని యడిగెను. విశ్వబ్రాహ్మణుఁ డామాట విని కోపించి, ఛీ! దీనిని నేను జేయలేదు యిట్టిమాట లింకఁ బలుకకుమని కఠినముగ నుత్తరము చెప్పెను. అప్పు డానియోగి వానితో ఓయీ! గ్రుడ్డిగవ్వఁ జేయనివాఁడవు నీవు మాకంటె నేవిధముగా నెక్కువాఁడవని పరిహసించెను. అప్పుడు సభవా రందఱు నియోగియుక్తికి మెచ్చి సంతోషించిరి.

4. విద్యాగర్వముచేత విఱ్ఱవీఁగుచు నొకపండితుఁడు తాను ప్రతివాది భయంకరుఁడ నని బిరుదు పెట్టుకొని, తనపాండిత్యప్రభావముచేత నెవ్వ రేమన్న నది కాదనిపించెద నని ప్రతిజ్ఞఁ జేసి యొకరాజునొద్దకు వచ్చి, యతని యాస్థానపండితులను తనతో వాదమునకు రమ్మని పిలచెను. అతి చతురుఁ డగు నొకపండితుఁడు వాదమున కంగీకరించి క్రొత్తపండితునితో నీప్రతిన యేమని యడిగెను. నూతనపండితుఁడు నీ వేమాటలాడిన నామాట లబద్ధములని నేను ఋజువుఁ జేయఁగలను. ఇదియే నాప్రతిన యని యనెను. అప్పుడు సంస్థానపండితుఁడు, సరే! ఈరెండుమాట లబద్ధము లని స్థాపింపుము. రాజుగారి తల్లి గొడ్రాలు కాదు. రాజుగారిభార్య పతివ్రత యని పలికెను. ఆమాటలు విని క్రొత్తపండితుఁడు పచ్చివెలగకాయ గొంతుగఁ బడినట్లు తోఁచక మఱునాఁ డుత్తరముఁ జెప్పెద నని చెప్పి యప్పటికి తప్పించుకొని రాత్రి పాఱిపోయెను.

5. ఒకబ్రాహ్మణుఁడు ప్రతిదినము తనకొడుకును బిలిచి, యీవేళ సంధ్యవార్చితివా లేదా యని యడుగుచుండును. కుమారుఁడు భోజనముమీఁద నున్నశ్రద్ధ సంధ్యావందనముమీఁద లేనివాఁ డగుటచే వార్చినప్పుడు వార్చితి ననియు, లేనప్పుడు లేదనియుఁ జెప్పక యబద్ధము లాడుచుండును. ఒకసాయంకాలము తండ్రి కొడుకును జూచి "నాయనా! ఈపూట సంధ్యవార్చితివా యని యడుగ" నాతఁడు వార్చితి ననెను. ఎక్కడ వార్చితివని తండ్రి మరల ప్రశ్న వేయఁ దూరుపుచెఱువులో నని కొడు కుత్తరముఁ జెప్పెను. అప్పుడు తండ్రి తూరుపుచెఱువులో నీళ్లెండిపోయినవి. "అక్కడ నెట్లు వార్చితివిరా" యని యడుగ "అయ్యో! మనచాకలివాఁడు దానిలో నీళ్లున్నవని నాతోఁ జెప్పుటచే నేను కాఁబోలు ననుకొని, యక్కడ వార్చితి నని కొడుకు బదులు చెప్పెను.

6. సంధ్యావందనము మఱచిపోయిన యొకపిల్లవాఁడు మరల దానిని నేర్చుకొనవలయు నని శ్రద్ధాభక్తులతోఁ దండ్రియొద్దకుఁ బోయి నాయనా! నాకు సంధ్య నేర్పు మని యడిగెను. ఆమాటలు విని తండ్రి కోపముచే మండిపడి కొడుకుం జూచి యిట్లనియెను. ఓరీ! పశువా! ఐదేండ్లక్రిందట నేర్చుకొన్న నీకే జ్ఞాపకము లేనప్పు డిరువదివత్సరముల క్రిందట నేర్చియున్న నాకా జ్ఞాపకముండుట; ఇట్టిమాట లిఁక ముం దెప్పుడు ననఁ బోకు మని గట్టిగా మందలించెను.

# రాజస్థానకథావళి.

## ఉపోద్ఘాతము.

---

ఆర్యావర్తమని పూర్వుల చేత వ్యవహరింపఁబడుచువచ్చిన యుత్తరహిందూస్థానమున రాజస్థాన మనుదేశ మొకటి గలదు. దీనినే రాజపుత్రస్థాన మని వాడుదురు; ఇందు రాజపుత్రు లనఁగా క్షత్రియులు విస్తార ముండుటచేఁ దీనికి రాజపుత్రస్థానమనియు, రాజస్థాన మనియుఁ బేళ్లు గలిగినవి. ఈదేశముయొక్క వైశాల్యము 1,30,000 చతురపుమైళ్లు; దీని కుత్తరమున పంజాబుదేశమును, దూర్పునం దాగ్రాయును, దక్షిణమున బొంబాయిరాజధానియుఁ, బడమట సింధుదేశమునందలి యెడారులునుం గలవు. ఒక కోటి యిరువదిలక్షలజను లిందు వసియించుచున్నారు. ఈదేశమునకు మధ్యగానున్న యజమీ రనునది దప్ప తక్కిన భాగము లన్నియు స్వదేశ రాజుల చేతఁ బాలింపఁబడుచున్నవి. ఆయజమీ రొక్కటియు నింగ్లీషువారిస్వాధీనములో నున్నది. స్వదేశప్రభువుల చేఁ బరిపాలింపఁబడు సంస్థానములు, అల్వారు, బికనీరు, కృష్ణనగరు, జయపురము, భరతపురము, ఢోలాపురము, కెరాలి. టాంకు, బూందీ, కోట, జాలవారు, ప్రతాపఘరు, బన్సువారా, డంగరపురము, మీవారనఁగా నుదయపురము, సిరోహి, మార్వారనఁగా ఝూద్పురము, జసల్మీ రనునవి యిరువది. ఇందు టాంకుసంస్థాన మొక్కటియు మహమ్మదీయప్రభువుల చేతఁ బరిపాలింపఁబడుచున్నది. తక్కినవానిలో భరతపురము, ఝూటువంశస్థుఁ డైనరా జేలుచుండును; తక్కిన పదునెనిమిదిసంస్థానములను స్వదేశక్షత్రియప్రభువు లేలుచున్నారు. ప్రస్తుత మీరాజ్యము లన్నియు నాంగ్లేయులకు లోఁబడి వారిచేత సంరక్షింపఁబడుచున్నవి. ఈదేశము వైశాల్యమున మిక్కిలి పెద్దదయ్యుఁ బ్రాముఖ్యతయందు మిగుల తక్కువగా నున్నది. కడుదూరము వ్యాపించు నిసుకతిన్నెలేగాని ఫలవంతము లయినభూములుగాని మంచిప్రవాహములు గలనదులుగాని యంతగా లేవు. అందుచేతనే జనసంఖ్య మిక్కిలి! తక్కువగా నున్నది. హొరావళీపర్వతము లీశాన్యదిగ్భాగమునుండి నైఋతిమూలవఱ కీదేశమున వ్యాపించి యున్నవి. ఈకొండలకుఁ బడమటివైపున చాలభాగ మిసుకయెడారియై యున్నయది. కాని తూర్పున

చాలవరకు భూమి సారవంతమై, ధాన్యము, దూది, చెఱకు, పొగాకు, నల్లమందు, పండును. చంబల్ నదియు, దానియుపనది యగు బేనాసును, లూని యనునొకచిన్న యేఱు నిందు ముఖ్యనదులు. నదులు తక్కువగా నుండుటచేఁ జనులకు పానయోగ్య మగునీరు నూతులనుండి లభించుచున్నది. ఉప్పునీటిసరస్సులు విస్తారముగా నుండుటచే వానినుండి ప్రజ లుప్పుఁ జేసి వాడుదురు. ఇండ్లనిమిత్త మిచ్చటికొండలలో మంచిరాళ్లు దొరకును. పూర్వము షాజహానుచక్రవర్తి తన భార్యపేర నాగ్రానగరములోఁ గట్టించిన తాజమహాలను దివ్యభవనమున కీదేశమునందలి మక్రానారాతిగనులనుండియే రాయి పంపఁబడినది.

## పట్టణములు.

ఆరావళీపర్వతములలో నాబూ యనుశిఖరముపైఁ గట్టఁబడిన యాబూనగర మీదేశమునందలి ముఖ్యనగరములలో నొకటియై యారోగ్యప్రదాయినిగా నున్నయది. ఈపర్వతశృంగము జైనమతస్థులకు యాత్రాస్థలముగానున్నది. ఈశిఖరముమీఁద స్ఫటికశిలానిర్మితము లగుదేవాలయము లనేకములు దర్శనీయములై యుండును. వానిలోఁ బ్రధానదేవాలయముఁ గట్టుటకే పదునెనిమిదికోట్లరూపాయిలు వ్రయముఁ జేయఁబడినవఁట. మీవారు సంస్థానమున కుదయపురము రాజధాని. ఇది మిక్కిలి సుందరమగుపట్టణము. జోధపురము మారువారుదేశమునకు రాజధాని; ఇందును రాతికట్టడము లనేకము లున్నయవి. జయపురము హిందూస్థానమునం గలనగరములలో నెల్ల మిక్కిలి మనోహరముగ నుండును. తక్కిన ప్రతిసంస్థాన మాపేరు గలపట్టణమే రాజధానిగాఁ గలిగియుండును. ఈదేశమున వసియించు జనులు రాజపుత్రు లనఁబడుదురు. వీ రాజానుబాహులు, శౌర్యనిధానులు నగుజాతివారు. సాముకసరతులు నేర్చి యెక్కుడు చాకచక్యము గలిగి వీరు యుద్ధముపేరు విన్నపుడు పండువుగాఁ దలంచుచుండువారు. ఈరాజపుత్రులవంటి యభిమానధనులగు సాహసికశిఖామణులు ప్రపంచమునం దుండుట యరిది. తమదేశస్వాతంత్ర్యమును, కుటుంబగౌరవమును, కాంతలపాతివ్రత్యమును నిలుపుకొనుటకయి తమప్రాణంబులఁ దృణప్రాయములుగ ధారవోసిన శూరాగ్రేసరులు; ఈరాజపుత్రస్త్రీ లన్ననో తమమగవారికన్న నెక్కుడభిమానము, శౌర్యము గలవీరమాతలు, వీరపత్నులునయి మానసంరక్షణార్థము దేహముల నగ్నిహోత్రమున కాహుతులు చేసిన వీరరసాధిదేవత లని చెప్పవచ్చును. భర్తగాని కుమారుఁడుగాని కయ్యంబునఁ బరాజయము నొంది శత్రువులకు వెన్నిచ్చి పరుగెత్తుకొని కోటలోఁ బలఁ దాఁచుకొనవచ్చినప్పుడు రాజపుత్రస్త్రీ వానిని గోటలోనికి రానియ్యక ములుకుల

వంటిపలుకులచే వానిమనసు నొప్పించి శౌర్యము గలిగించి మరల యుద్ధంబునకుఁ బంపుచు వచ్చెనని యికముందు వ్రాయఁబోవుకథలలో మీరు చదివి యక్కజపడక పోరు; ఈజాతిలోఁ బుట్టినబాలుఁ డయినను సమరమునకుఁ బోవుటకుఁగాని కాంతా జనంబుల వధించి కులగౌరవము నిలుపుటకుఁగాని, యవసరమయినయపు డగ్నిహోత్రమున దుమికి యాత్మహత్యఁ జేసికొనుటకుఁగాని యెన్నఁడు వెనుదీయఁడు; ఈరాజపుత్రులలోఁ గొందఱు సూర్యవంశజులు, కొందఱు చంద్రవంశజులు, కొంద ఱగ్నికులులు; పరశురామునిచేత క్షత్రియవంశము లిరువదియొక్కమారు నాశనము చేయఁబడినప్పుడు, లోకమరాజకమయి ధర్మమార్గంబులు విడిచి వర్తించుచుండఁగా వేదవిదులగుమును లగస్త్యు నాశ్రయించి మరల క్షత్రియవంశముల సృజింపు మని ప్రార్థింప నాతఁడు వేదియందు వైదికాగ్నిని గల్పించి మంత్రబలముచే నగ్నిహోత్రమునుండి క్షత్రియులను మరల సృజించె ననియు వారివంశజులే యిప్పు డున్న రాజు లంద రనియు నొకకథ గలదు. కొన్నిరాజకుటుంబము లీకథ నొప్పుకొనక తమవంశకర్త సూర్యుఁడో చంద్రుఁడో యని తక్కినరాజులను నిరసన జేయుచుందురు. వీరు పలుతెగలుగా విభజింపఁబడి యున్నారు. ఏతెగలోవా రాతెగకు నాయకుఁ డగువానిని మిగుల మన్నింతురు. నేలఁ దున్నుకొని జీవించు సేద్యగాఁడు సయితము కులగౌరవమునఁ దాను గొప్పజమీందారుతో సమానుఁడ నని గర్వించుచుండును. ఈరాజపుత్రసంఘములలో నొక్కొకకుటుంబము నొక్కొకభట్టువాఁ డాశ్రయించి యాకుటుంబముల యశస్సు, కైవారములు సేయుచు వారివిరోధులను హాస్యరసప్రధానము లగుపాటలతోఁ బరిహసింతురు. ఈభట్టువారుఁగాక చారణులనుపేర మరికొందఱు స్తోత్రపాఠకులు గలరు. వీరు జనులకు గురువులుగాను, దేశచరిత్రములఁ దెలుపువారుగనుండి జనులచే మిక్కిలి మన్నింపఁబడుచున్నారు. ఈరాజస్థానమున జైనమతస్థులుఁగూడ విస్తారముగా నున్నారు. ఈదేశస్థు లందఱు మాటలాడునది హిందీభాష. వీరరసమునకుఁ బుట్టినయిల్లగు నీరాజస్థానమునందలి సంస్థానాధిపతులందఱు తమదేశస్వాతంత్ర్యమును, తమ యార్యమతమును గోబ్రాహ్మణులను, దేవాలయములను, సంరక్షించుటకయి పలుమారులు మహమ్మదీయచక్రవర్తులతో యుద్ధములు చేసిచేసి ప్రసిద్ధిఁ గాంచిరి. ఈసంస్థానములన్నిటిలో మేవా రనునది సుప్రసిద్ధమై రాజపుత్రదేశమున కలంకారమయి శూరశిఖామణులకు నిలయమయి యలరుచుండును. దానిపూర్వరాజధాని చిత్తూరునగరము. ఢిల్లీ చక్రవర్తు లానగరము నాక్రమించి నాశన మొనర్చినపిదప, తత్ప్రభువు లుదయపురమనుపట్టణము వేరొకచోటఁ గట్టుకొని దానిని రాజధానిగాఁ జేసికొనిరి. ఉదయపుర

సంస్థానాధిపతియే, రాజపుత్రుల కెల్ల నాయకుఁడు. ఆతనియాజ్ఞ నాజాతివా రందఱు శిరసావహింతురు. ఉదయపురాధీశ్వరునకు రాణా యనుబిరుదము గలదు. ఈతని వంశము నిష్కళంక మని ప్రజలు చెప్పుకొందురు. శ్రీమద్రామాయణకథానాయకుఁడును ధనుర్ధరులలో నెల్ల నగ్రగణ్యుఁడును నగు శ్రీరాముని రెండవకుమారుఁ డగుకుశుని సంతతివార మని యీరాజులు చెప్పుకొందురు. ప్రస్తుత మీయుదయపురరాజవంశము శిశోదయవంశమని పేరొంది యున్నది. ఈవిధంబుగనే కొందఱు రాజులు పాండవమధ్యముఁ డగు యర్జునుని ప్రియపుత్రుఁ డభిమన్యుఁడు తమకు మూలపురుషుఁ డనియు, తత్కారణమున చంద్రుఁడు వంశకర్త యనియు సంతసింతురు. జగద్విశ్రాంతకీర్తు లగు నీరాజకులభూషణుల యద్భుతచరిత్రము లాంధ్రభాషలో వ్రాయవలె నని నాకుఁ జిరకాలమునుండి కుతూహల మున్నందున నే నిప్పుడు తచ్చరిత్రములు సంగ్రహముగా వ్రాయఁ బూనుచున్నాఁడను. ప్రప్రథమమున నుదయపురము రాజధానిగా నున్న మీవారుదేశముయొక్కయు, ఝూదుపురమురాజధానిగానున్న మారువారుయొక్కయు చరిత్రములఁ దెలుపఁబడును.



RAJAH RAM MOHAN ROY.

## రాజా రామమోహనరాయలు.

రామమోహనరాయలు బంగాళాదేశమునందలి, హుగ్లీమండలములో రాధానగరమున క్రీస్తుశకము 1774వ సంవత్సరమున జననమొందెను. అతనితండ్రి రమాకాంతరాయలు, చిన్నజమీందారయి యుండి, కొంతకాలము మూర్షదాబాదు నవాబులయొద్ద నుద్యోగము చేసి యాప్రభువులు రాజ్యభ్రష్టులైనపిదప బర్ద్వానుమహారాజునొద్ద

కొలువు చేసెను. రామమోహనునితల్లి తారిణీదేవి, సత్ప్రవర్తనకును, యోగ్యతకును ప్రసిద్ధి కెక్కెను. ఆతని తలిదండ్రు లిరువురు దైవభక్తి గలవారును, మతవిషయమునఁ బట్టుదల గలవారునై రి; ఆదినములలో పారసీభాషయే రాజభాషగా నుండుటంజేసి, రామమోహనుఁడు బంగాళీభాషఁ గొంత నేర్చినవెనుకఁ దొమ్మిదివత్సరముల ప్రాయమున నరబ్బీ, పారసీభాషలు నేర్చుకొనుటకయి పాట్నానగరమునకుఁ బంపఁబడెను. అచ్చట రెండుసంవత్సరములలోఁ గుశాగ్రబుద్ధి యగుటచేతఁ దాభాషలలో నుద్గ్రంథముల ననేకములు చదివి, సంస్కృతవిద్యాభ్యాసముఁ జేయుటకయి పండ్రెండవయేటఁ గాశికానగరమునకుఁ జని యాభాషలోఁ గొలఁదికాలములోనే పండితుఁ డయి యుపనిషత్తులం జదివి, తత్సారముం గ్రహించెను. రామమోహనుఁ డుపనిషదర్థముఁ దెలిసి గ్రహించి తనపదునాఱవయేటనే బంగాళీభాషలో విగ్రహారాధనము నిషేధించుచు నొకగ్రంథము వ్రాసెను. ఇదియే బంగాళీభాషలో మొట్టమొదటి వచనకావ్యము; విగ్రహారాధనము హిందువులు ప్రమాణముగ గ్రహించుచున్న వేదశాస్త్రములచేత నిషేధింపఁబడినదనియు, మనపూర్వు లగుమహర్షులమతమున కిది విరుద్ధ మనియు జనులందఱు శిలావిగ్రహార్చనము విడిచి యేకేశ్వరారాధనము సేయవలసిన దనియు, నీగ్రంథమున నతఁడు స్థాపించెను. తనకొడుకు సనాతనధర్మ మగువిగ్రహారాధనమును ఖండించుచున్నాఁడని విని, రమాకాంతరాయలు కోపపరవశుఁ డయి యాయకార్యమును జేసినందుకు రామమోహనుని యింటనుండి వెడలనడచెను. బాల్య మింకను గడచిపోవకమునుపే, స్వతంత్రముగఁ జీవించుటకు శక్తులు రాకమునుపే, యాగర్భశ్రీమంతుఁ డయి చిన్ననాఁటనుండియుఁ గడుగారాబమునఁ బెరిగిన యాబాలుఁ డాకస్మికముగఁ దండ్రిచే నింటనుండి వెడలనడుపంబడియు, స్వభావముచేత గంభీరుఁ డగుట హిందూదేశమునఁ బలుతావులఁ దిరిగి యెట్టకేలకు హిమాలయపర్వతములు దాఁటి టిబెట్టుదేశమునకుఁ బోయి బౌద్ధక్షేత్ర మగులాసానగరముం జొచ్చి యచ్చటిభాషల నలవఱుచుకొని, బౌద్ధమతసిద్ధాంతములఁ గ్రహియించెను. ఆస్తికుఁ డగురామమోహనుఁడు నాస్తికు లగునచటిబౌద్ధులతో నీశ్వరవిషయములగు చర్చలం జేయ వాదములు ముదిరి భేదములయి తుదకు వానికిఁ బ్రాణభయము నాపాదించెను. మతద్వేషముచేత బౌద్ధగురువులు నిష్కారణముగా నాబాలునిఁ గడతేర్పఁ బ్రయత్నింపఁగా నచటిస్త్రీలు కొందఱు వారికడుపుచల్లగ వానిని రహస్యముగ దాచి బ్రతికించి యావలకుఁ బంపిరి. అందుచేత నాఁటనుండి స్త్రీలయెడఁ గడుఁ గృతజ్ఞుఁడై వారికష్టములఁ దొలఁగింప, నాతఁ డామరణముఁ బ్రయత్నించెను. కొడుకు కిల్లువెడలుటమొదలు వానికొఱకయి బెంగఁగొని

తండ్రి మరల వానిని పిలిపించి యాదరించెనుగాని, క్రమ్మర నాతఁడు బ్రాహ్మణులమతాచారములను ఖండించుటచేత, తండ్రి వానిని రెండవమారింటనుండి సాగఁదోలెను. తరువాత కొంతకాలమునకు రమాకాంతరాయలు లోకాంతరగతుఁడుగాఁ దారిణీదేవి కడుపుతీపిచేఁ గొడుకును బిలిపించి యింట నిలుపుకొనెను. రామమోహనుఁ డంతట మనస్థిమితము గలవాఁడయి యిరువదియవయేడు మొదలు యిరువదియాఱవయేడువఱకు నింగ్లీషుభాషయందుఁ గృషిచేసి, దానిం జులకగఁ జదువ వ్రాయఁ గలిగెను. ఆభాషకుఁ దోడు ఫ్రెంచి, లాటిను, గ్రీకు, హీబ్రూభాషలయందుసయిత మాతఁడు ప్రవీణుఁ డయ్యెనని చెప్పుదురు. క్రీస్తుశకము 1800వ సంవత్సరమున రామమోహనుఁడు రంగపురము కలక్టరగు డిగ్బిదొరగారికచ్చేరిలో చిన్నగుమాస్తాగాఁ బ్రవేశించెను. కాని దొర యా పిన్నవానిచాకచక్యమును దెలివితేటలును గనిపెట్టి, తనయెదుటి కతఁడు వచ్చినప్పుడు, నిలువఁబెట్టి పని పుచ్చుకొనననియు, చిన్నగుమాస్తాల కుత్తరువు చేయునట్లు చేయననియు, వాగ్దానము చేసెను. ఆచిన్నయుద్యోగమునుండి యతఁడు క్రమక్రమముగ జిల్లాసిరస్తదారుఁడయి తనకృత్యములను జక్కఁగ నెరవేర్చి యధికారుల మెప్పొందె, 1813వ సంవత్సరమున నుద్యోగమును మాని శేషమగు జీవితకాలము లోకోపకారార్థము గడఁపఁదలఁచి 1814వ సంవత్సరమున గలకత్తానగరమున గాపురముండ వచ్చెను. అతఁడు కలకత్తానగరము వచ్చునప్పటికి, మనదేశస్థితి యెటులుండెనో యించుక చెప్పవలసియున్నది. బంగాళాదేశమున శాక్తేయమతమును, చైతన్యను వైష్ణవమతము వృద్ధిలో నుండుటచే, శాక్తేయులకు వైష్ణవులకు మతద్వేషములు తరచుగఁ గలుగుచు వచ్చెను. నరబలులు, శిశుహత్యలు, దేశమందంతటఁ బ్రబలియుండెను. వానికిం దోడుగ నతిభయంకరము నమానుషంబు, నసహ్యమునగు, సహగమన మను దురాచార మొకటి భరతఖండమందంతటను, ముఖ్యముగ వంగదేశమందును దృఢముగ నాటుకొని యుండెను. ఈసహగమనమును భర్తృవియోగముచే నీలోకమున బ్రతుక నిచ్ఛలేకఁ గొందఱు పతివ్రతలు, మనఃపూర్వకముగఁ జేయుచు వచ్చిరిగాని, కాలక్రమమున వితంతువు నెట్లో కాల్చి చంపి, యాస్తి వేసికొనవలయు ననుజ్ఞాతులును లోకనిందకు జంకిన బంధుగులును, మగఁడు చనిపోవుటచే నగము చచ్చియున్న యాపదానివద్దఁ జేరి మృతభర్తతో సహగమనముఁ జేసినదానికిఁ బుణ్యము గలుగుననియుఁ గుటుంబమునకు సత్కీర్తి సంఘటిల్లు ననియు, వేనోళ్ళఁ బొగడి మనసు విరిచి భయము పెట్టి, బలవంతముగ నాస్త్రీచే నొప్పించియు, నొప్పకొననిచో విరిచికట్టియు శ్మశానమునకుఁ దామె దీసికొనిపోయి మండుచున్న నిప్పులపైఁ బడవేసి హృదయము గరఁగించు నామె

యేడ్పు లెవ్వరికి వినఁబడకుండ, భేరీలు వాయించి, నడుమనడుమ దుస్సహమగు బాధచే నామె లేవఁబోయినప్పుడు, వెదురుకఱ్ఱలచేఁ ద్రొక్కి యడిచిపెట్టించి, యెట్లో నిండుప్రాణముఁ దీసి, కృతార్థులగుచు వచ్చిరి. 1815వ సంవత్సరము మొదలు 1828వ సంవత్సరమువఱకు నొక్క కలకత్తానగరమునందే దాదాపుగ నైదువేలమందిసుందరు లీఘోరమరణముపాలయిరి. అశాస్త్రీయము నతిక్రూరము ననార్యము నగు నీప్రత్యక్షరాక్షసకృత్యములఁ జూడలేక రామమోహనరాయ లాదురాచారమును మాన్పుటకయి ప్రయత్నింప నిశ్చయించుకొని కలకత్తానగరము వచ్చినదిమొదల లావిషయమయి పాటుపడి, యీయాచారమును తుదముట్టించి భరతఖండస్త్రీల కుపకారము చేయుఁడని దొరతనమువారికి, పలుమారు మహజర్లు బంపియుఁ దద్విషయమయి తాను కొన్ని చిన్నగ్రంథములను వ్రాసియు, నుపన్యాసము లిచ్చియుఁ, బండితులతో వాగ్వాదములు చేసియు, జనులకు దానిక్రౌర్యమును బోధింపసాగెను. కొద్దిమందిజనులు రామమోహనరాయలు పక్షము వహించిరిగాని, లక్షోపలక్షలు పూర్వాచారపరాయణులయి సహగమనము లేకపోయినచో హిందూమతము చెడిపోవు ననియు, సనాతనమయిన యీయాచారమును కొట్టివేయక నిలుపవలసినదనియుఁ బ్రభుత్వమువారికి మరల మహజర్లఁ బంపిరి. ఛాందసు లగుపండితులు, రామమోహనరాయలను నిందించుచు గ్రంథములువ్రాసి ప్రజలమెప్పుగనిరి. అప్పటి గవర్నరుజనరలుగా రగు లార్డు విలియంబెంటింకు దొరగారు రామమోహనరాయలవాదములు యుక్తియుక్తములుగ నున్నవని గ్రహించి లోకోపకారకమగు నతనియుద్యమమునకుఁ దోడ్పడి యీదురాచారపిశాచము నడుగంట ద్రొక్కఁదలఁచి 1829వ సంవత్సరము డిశెంబరు నాలుగవతారీఖున సహగమనము నిషేధించుచు నొకచట్టము నిర్మించి పుణ్యము గట్టుకొనెను. చూచుటకు, వినుటకుఁ దలఁచుకొనుటకు నయితము నతిదారుణమగు నీయాచారమును నిర్మూలము చేసిన మహానుభావుఁడు రామమోహనరాయ లగుటచే భరతఖండమునందలి స్త్రీపురుషు లందఱు నాచంద్రతారకముగ నతనికిఁ గృతజ్ఞులయి యుందురు గాక! రామమోహనరాయలు కలకత్తాకువచ్చిన క్రొత్తలో వేదాంతశాస్త్రమును వేదాంతసారమును బంగాళీభాషలోనికిఁ దర్జుమాచేసెను. 1816-17 సంవత్సరములలో నతఁడు ముఖ్యములగు నుపనిషత్తుల నింగ్లీషుభాషలోనికి బంగాళీభాషలోనికి భాషాంతరీకరించెను. ఇట్లు వేదాంతరహస్యముల బయలుపరచినందుకు పూర్వాచారపరాయణులు రామమోహనుని నిందింప నారంభించిరి. ఈమహాత్ముఁడు సంస్కృతముఁ జదివి వేదశాస్త్రముల శోధించుటయేగాక అరబ్బీభాష నేర్చుకొని తురకలవేదమగు ఖొరాను జదివి, హీబ్రూ, గ్రీకుభాషల నేర్చుకొని క్రైస్తవుల వేద

ముగ బైబిలు పఠించి తద్గ్రంథములసారములు గ్రహించి దోషముల బైలుపెట్ట నారంభించెను. 1820వ సంవత్సరమున నితఁడు యేసుక్రీస్తు ధర్మములనుగూర్చి, బంగాళీసంస్కృతభాషలలో గ్రంథములు వ్రాసి ప్రకటించి యందు క్రీస్తు మతగురు వగునుగాని, దేవునికుమారుఁ డగుట యబద్ధమని వ్రాసెను. ఇందుచే నచ్చటిక్రైస్తవమతబోధకులకును, రామమోహనునకును గొప్పవివాదములు బైలుదేర క్రైస్తవులు వ్రాసినదానికి రామమోహనుఁడును, రామమోహనుఁడు వ్రాసినదానికి క్రైస్తవులును ఉత్తరప్రత్యుత్తరముల నిచ్చుకొనుచు వచ్చిరి. ఇంతవఱకు రామమోహనుఁడు తాను వ్రాసినగ్రంథములన్ని క్రైస్తవమతబోధకుల ముద్రాయంత్రములోనే యచ్చువేయుచు వచ్చెను. ఆ మతబోధకులు రామమోహనునివాక్యములు యుక్తియుక్తములుగ నుండి జనుల యాదరణ బడయుచుండుటచే నీర్ష్యఁ జెంది యతఁడు తమవ్రాఁతల ఖండించుచు నిచ్చిన కడపటిప్రత్యుత్తరము నచ్చువేయమనిరి. రామమోహనుఁడు పంతము వచ్చినప్పుడు తీసిపోవువాఁడుకాఁడు గావున దానే స్వయముగ నచ్చుకూటమును గొని తనగ్రంథము నచ్చొత్తించెను. ఈయిరువురగ్రంథము లింగ్లాండునకుఁ బోయినప్పు డచ్చటివారు, బంగాళాబ్రాహ్మణునియుక్తులకును, సర్వతోముఖపాండిత్యమునకును, వాదనైపుణ్యమునకును జాల మెచ్చుకొనిరి.

ఈసత్పురుషునకుఁ బరిశుద్ధ మగునుపనిషన్మతముపై నభిమాన మెక్కుడు గలుగుటచే భగవద్ధ్యానమునిమిత్తము కలకత్తానగరములో నాత్మసభయనుపేర నొకసభ నేర్పరచెను. పిమ్మట వేదాధ్యయనము నభివృద్ధి చేయఁదలఁచి వేదమందిర మను నొకపాఠశాలను 1817వ సంవత్సరమున స్థాపించెను. ఈమతములోఁ జేరినవారందఱు ప్రార్థనాదికములు చేసికొనుటకు 1830వ సంవత్సరమున నతఁడు బ్రహ్మమందిరము నొకదానిని గట్టించి, దానిపోషణకయి కొంతమూలధనముసయిత మొసంగెను. హిందువులకు, మహమ్మదీయులకు, క్రైస్తవులకు నుపయుక్తముగ నుండునటుల నొకమతము నిర్మింపఁదలఁచి, యుపనిషత్తులలో నున్నపరమార్థమును గ్రహియించి, యీమతమును గల్పించెను. ఆయన వేదములనుమాత్రమే ప్రమాణములని యొప్పుకొనక, బైబిలు, ఖొరాను, జండవస్త మొదలగు మతగ్రంథములలోనున్న సత్యమును ధర్మమును గ్రహింపవలసినదే యనియు, నవి యన్నియు వేదములవలెఁ బ్రమాణములే యనియు, నమ్మి ప్రజలకు బోధించుచుండెను. బ్రహ్మసమాజమే, పూర్వఋషుల పరిశుద్ధాస్తికమతమని యీయన గట్టిగ నమ్మెను. తాను మతసిద్ధాంతములను, సంస్కరణవిషయములను, బ్రకటించుటకయి సంబంధుకౌముది యను నొకపత్రికను స్వభాషలోఁ బ్రకటించుచు

వచ్చెను. అతని ప్రతిపక్షు లందఱుం జేరి ధర్మసభ యనుపేర నొకసమాజ మేర్పఱచి చంద్రిక యను నొకపత్రికను బ్రచురించి, రామమోహనుని నిందించుటయే ప్రధానముగం జేసికొనిరి. మతసంస్కారమందేగాక, సంఘసంస్కరణమునందును నాతఁడు గట్టిపని చేసెను. స్త్రీపునర్వివాహములు శాస్త్రీయము లనియు, నింద్యములు కావనియు, నతనియభిప్రాయము; బంగాళాదేశములో కులీనులను నొకతెగబ్రాహ్మణులు గలరు. వారిని పరమపావను లని యచ్చటిజనులు నెక్కుడు గౌరవింతురు. పవిత్రు లగుకులీన బ్రాహ్మణులతో సంబంధము చేయుట కడుగౌరవమని యెంచి యాదేశబ్రాహ్మణులు తమ కన్యలకు తగు వరులు దొరకనందున, వేలకొలఁది రూప్యముల కట్నముల నిచ్చి, యొక్కొక్కకులీనునకు ముప్పది, నలుబది, ఏఁబది, యొకప్పుడు నూఱుమందికన్యలను గట్టఁబెట్టెడి యాచారము గలదు. ఇట్లు వివాహము చేసికొన్నభర్త మృతినొందు నప్పుడు నూఱుగురుభార్యలు సహగమనము చేయవలసి యుండెను. దగ్గఱనున్నవారు భర్తతోఁ గలసియు, దూరమున నున్నవారు మగనియొక్క గుడ్డపేలికయో, మఱియే వస్తువో తెప్పించి మీఁద వేసికొని తమయున్నయూళ్లలో చిచ్చుఱికి శరీరత్యాగము చేయుచుందురు.

రామమోహనుఁడే ముగ్గురుభార్యలను వివాహము చేసికొనెను. మొదటిభార్య చిన్నతనమందే మృతినొందుటం జేసి, ఆయన మఱియొకకన్యను వివాహము చేసికొనెను. ఈధర్మపత్ని జీవించియున్నపుడే రామమోహనునకుఁ దండ్రిగారు మఱియొకకన్యను పాణిగ్రహణము చేయించిరి. బహుభార్యాస్వీకారమువలనఁ గలుగు నష్టములను స్వయముగఁ జూచుటంజేసి యీదురాచారమును నిర్మూలించుటకయి యతఁడు ప్రయత్నించెను. కాని వెంటనే కృతకృత్యుఁడు గాఁడయ్యె. ఈసంస్కారములుగాక దేశమున కతఁడింక ననేకోపకారములు చేసెను.

హిందువులకుఁ బాఠశాలలు స్థాపించి యాంగ్లేయభాష నేర్పింపుఁడని గవర్నరు జనరలుగారగు, అమ్హరస్టుప్రభువుగారి కొకయుత్తరము వ్రాయుటయేగాక, నిరువురు దొరలతో గలిసి 1817వ సంవత్సరమున హిందూకళాశాలలు స్థాపించెను. బంగాళీ భాషలో వచనకావ్యములు వ్రాయుటకు దారిదీయుటయేగాక, యీభాషలో లలితపద గర్భితము లగుకృతుల ననేకములు రచించెను. ఆకృతులు వంగదేశపు స్త్రీపురుషు లిప్పటికిని బాడుచుందురు.

రామమోహనునకుఁ జిరకాలమునుండి యూరపుఖండమును ముఖ్యముగ నింగ్లాండు దేశమును జూడవలయు నని యభిలాష యుండెను. స్వదేశమున తనతోడిప్రజలకుఁ

జేయవలసిన సత్కార్యము లనేకము లుండుటంజేసి యడిషలు కతనికిం బోవీలు చిక్కఁడయ్యె! 1830వ సంవత్సరమున నతనియభిలాషకు ననుగుణముగ నొకయదను గలిగెను. అప్పటి ఢిల్లీచక్రవర్తి, పేరునకుమాత్రము సార్వభౌముఁడయి యుండి యేలుటకు రాజ్యము, ననుభవించుట కైశ్వర్యములేక, తనదీనదశ నింగ్లాండులోని పార్లమెంటు మహాసభవారికిఁ దెలియఁజేసికొనఁగోరి తా స్వయముగఁ బోఁజాలక తనపక్షమున నీమహాఁ బొమ్మని రామమోహనుని బ్రార్థించి, యతనికి రాజా యనుబిరుదము నిచ్చి, తగుధన మిచ్చి పంపెను. తనయభిలాషకు, ఢిల్లీశ్వరుని బనికిం దోడుగ, రామమోహనునకుఁ గర్తవ్య మింకొకటి యుండెను.—సహగమనము నిచ్చటి గవర్నరుజనరలుగారు మాన్పించి రనుకోపమున బూర్వాచారపరాయణులు, ప్రాచీనమగు నాయాచారమును నిలుపుఁడని పార్లమెంటువారికి పలుమహజర్ల నంపిరి. రామమోహనుఁడు గవర్నరుజనరలుగారు చేసినపని మంచిదనియు, నాయాచారము దుదముట్ట నిర్మూలింపవలసిన దనియు, ప్రజలవలనఁ గొన్నిమహజర్ల వ్రాయించి వానింజేకొని, స్వయముగ పార్లమెంటువారికి సమర్పింపఁ దలఁచి 1830వ సంవత్సరము నవంబరు 15వ తారీఖున నతఁ డింగ్లాండునకుఁ బయనమయిపోయెను. మన మెఱిఁగినంతవఱకు సముద్రయానము చేసినబ్రాహ్మణులలో నితఁడే మొట్టమొదటివాఁడు. అతనికీర్తి యతని కన్న మున్నె యింగ్లండునకుఁ బోయి నెలకొనియుండుటచే వాని నందఱు గారవించిరి. రాజదర్శనము స్వయముగఁ జేయుటయేగాక యాయనపట్టాభిషేకసమయమున, రామమోహనరాయ లన్యదేశపు రాయబారులతో సమానముగ గౌరవింపఁబడెను. ఆకాలమునం దాదేశమున నున్నకవీశ్వరులు, తత్వశాస్త్రజ్ఞులు, చరిత్రకారులు, ప్రకృతశాస్త్రపండితులు వాని పరిచయము చేసికొనుట గౌరవహేతువని యెంచి, స్వయముగ వచ్చి చూచియు, జాబులువ్రాసి ప్రత్యుత్తరముల దెప్పించుకొనియు దనివినొందిరి. హిందూదేశపురాజకీయవ్యవహారముల విషయమయి రామమోహనుఁడు పార్లమెంటు కమిటీవారివద్ద కడునిపుణముగ, సాక్ష్య మిచ్చెను. సహగమనము నుద్ధరింపవలయునని ఛాందసులు పంపినమహజర్లు పార్లమెంటుసభవారు విచారణ సేయునపుడు రామమోహనుఁడు స్వయముగ నచటనుండి తాను దెచ్చిన మహజర్లు వారికి సమర్పించి, చెప్పవలసినసంగతులఁ జెప్పి యాయాచరము రూపుమాయునట్టు చేసెను. 1831వ సంవత్సరమున నాతఁడు ఫ్రాన్సుదేశమునకుఁబోయి యచట కొంతకాలముండి ఫ్రెంచిభాష నేర్చికొనెను. అచట నున్నకాలములో నతఁడు ఫ్రెంచిరాజును సందర్శించి రెండుమూడుమారు లాయనతో విందు లారగించి గౌరవపాత్రుఁడయి యింగ్లాండునకు మరల వచ్చి యాంగ్లేయభాషలో కొన్నిగ్రంథములు వ్రాసెను. ఆగ్రంథముల శైలికిని, నిపుణత్వమునకును, మంచిమంచి యింగ్లీషుకవులు వాని

నుగ్గడించి మెచ్చుకొనిరి. ఇట్లుయూరపుఖండములో సుప్రసిద్ధుఁడయి కీర్తిగాంచిన, యీ మహాపురుషుఁడు మరల స్వదేశమునకు వచ్చి తనయాత్రావిశేషముల దనమిత్రులకుఁ దెలుప నతనికి కాలము లేదయ్యెను.

1833వ సంవత్సరము సెప్టెంబరునెలలో డాక్టరు కార్పెంటరుదొరగారు వానిని బ్రిస్టలునగరమునకు బిలుచుకొనిపోయి, గౌరవించెను. అక్కడ నుండఁగ నాయనకు, సెప్టెంబరు 10వ తారీఖున జ్వరము తగిలెను. ప్రజ్ఞావంతు లగువైద్యు లెన్నిచికిత్సలఁ జేసినను, కార్పెంటరుదొరగా రెన్నిశ్రమలఁ బడినను, నవియెల్ల నిరర్థకములు కాఁగా హిందువులభాగ్యదోషమున రామమోహనరాయలు సెప్టెంబరు 27వ తేదిని కాలధర్మము నొందెను. అక్కడిమిత్రు లామహాత్ముని బ్రిస్టలునగరసమీపమున భూస్థాపితము చేసిరి. పిమ్మట పదిసంవత్సరములకు రామమోహనుని ప్రియమిత్రుఁడగు ద్వారకనాథఠాగూరు గారు సీమకుఁ బోయి యాపురుషశ్రేష్ఠునకు నొకసమాధి గట్టించి ధన్యుఁడయ్యెను.

పదునాలుగేండ్లవయసు వచ్చినదిమొదలు దేశమునిమిత్తము, దేశస్థులనిమిత్తము, పలుకష్టములఁబడి, యీసుజనుఁడు తుదకు పరదేశమున బంధుమిత్రులు లేనిచోట దేశోపకారార్థమై ప్రాణముల విడిచెను. ఈలోకోపకారకుని ఋణము భరతఖండవాసు లెన్నటికిని దీర్చుకొనఁజాలరు. ఈతఁడు కార్యశూరుఁడు. అవసర మయినయపుడు సకలకష్టములకులోనై ధైర్యముతో నిలిచి తనకు మంచిదని తోఁచెడు కార్యమును నిర్వహించెడువాఁడు; దయామయుఁడు, ధర్మశాలి; స్వగౌరవమును జక్కఁగఁ గాపాడుకొనుచు నీతిమార్గము ననుసరించువాఁడు. మతవిషయమునను స్వదేశవిషయమునను ప్రతిమనుష్యునకుస్వాతంత్ర్య ముండదగునని యతనివాదనము. ఒకనాడు డాక్టరు మిడిలుటన్ అను క్రైస్తవమతబోధకుఁడు రామమోహనునిం బిలిచి క్రైస్తవమతమునం గలియుమని బోధించి దానివలన పలుకుబడి, ధనము, అధికారము, గౌరవము, కలుగునని నొక్కి చెప్పెను. ఆమాటలు విని రామమోహనుఁడు కోపోద్దీపితుఁడయి తుచ్ఛగౌరవములు సంపాదించుటకయి తాను మతము మార్చుకొన నని వానితో స్పష్టముగఁ జెప్పి యానాఁడుమొదల లాదొరగారితో స్నేహము మానెను. గ్రంథవిస్తరభయమున మానవలసెగాని రామమోహనుని యౌదార్యవినయశాంతగుణములను దెలుపుకథ లనేకము లున్నవి. అంతటి నీతిశూరుఁడు లోకోపకారియు, మరల నిప్పటివఱకును మన భరతఖండమున జనియింపకపోవుటయే, యీతఁడు సుగుణసంపదలో నద్వితీయుఁడని చెప్పుటకుఁ దార్కాణము. ఏకమేవా ద్వితీయం బ్రహ్మ యను నుపనిషద్వాక్యమును నమ్మి యీతఁడు విగ్రహారాధనము నిరాకరించి పరిశుద్ధాస్తికమతము నవలంబించెను గావున దయామయుఁడగు నాపరబ్రహ్మమే యీతనియాత్మకు శాశ్వతానంద మిచ్చుఁగాత!

# భౌతికభూగోళశాస్త్ర సంగ్రహము.

## మొదటి ప్రకరణము.

### ఉపోద్ఘాతము.

పాఠశాలలయందుఁ జదివెడు ప్రతిబాలుఁడును ప్రతిబాలికయుఁ గొంచెమయినను భూగోళవిషయమై చదువుచునే యుందురుగదా. అట్టివారు చదివెడిది సాధారణముగా మొట్టమొదటఁ దాముండుమండలములను గూర్చియు రాజధానినిగూర్చియు; తరువాతఁ దమదేశములోఁగల యితరరాజధానులనుగూర్చియు; పిమ్మటఁ దమదేశమున్నఖండమునుగూర్చియు నందలి యితరదేశములనుగూర్చియు; అనంతరమున నితరఖండములనుగూర్చియు, అయియుండును. గోదావరిమండలములోని పాఠశాలలయందలి విద్యార్థులు ప్రారంభమున గోదావరిమండలమునుగూర్చియు; తరువాత గోదావరిమండలమెందుండెనో యాచెన్నపురిరాజధానినిగూర్చియు; పిమ్మట హిందూదేశమునందుఁ గల బొంబయి కలకత్తా మొదలయిన యితరరాజధానీప్రదేశములను గూర్చియు; అనంతరమున మనహిందూదేశమువంటి పెక్కుదేశములను గల యాసియాఖండమును గూర్చియు, కడపట యూరపు మొదలయినఖండాంతరములను గూర్చియుఁ జదువుదురు. వీరు చదివెడి దంతయు సామాన్యముగా మనుష్యులచేఁ జేయఁబడిన జలస్థలవిభాగములను గూర్చియు, ఆయాదేశముల దొరతనములను గూర్చియు; ఆయాదొరతనములవారి ప్రధానపట్టణములు లోనుగాఁ గల పురగ్రామాదులను గూర్చియు; అందు వసించుజనుల వ్యాపారాదులను గూర్చియు; వారు పండించు పంటలు చేయు శిల్పములు మొదలయినవానిని గూర్చియు; పంటలకును వాణిజ్యమునకును ముఖ్యాధారము లయినకాలువలు బాటలు మొదలయినవానిని గూర్చియు; దేశసంరక్షణమునకయి యుంచఁబడిన సేనలు మొదలయినవానినిగూర్చియు, అయియుండును. ఇంచుమించుగా నీవిషయములన్నియు రాజ్యాంగముతో సంబంధించినవని చెప్పవచ్చును. ఇవిగాక భూగోళమునందు మన మనుదినమును జూచుచుండెడు స్వాభావికవిషయము లనేక

ములు మనము తెలిసికోవలసినవియున్నవి. తెలిసికోవలసినవిషయము లెట్టివో తేటపడుటకయి యనుదినము మనకన్నులయెదుటఁ గనఁబడుచుండెడు ప్రకృతివైచిత్ర్యములను గొన్నిటిని ముందుగా నిచ్చట నుపోద్ఘాతరూపమునఁ బ్రదర్శించుచున్నాము.

దీనిం జదువువారు గోదావరీతీరప్రదేశములయందు వసించు విద్యార్థు లనుకొందము. రాజమహేంద్రవరమునందలి శాస్త్రపాఠశాలలోఁ జదువుకొనుచుండెడు విద్యార్థులు వేసవికాలపుసెలవులకుఁ దరువాత నొకసాయంకాలమునందు పాఠశాల విడిచినపిమ్మట గుంపులుగూడి తమగృహముల కరుగుటకయి బైలుదేఱి మిత్రులతో సంభాషించుచు చల్లపాటువేళ పాతగట్టుమీఁదినుండి నడచుచుండునప్పుడు గోదావరీనదివంక దృష్టి సారించినపక్షమున, అడుగున నెంతోదూరమున నీటిప్రవాహమును, ప్రవాహమధ్యమున నక్కడక్కడ లంకలును, ప్రవాహమునకును గట్టునకును నడుమను విశాలమయిన యిసుకతిప్పయును, నేత్రగోచరము లగునుగదా. ఆదారినే మఱునాఁడు పగలు పదిగంటలకు మరల శాస్త్రపాఠశాలకుఁ బోవునప్పుడు నదివంకఁ జూచినపక్షమునఁ గొన్నిసమయములయం దెంతో వ్యత్యాసము కనఁబడును. నిన్నటిదినము బట్టబయలుగానున్న యిసుకతిప్ప కొంచెము వెల్లివొడిచి కొంత మునుఁగుచున్నట్లు కానవచ్చును; నిన్నటిదినము నీలవర్ణముగానున్న తేటనీరు కలఁగఁబాఱి యెఱ్ఱబడి కల్మషజలముయినట్లు కానవగును; నిన్నటిదిన మెంతో లోఁతున నున్న ప్రవాహము కొంత పయికి లేచినట్లు కానఁబడును. ఆసాయంకాల మయిదుగంటలకు మరల నింటికిఁ బోవుచు నదివంకఁ జూచినపక్షమున వేఱొకవిధముగాఁ గానఁబడవచ్చును. ప్రాతఃకాలమునఁ గొంతవఱకు మునిఁగియున్న యిసుకతిన్నె యిప్పుడు పూర్ణముగా జలమయమయి యదృశ్యమగును; ప్రొద్దుటికంటెను జలముపైకి లేచి గట్టును సమీపించి నురుగుతోను పర్ణములు మొదలయినవానితోను నిండి మహావేగముతోఁ బ్రవహించుచుండును; గతదినమున నదీగర్భమునం దక్కడక్కడఁ గానఁబడుచుండిన లంకలలోఁ జిన్నవి యదృశ్యములయి పెద్దవి చిన్నవిగాఁ గానఁబడుచుండును. నాఁటి కింటికిఁబోయి వఱద సావకాశముగా చూడవలెనన్న యభిలాషముతో మఱునాఁటిప్రాతఃకాలమున మఱింతవేగముగా భోజనముచేసి పుస్తకములను జేతఁబట్టుకొని మిత్రులను గొందఱిని వెంటఁబెట్టుకొని బైలుదేఱి మెల్లఁగా పాతగట్టుమీఁద శాస్త్రపాఠశాలవంక నడవ నారంభించినపక్షమున, నది మఱింత వినోదకరముగాఁ గనఁబడవచ్చును. అప్పుడు నది పూర్ణముగాఁ బైకి లేచి రెండువైపులను గట్టుపైభాగమునంటి నిన్న సగముసగ మగపడుచున్న లంక లన్నియు నిండుగా మునిఁగి

పోయి మూఁడుపాయలుగాఁ బాఱుచుండిన నదియంతయు నేకమయి మహార్ణవమువలెఁ బ్రవహించుచుండును; ఇప్పు డాకులు కొమ్మలు మొదలయినవిమాత్రమే కాక వేళ్ళతోఁ బెల్లగిలిన మహావృక్షములుసహితము ప్రవాహవేగమునఁబడి దక్షిణాభిముఖముగాఁ గొట్టుకొనిపోవుచుండును; అనేకులు తెప్పకొయ్యలమీఁద నెక్కి యీఁదుకొనిపోయి ప్రవాహములోఁ బడిపోవుచున్న కఱ్ఱలను బట్టుచుందురు; కొందఱు చిన్నపడవలలో నేటిమీఁదఁబోయి కొట్టుకొనిపోవుచున్న కట్టెలతో పడవలు నింపుకొని ప్రవాహవేగముచేత బైలుదేఱినస్థలమునకు మరల రాఁజాలక యేటిదిగువ నెంతోదూరమున దరి చేరుచుందురు; ఒడ్డునఁ జేరి బాలకులు తెట్టె నీవలావలలకుఁ ద్రోయుచు మాఱుడుబుఱ్ఱల కొఱకును నెమిలియీఁకలకొఱకును వెదకుచుందురు; ఒకానొకప్పుడు ప్రవాహము పల్లెలను ముంచివేసినట్లు సూచించుచుఁ జేటలను బీటలను దరికిఁ జేర్పఁగా మూఁగిన మూఁకలు వానిం గైకొనుటకయి యొండొరులను మించి త్రోపులాడుచుందురు; ప్రవాహమున కెదు రీఁదలేక యొకపామో యడవిపందియో కొట్టుకొనివచ్చి తీరము చేరినచో భయపడి గుంపులు గూడియుండినబాలకులు నానాముఖములఁ బరుగులిడి చెల్లాచెదరగుచుందురు. పాఠశాల విడిచినతరువాత సాయంకాలమింటి కామార్గమునఁ బోవునప్పుడు చూచినచో నది ప్రాతఃకాలమునఁ దాను జూచినట్లు లేక నీరు క్రిందికి దిగుచున్నట్లు కనఁబడవచ్చును. నీటివడిచేత గట్టునుండి విఱిగిపడిన మంటిగడ్డలు మొదలయిన వన్ని జందంము స్పష్టముగాఁ గంటికి గోచరములగుచుండును. నాఁ డింటికిఁ బోయి యా రాత్రి సుఖనిద్రచేసి తెల్లవాఱి లేచి మరలఁ జూడవచ్చినచో, నిన్నటిదినమ [illegible] గట్లను దాఁటి నిండుగాఁ బ్రవహించుచుండిన యేటిప్పు డెంతో క్రిందికి దిగి యుభయ [illegible] గట్టునకు దూరముగాఁ బాఱుచుండును; నిన్నటిదిన మదృశ్యము లయియుండిన [illegible] లలోఁ గొన్ని మరలఁ దల చూపుచుండును; నీరు తీసిపోయిన నేలయంతయు [illegible] బూర్వమున లేని క్రొత్తయిసుకతో నిండియుండును; గట్టునకు సమీప [illegible] గోతులు కొన్ని పూర్ణముగాను గొన్ని కొంతవఱకును బురదతోడఁ బూడియుండును.

ఈయద్భుతము లయినమార్పుల నన్నిటిని జూచినవారి మనస్సులలో [illegible]ములయిన తలంపులు పుట్టకమానవు. ఇసుకతిప్పలను లంకలను ముంచివేసిన యీనీరంతయు నెక్కడనుండి వచ్చినది, మరల నానీరంతయు నెక్కడికిఁ బోయినది, [illegible] ము క్రిందట నీలమువలె నిర్మలముగా నుండిన నీరిప్పుడు [illegible] తీరంగట్ల మాఱుటకుఁ గారణ మేమి, అను నిట్టిశంక లనేకము [illegible]చించుచు వారిమనస్సులలో నెల్లను బొడమును. మనము తఱుచుగాఁ జూచుచుండెడి మఱికొన్ని కార్యము వలన నీశంకలలోఁ గొన్నిటికి సమాధానము తోఁచవచ్చును.

మఱునాఁడు విద్యార్థులు ప్రాతఃకాలభోజనము చేసి పాఠశాలకుఁ బోవ గృహము వెలువడునప్పటికి సూర్యుఁ డాకాశమునఁ జక్కఁగాఁ బ్రకాశించుచుండవచ్చును; సగముదూరము నడచునప్పటికి మింట నక్కడక్కడ చేటలంతలేసి చిన్నమబ్బు లేర్పడి, యవి యన్నియు నేకమయి కాఱుక్రమ్ముకొని పాఠశాల చేరులోపలనే పెద్దవాన కురిసి కట్టుకొన్న బట్ట లన్నియు తడిసిపోవచ్చును; వీధులవెంబడిని నీరు ప్రవాహములు కట్టవచ్చును. దీనియనుభవమువలన నదీప్రవాహములనుగూర్చి మనకుఁ గొంత తెలియవచ్చును. భూమిమీఁదికి నీరు వర్షమువలన వచ్చు ననియు సందుగొందులనుండి వచ్చిననీటికాలువ లన్నియు నొక్కటిగాఁ జేరి వీధిలోఁ బెద్దప్రవాహముగాఁ బాఱినట్లే వర్షజలమువలనఁ గలిగిన ప్రవాహము లనేకములు కూడి నదిగా నేర్పడి వెల్లువ కట్టియుండు ననియు, ఊహచేసి తెలిసికోవచ్చును. వాననీరు తేటదైన దనియు, దానికి వచ్చిన యెఱ్ఱరంగు భూమివలనఁ గలిగిన దనియు, మనమీఁదను మనబట్టల మీఁదను బడిన వాననీటివలనను వీధులలోఁ గాలువలుగట్టి పాఱుచుండిన నీటివర్ణమువలనను దెలియవచ్చును. మనమీఁదఁబడిన వాననీరు తేటగా నుండుటయు వాననీటివలన మనబట్టలు మురికి కాకుండుటయు మన కనుభవసిద్ధము లగుటచేత వర్షజలము స్వచ్ఛమైనదనుట స్పష్టము. వీధికాలువలోని నీ రెఱ్ఱపడుటయు వాన వెలిసినతరువాత చూచినప్పు డావలికు బాటపైనున్న సన్నని మన్నంతయు నీటితోఁ గొట్టుకొనిపోయి యదృశ్యమగుటయు, మన కానదిలోనినీరు కలుష మగుటకుఁ గారణము నదీప్రవాహము పొడుగునను భూమిలోనుండి కొట్టుకొనివచ్చి నీటిలోఁ జేరిన మెత్తనిమన్నే యని తెలుపుడు చేయును. మనము నదిలోని బిందెఁడు కలుషజలమును దెచ్చి యొకదిన ముట్టె యుంచిన పక్షమున, నీరు మరల తేటగ నేర్పడును; పైనున్న యా తేటనీటిని వే ఱొకబిందెలో మెల్లఁగా వంచివేసితిమేని, నీటియడుగున మృదువైనబురద నిలిచియుండును. నీరు శీఘ్రముగా తేటపడవలసినపక్షమున, మన మాకలుషజలములో నిండుపుగింజలగంధము మొదలయినవానిని గలిపి శుద్ధపఱుతుము గదా? బిందెలోని నీటివలెనే కదలకుండినపక్షమున నదీజలముసహిత మొక్కదినములోనే తేటయియుండును గాని సదా పాఱుచుండుటచే కలఁగిననీరు మరల తేఱుటకు నెలలుపట్టును. ఇట్లు వఱదలలో భూమినుండి కొట్టుకొని వచ్చిన బురదలో నల్పభాగము చెల్లిపొడిచిన నేలలలో నిలిచినను విశేషభాగమే యేటి సముద్రగామి యగుచుండుటను, ఇట్లొక్క గోదావరీనదినుండి మాత్రమే కాక మన దేశమందలి నూఱులకొలఁది యితరనదులనుండియు దేశాంతర ఖండాంతరములయందలి నదులనుండియుఁ బ్రతిసంవత్సరమును భూమిలోనిమన్ను పరిమితముగా సముద్రములోఁ

చేరుచుండుటను, తలఁచుకొన్నప్పుడు క్రమక్రమముగా భూమియంతయు సముద్రమువాలయి నశింపదా యన్న శంకతోఁచవచ్చునుగాని యీయంశమును ముందుకు విడిచిపెట్టి యిందుతో సంబంధించిన ముఖ్యాంశములకు వత్తము.


పయిని జెప్పినదానినిబట్టి నదీప్రవాహములకు జలము వర్షమువలన వచ్చుననియు, వర్షములు మేఘములవలనఁ గలుగుననియు, మనకొకవిధముగాఁ దెలిసినను మేఘము లెట్లు కలుగునన్నయంశము మనకింకను దురవగాహముగానే యుండును. మన మొక కుండలో జలముపోసి యెండలో బయలునఁ బెట్టియుంచినపక్షమున దినదినక్రమమున నందలి జలము తఱుగుచుండుటయు, కొంతకాలములో జలమంతయు నదృశ్యమయి కుండవట్టిదగుటయు, మనము చూచుచున్నాము. కుండలోని జలమంతయు నేమయిపోయినది? ఎండవేఁడిమి చేత నావిరిరూపమును బొందివాయువులోఁ గలిసి పయికెగిరిపోయినదని కొంచెము పరిశీలించినచో మనకు బోధపడును. దీనినిబట్టి సముద్రములు, నదులు, చెఱువులు మొదలైనవానిలోని జలము సూర్యాతపము చేత సదా సూక్ష్మరూపమును వహించి యావిరియై వాయువులోఁ జేరి మింటికెగయుచుండునని మనము సులభముగాఁ దెలిసికొనవచ్చును. ఇట్లు దినదినమును జలాశయములనుండి బాష్పరూపమునఁ బైకి లేచుచు నాకాశమునఁ గూడఁబడినజలమే మేఘము. జలాశయములలో నెల్ల సముద్రములే మిక్కిలి పెద్దవగుటచేత సముద్రములనుండి లేచిననీరే మేఘోత్పాదనమునకు ముఖ్యాధారమని చెప్పవచ్చును. మేఘము లేర్పడుటకు సముద్రజలమే ముఖ్యకారణమయిన పక్షమున, మేఘములు సముద్రోపరిభాగముననే విశేషముగాఁ బొడచూపి సముద్రములోనే విశేషముగా వర్షింపవలయునుగాని సముద్రమున కత్యంతదూరప్రదేశములయందెట్లు పెద్దవానలు కురియుట తటస్థించునని కొందఱికి శంక తోఁచవచ్చును. దానికిని గారణము లేకపోలేదు. వాననీరంతయు సముద్రములోనే పడినపక్షమున సస్యాదులకును మనుష్యాదిజంతువుల స్నానపానాదులకును బ్రయోజనపడక వ్యర్థము కావలసి వచ్చునని సర్వజీవదయాపరుఁడయిన యీశ్వరుఁడు దానికిఁ దగినయేర్పాటు చేసియున్నాఁడు. సముద్రోపరిభాగమునం దేర్పడిన మేఘములును సముద్రమునుండి లేచి యావిరిరూపమున గాలిలోఁ జేరినయుదకమును వాయుచలనము చేత నానాముఖములఁ జెదరఁగొట్టఁబడి నేలవంకకుఁ బోవుచుండును. సముద్రపుగాలి విశేషముగా వీచుచుండెడికాలములో మేఘాదులు మెట్టను బహుదూరము పోవును. జ్యేష్ఠమాసము మొదలుకొని భాద్రపదమాసమువఱకును గాలి సముద్రమునుండి వడిగా మెట్టకు వీచును. ఆవాయుబలము చేతనే మేఘములు మెట్టవంకకుఁ గొనిపోఁబడి వర్షించును. ఆకాల

మునే వర్షాకాలమని చెప్పుదుము. వేసవికాలమునం దెండవేఁడిమిచేత మింటికి నెగసిన జలము మేఘాదిరూపమున గాలిబలముచేత నేలవంక మింటనుబోయి నేలపయినిబడును. నేలనున్న జలాశయములలోనిజల మాకాశమున కేల పోవలెను, ఆకాశముననున్న మేఘములలోనిజలము నేల కేల రావలెను, అన్నయంశములు ముందు వివరింపఁబడును. వాన లధికముగా కురియునుగనుక వర్షఋతువునందే నదులు వెల్లువలు పొడుచును. ఎండకాలములోను చలికాలములోను గాలి సాధారణముగా మెట్టునుండి సముద్రమునకు వీచును. ఆగాలిలో నీరంతగా నుండదు. గాలిలోఁ జేరినయావిరి యావిరిగానే యెల్లప్పుడు నుండదు. స్వచ్ఛముగానున్న యాకాశములోఁ గొంతసేపటికి మేఘము లేర్పడి కూడుచుండుట మన మప్పుడప్పుడు చూచుచున్నాము. అవి యితరస్థలముల నుండి వచ్చినట్లు కనఁబడవు. కాఁబట్టి యవిగాలిలో నున్న యావిరివలననే యాకాశభాగమునఁ గ్రొత్తగా నేర్పడవలెను. ఈమేఘములు కొన్ని యెండవేఁడిమిచేత మరల నావిరిగా కరఁగిపోయినను, కొన్ని దట్టముగా కాఱు గ్రమ్ముకొని కొన్నిసమయములయందు భూమిమీఁద ధారాపాతముగా కుంభవృష్టి కురియును. ఈవానలే నదీప్రవాహములకుఁ గారణములగుట స్పష్టమేకదా? నదులన్నియు నెప్పుడు నేకదిక్కునకే యేల ప్రవహింపవలెను, మెట్టునుండి సముద్రమువంకకుఁ బాఱుచుండునట్లే కొన్నినదులు సముద్రమునుండి మెట్టువంక కేల పాఱఁగూడదు, అను ప్రశ్నములను గొందఱిమనస్సుల నంకురింపవచ్చును. నీరు మెఱకనుండి పల్లమునకు వచ్చునుగాని పల్లమునుండి మెఱకకు బోదు. పొలమునకు నీరు పాఱించుటకయి నీటికాలువ లంతకంతకు పల్లముగా నుండవలయు ననుట మీ రెఱిఁగినయంశమేకదా? పల్లములో నున్నజలమును పొలమున కెక్కింపవలెనన్నచో గూడలతోనో యితరసాధనములతోనో నీటి నెత్తుప్రదేశమున కెక్కించి యక్కడనుండి పొలమునకు పాఱునట్లు చేయవలెను. ఈహేతువుచేతనే నదు లెల్లప్పుడు మెఱకనుండి పల్లమునకుఁ బ్రవహించుచుండును. నదియొక్కనీరు సమానముగా నున్నట్లు కనఁబడినను నిజమున కేటవాలుగానే యుండును. గోదావరీనదిమీఁద రాజమహేంద్రవరమునుండి పడవలలో భద్రాచలమునకుఁ బోవువారు కొన్నియడుగులు పై కెక్కుచుందురు; భద్రాచలమునుండి రాజమహేంద్రవరమునకు వచ్చువారు కొన్నియడుగులు క్రిందికి దిగుచుందురు. చేలకాలువలవలెనే నదులకును జల మెగువనుండి దిగువకే పాఱవలసినదగును, ఆపనికి గూడలును మనుష్యులునువలె మేఘములును వాయువులును సాధనములయి యున్నవి.

భూమిమీఁదియున్న జలముతోఁ గలిసి నదీవేగమున సముద్రమునఁ జేరుచుండుట, సముద్రజల మావిరిరూపమును దాల్చి గాలిలోఁ గలిసి మేఘము లగుచుండుట, వాయుశక్తిచేత మేఘము లాకాశమున నానాముఖములఁ జెదరి సమస్తదేశముల వర్షము కురియుచుండుట, మొదలయిన మనకన్నులయెదుటఁ బ్రతిదినమును నడుచుచుండెడు కొన్ని మార్పులనుగూర్చి మన మిప్పు డించుక ముచ్చటించియున్నాము. ఆకాశమునందును, భూమిమీఁదను, జలములోను, వాయువులోను, నిత్యమును మనకు నేత్రగోచర మగుచుండెడి యిట్టివానినిగూర్చి తెలుపుటయే భౌతికభూగోళశాస్త్రముయొక్క పని. ఇట్టివిషయములు పయిప్రకరణములయందు సంగ్రహముగాఁ దెలుపఁబడును.

# భూగ్రహము.

పైకి చూచుటకు భూమి సమప్రదేశముగా నున్నట్లు కనఁబడినను గోళాకారము గలదయి, సూర్యుని చుట్టి తిరుగుచుండెడు బుధాదిగ్రహములలో నొక్కటిగా నున్నది. భూమండలమునుండి చూచునప్పుడు చంద్రాదిమండలము లెట్లు మనకు గుండ్రముగా కనఁబడునో యట్లే మఱియొక గ్రహమండలమునుండి చూచునప్పు డందలివారికి మనభూమియు నీక్రిందిపటములోఁ జూపఁబడినట్లుమండలాకారముగానే కానవచ్చును.



భూమి గోళాకారము కలదియగుటచేత దానిస్థలభాగమమాత్రమే కాక జలభాగముసహితము మన మనుకొనునట్లు చదునుగా నుండక విలువంపుగానే యుండును. అయినను స్థూలదృష్టితోఁ జూచువారికి భూమియొక్క పయిభాగము సమస్థలముగా నున్నదను భ్రమ కలుగుచుండుటచేత నట్టివారిభ్రమను నివారించుటకయి రెండునిదర్శనములనుమాత్ర మిందుఁ జూపుచున్నాము. సముద్రపురేవున నిలుచుండి చూచెడుపక్షమున దూరమునుండి వచ్చుచున్నయోడయొక్క చాపకొయ్యలకొనలు దిఙ్మండలమున జలములోనుండి పైకి వెలువడుచున్నట్లు ముందుగాఁ గనఁబడును; ఓడ మఱికొంత సమీపించినప్పుడు తెరచాపలు కనఁబడును; ఓడ యింకను దాపునకు వచ్చినప్పుడు దానియడుగుభాగముకూడ స్పష్టముగాఁ గనఁబడును. ఓడ యుత్తరమునుండి వచ్చుచున్న నుదక్షిణమునుండి వచ్చుచున్న నుతూర్పునుండివచ్చుచున్న నుపడమటినుండి వచ్చుచున్నను భేదములేక మొట్టమొదట నూర్ధ్వభాగమందున్న చాపకొయ్యలకొనలును కట్టకడపట యధోభాగమందున్న యోడ యడుగుభాగమును నేత్రగోచరము లగును. భూమి గుండ్రముగా నుండనిపక్షమున నిట్లగుపడుటకు హేతువుండదు; మిక్కిలిపెద్దదియగుటచేత ముందుగా మన కడుగుభాగమే కానఁబడవలెను. ఒడ్డునుండి లోపలికిఁ బోయెడు నోడలయొక్క యడుగుభాగములే ముందుగా నదృశ్యము లయి, అటుతరువాత కొయ్యలు మొదలయిన యెత్తయినభాగములు దిఙ్మండలముక్రింద నడఁగి మఱుఁగగుచుండుటయు భూమి గుండ్రముగా నున్నదని స్థాపించుచున్నది. భూమ్యంతరిక్షములుకలిసికొన్నట్లుమనచుట్టునుదూరమునఁగానఁబడెడుభాగముదిఙ్మండల మనఁబడును.

# స్వయంసహాయము.

## ప్రథమభాగము

## మొదటిప్రకరణము.

### స్వయంసహాయము—దేశీయము—స్వకీయము.

తనకుఁదాను సహాయపడుట స్వయంసహాయ మనఁబడును. అనఁగాఁ దనజీవయాత్ర నడుపునపు డీప్రపంచమున నేకార్యము నిర్వహింపవలసివచ్చినను పరులసహాయమును నమ్ముకొనక ముందుగాఁ దనకుఁదాను దోడ్పడి తనకృషి జయప్రదమయినదిగాఁ జేసికొనవలెను.

మనుజునియొక్క బాహుళ్యమయిన ప్రపంచానుభవమునంతయు నొకచోటునకుఁ జేర్చి వడఁబోసి శోధించిచూచినయెడల నెవఁడు తనకుఁదానే తోడ్పడఁగలఁడో వానికే దైవమును దోడ్పడుననుట పరమసిద్ధాంతముగాఁ గన్పట్టఁగలదు. స్వయంసహాయమును గుఱించిన యుత్సాహమేనిజమైన యాత్మాభివృద్ధికి మూలశక్తిగా నున్నయది. ఇట్టి యుత్సాహమే యనేకుల కుదయించినయెడల నదియే దేశాభివృద్ధికి సత్యమగు నుత్పత్తిస్థానముగా నుండును. వెలుపలనుండి రాఁగలసహాయ మొకానొకప్పుడు బలకరమగు ఫలము నీయకపోవచ్చునుగాని లోపలనుండివచ్చెడుసహాయమే దృఢమైనశక్తిని ప్రజ్వలింపఁజేయును. జనసామాన్యమునకొఱకుఁగాని లేక యాయాతరగతులకొఱకుఁగాని యేమిచేయఁబడినను, స్వయంసహాయముయొక్క యావశ్యకమును మానవాభివృద్ధికిఁగావలసిన యుత్తేజకశక్తిని తొలగించుటయేకాని వేఱొకటిగాదు. ఎచట ప్రజలు మిక్కిలి కట్టుదిట్టములగు చట్టములచే బంధింపఁబడి పరిపాలింపఁబడుచు నడిపింపఁబడుదురో యచట వారిని దోడ్పాటులేనివారినిగాఁ జేయుటయెగాని వేఱొండుగాదు. ఎట్టిమంచి యేర్పాటులయినను మనుజునకుఁ జులుకయిన సహాయము నీయఁజాలవు. ఒకవేళ నాసిలా

అనేకములు తనంతటతాను వర్ధిల్లుటకును స్వకీయస్థితిఁ బెంపొందించుకొనుటకును మనుజుని స్వేచ్ఛగా విడిచిపెట్టవచ్చునుగాని యెల్లప్పుడును బ్రజలు తమయొక్క సుఖాభివృద్ధులు తమసత్ప్రవర్తనమువలనఁగాక సంఘమువారియొక్కయు దొరతనమువారియొక్కయు నేర్పాటులమూలముననే పడయవలెనని నమ్ముచున్నారు. మానవాభివృద్ధికొఱకొక కారణముగా నుండుధర్మశాస్త్రనిబంధనముయొక్క విలువ హెచ్చుగా మదింపు వేయఁబడుచున్నది. మూఁడుసంవత్సరములకుఁగాని అయిదుసంవత్సరములకుఁగాని యొకరిద్దఱిని నేర్పాటు చేయుటమూలముగా ధర్మశాస్త్రనిబంధనములోనికోట్ల్యంశము నిరూపించుట యెంత హృదయపూర్వకముగా నెఱవేర్చినను నయ్యది మనుజునియొక్క జీవితము మీఁదఁగాని ప్రవర్తనముమీఁదఁగాని తనయొక్క యధికారమును బూర్ణముగాఁ జూపఁజాలదు. ఇంతియగాక ప్రజల మానప్రాణవస్తువాహనాదులను రక్షించుటయందు దొరతనమువారివృత్తి వాస్తవమయినదిగాను చులుకయినదిగాను నుండక లేదనునట్టిదిగాను నిర్బంధకరమయినదిగాను నున్నయది. చట్టములు చక్కఁగాఁ బ్రవర్తింపఁ జేయఁబడినప్పుడు స్వల్పస్వార్థత్యాగముతో మానసికమయినట్టిగాని దేహసంబంధమైనట్టిగాని తమపాటుయొక్క ఫలమును బ్రజలనుభవింపఁగలరు. అయినను శాసనములెంతకఠినములుగా నున్నను సోమరులను పాటుపడువారినిగాను, అమితవ్యయముచేయువారిని దీర్ఘదృష్టిగలవారినిగాను, త్రాఁగుబోతులను శాంతమూర్తులనుగాను జేయఁజాలవు. అట్టిసంస్కరణములు స్వాచరణమువలనను, ఆయమునుమించని వ్యయము చేయుటవలనను, వైరాగ్యమువలనను, సదభ్యాసములవలనను సానుకూల్యములు కాఁగలవు. ఒకదేశముయొక్కఁగాని తెగయొక్కఁగాని ప్రభుత్వ మనునది యట్టిదేశములోఁగాని తెగలోఁగాని యున్నట్టిప్రజలయొక్క ప్రతిబింబమేగాని వేఱొండుగాదు. సృష్టిస్వభావమును బట్టి ప్రభుత్వ మెంతచక్కనిదైనను క్రమక్రమముగాఁ బ్రజలేస్థితియందుందురో యట్టిస్థితితోడ సమానమగుస్థితికి రాఁగలదు. మంచివారు మంచిగఁ బరిపాలింపఁబడుచుందురు. మూర్ఖులును భ్రష్టులును నీచముగాఁ బరిపాలింపఁబడుచుందురు. ఒకరాష్ట్రముయొక్క బలమును విలువయును నేతద్రాష్ట్రప్రజలప్రవర్తనముఁబట్టి యుండునుగాని శాసనముల ననుసరించి నిరూపింపఁగారాదు. ఎందువల్లనన దేశస్థితి ప్రజలస్థితిననుసరించియుండును. దేశాభివృద్ధి యనఁగాఁ బ్రజలయొక్క కృషి, శక్తి, న్యాయప్రవర్తనము, మొదలగువానియొక్కయభివృద్ధియే. దేశముయొక్క హైన్యస్థితి యనఁ బ్రజలయొక్క సోమరితనము, స్వార్థపరత్వము, దుర్మార్గము మొదలగు దుర్గుణములపుంజమే. ఏవిమనము సంఘ దురాచారములని భావించుచున్నారమో యవియెల్లను మనుజులనికృష్టజీవనముఁబట్టి

యేర్పడినవేగాని వేఱొండుగావు. వానినెల్లను మనము శాసనములు గల్పించి నిర్మూలముఁ జేయఁ బ్రయత్నింపవచ్చునుగాని మనుజులయొక్క ప్రవర్తనము చక్కఁబడి స్థిగతులు శీఘ్రకాలములో మాఱి యభివృద్ధి గాంచిననేగాని యాదురాచారములెల్లను రూపాంతరమునువహించి మరలమరలఁ దలచూపుచుండును. ఈయభిప్రాయమే క్రమమయినదయినయెడల దేశాభిమానమును, పరోపకారమును, స్వకీయస్వేచ్ఛాప్రవర్తనమునుబట్టి తమంతటతామే యభివృద్ధిఁ గాంచుటకు మనుజులకుఁ దోడ్పడి ప్రోత్సాహముపెట్టుటయందుఁ గానిపించునుగాని చట్టములయొక్కయు సంఘనిబంధనములయొక్కయు మార్పులలోఁ గానుపింపవు. అది యెంత గొప్ప చెడుగుగా నున్నను, ఒక నిరంకుశాధికారివలనఁ బరిపాలింపఁబడువాఁడుమాత్ర మొకగొప్పబానిసవాఁడు గాఁజాలఁడుగాని యజ్ఞానాంధకారమున మునిఁగి స్వార్థపరుఁడయి దుష్టుఁ డగువాఁడే బానిసవాఁడని తలఁపవలయును. హృదయపీఠమున దుర్గుణపుంజముల కెల్ల దాస్యము చేయు తెగలవారు పరిపాలకులమార్పులవలనఁగాని ప్రాఁతకట్టుబాట్లమార్పులవలనఁగాని దాస్యమునుండి విముక్తినిగాంచఁజాలరు. ప్రతిమానవుఁడును దనయభివృద్ధికయి పాటుపడ నేర్చుకొని యెప్పుడు కృతకృత్యుం డగునో యప్పుడే దేశమున కంతకు నభివృద్ధి కలుగుచుండును. అభివృద్ధియందు జనసామాన్యము నతిక్రమించి ప్రసిద్ధిగాంచినపురుషవరు లనేకులు గానుపించుచున్నను వినికిడిలేని బీదకుటుంబములలోనివారలుగూడ మన యభివృద్ధికిఁ గారకు లగుచున్నారని మనము విశ్వసింపవలసియుండెను. యుద్ధములయందు జయముపొందినపుడు సేనాధ్యక్షులుగా నుండువారలనామములుమాత్రమె బయలుపడి స్మరింపఁబడుచున్నను సత్యమును విచారించి చూచినపక్షమునఁ బ్రతియుద్ధభటునియొక్కకృషివలననే జయము లభించినదని తెలిసికొనఁగలరు. మనజీవయాత్రకూడ వీరభటుని యుద్ధయాత్రవంటిది. సమస్తకాలములయందును ఘనకార్యములను నిర్వహించినమహాత్ములు సామాన్యులలోనే పెక్కండ్రు గలరు. అదృష్టవంతులయి చారిత్రములు వ్రాయఁబడిన గొప్పవారివలెనే చారిత్రములు వ్రాయఁబడనివార లనేకులుగూడ నాగరికతకును నభివృద్ధికిని మూలకారకులుగా నుండిరి. సకాయకష్టకర్మచే జీవించుచు వినయవిధేయతలతో నొప్పిన మర్యాదవంతుఁడయిన బీదవాఁడుసయితము తనదేశముయొక్కప్రస్తుతాభివృద్ధికిని భవిష్యదభివృద్ధికినిగూడఁ గారణభూతుఁ డగుచున్నాఁడు. తనసత్ప్రవర్తన మితరులకు మార్గప్రదర్శకముగాఁ జేసి భావికాలమున కంతకును చక్కనిదృష్టాంత ముత్పాదించుచున్నాఁడు. ప్రాణగలమూర్తిమత్త్వమే యితరులయందును వారు చేయుపనులయందును సత్ప్రయోజనత్వమును గల్పించి మంచి యాను

భవవిద్యగా నేర్పడుచున్నదని మనప్రతిదినానుభవమే వేనోళ్ళఁ జాటుచున్నది. సామాన్యపాఠశాలలలోను, విద్వత్సభలలోను, శాస్త్రపాఠశాలలలోను గఱపఁబడువిద్యకంటె మనగృహములలోను, వీధులలోను, కర్మవిద్యాశాలలలోను, టంకశాలలలోను, యంత్రశాలలలోను, నేతమగ్గములకడను, భూమిదున్నుకడను బ్రదుకుతెఱవులకయి గఱపఁబడువిద్యయే బహువిధముల ప్రాబల్యము గలదిగా నున్నది. గ్రంథములలోనుండి నేర్చుకొనిన యొకవిధమయినవిద్యకంటె స్వాచరణమునకును, ప్రవర్తనమునకును, స్వయంకృషికిని, ఆత్మవశీకరణమునకును దోడ్పడి తనజీవితముయొక్క విధాయకకృత్యమును నెఱవేర్చుటయందు మనుజుని క్రమపద్ధతికి లోఁబఱచి సంఘమునకుఁ బ్రయోజనకారిగానొనర్చునుభవవిద్యయేపూర్ణమైనవిద్యగాఁబరిగణింపఁబడునని షిల్లర్సు సాంగ్లేయగ్రంథకర్త వ్రాయుచున్నాఁడు. యోగ్యవర్తనము గలఘనుల జీవచారిత్రములు సుబోధములును ప్రయోజనకరములునై యితరులకు మార్గప్రదర్శకములయి తోడ్పడి దారిచూపునట్టివిగా నున్నవి.

ప్రసిద్ధము లయినజీవచారిత్రములలోఁ గొన్ని యుత్కృష్టజీవనమును, సచ్చింతలను, స్వప్రయోజనముకొఱకును ప్రపంచోపయోగమునిమిత్తమును సత్కార్యనిర్వాహకశక్తిని, బోధించునట్టి మతగ్రంథములతో నించుమించుగాఁ దులతూఁగునవి యయియున్నవి. శాస్త్రజ్ఞానము, భాషాపాండిత్యము, శిల్పనైపుణ్యము గలఘనులును, దీర్ఘాలోచనము గలయుపదేశకర్తలును, దయార్ద్రహృదయు లగుప్రభువులును, ప్రత్యేకవర్గమునకుఁ జేరినవారుగాని యౌన్నత్యముఁ జెందినవారుగాని కారు. అట్టివారు శాస్త్రపాఠశాలలలోనుండియు, కర్మవిద్యాశాలలలోనుండియు, వ్యవసాయకగృహములలోనుండియు, బీదలకుటీరములనుండియు, ధనికులభవనములలోనుండియును వచ్చినవారుగా నున్నారు. బీదవార లనేకు లున్నతపదవులకు వచ్చియున్నారు. చూపులకు దుర్ఘటములుగాఁ గానిపించెడు గష్టములు వారిమార్గముల కాటంకములుగాఁ జెప్పఁబడలేదు. అనేకవిషయములయం దట్టికష్టములుసయితము కార్యనిర్వాహకత్వమునకు సహాయకారులుగా నుండి యదివఱకుఁ గదలమెదలలేక పడియున్న జీవశక్తులకుఁ బ్రోత్సాహమును గలిగించి కార్యసాధకములుగా నుండును.

దృఢమయినమనస్సు గలిగియుండినయెడల నేపనియయిన మనుజుఁడు సమర్థింపఁగలఁడు. ఇందులకు దృష్టాంతములను బెక్కులు చూపవచ్చును. గురువులలోఁ సవితాభాసమానుఁడగు జెటిమిటెయిల రనునాతఁడును, దూదివడకుయంత్రమును గనిపెట్టిన

రిచార్డు ఆర్కురైటను నాతఁడును, పేరెన్నిక కెక్కిన ముఖ్యన్యాయాధికారి యగు టెంటర్డను ప్రభువును, అసమానచిత్రకారుఁ డయిన టర్నరను నాతఁడును మంగలిదుకాణములలోనుండి ప్రబలినవారలే.

నిశ్చయముగా షేక్స్పియ రెవ్వఁడో యెవ్వరు నెఱుంగరుకాని సామాన్యకుటుంబములోనుండి తలయెత్తినాఁ డనుట నిర్వివాదాంశము. షేక్స్పియరునితండ్రి కసాయివాఁడుగాను పశువులను బెంచి విక్రయించువాఁడుగాను నుండెను. వానిగ్రంథములను జదివినవార లనేకు లనేకవిధములుగా వానినిగుఱించి చెప్పియుండిరి. ఎవ్వ రేమిగా భావించిన నాతఁడుమాత్రము నాటకములయందు నటుఁడుగా నుండి యనేకపాత్రములఁ బ్రదర్శించుచుండెను. అందుమూలమున మితిమీఱిన లోకానుభవమునంతను గ్రహించి తననాటకములలోఁ జొప్పించి యద్భుతమయిన తనప్రజ్ఞావిశేషమును లోకమునకుఁ బ్రకటించియున్నాఁడు. ఆతనిగ్రంథములు నేటివఱకును బఠనీయములయి యోగ్యప్రవర్తనమునకు దారి చూపునవిగా నున్నవి.

కూలికయి యనుదినము పాటుపడి పనిచేయు బీదలతరగతిలోనుండి వాస్తుశాస్త్రజ్ఞుఁ డగుబ్రిండ్లేయును, నౌకాయాత్రికుఁ డగు కూక్ అనునాతఁడును, ప్రసిద్ధకవి యగుబర న్సనునాతఁడును, ప్రఖ్యాతికి వచ్చినవార లయి యున్నారు. జెన్సాన్సనను నతఁడు తాపిపనివారిలోఁ బ్రసిద్ధికెక్కినవాఁడు. ఇతఁడు జేబులో నొకపాత్రము నుంచుకొని చేతఁ దాపిపని చేయుసాధనముతోడఁ గానిపించుచుండెను. మఱియు నాతరగతిలోనే వాస్తుశాస్త్రజ్ఞు లగునెడ్వర్డ్సు, టెల్ఫోర్డులును, భూగర్భశాస్త్రజ్ఞుఁ డగుహ్యూమిల్లరనునాతఁడును, చిత్రకారుఁడును లేఖరియు నగు కన్నింగుహామనునాతఁడును, ప్రసిద్ధికెక్కిరి. శిల్పనైపుణ్యతయందాఱితేఱిన వడ్రంగులలో ఇనీగోజోన్సనునాతఁడు శిల్పమునందును, హారిసాననునాతఁడు సున్నితమయిన గడియారములను చేయుటయందును, జానుహంటరనునాతఁడు శారీరశాస్త్రమునందును, రామ్నే, ఓపి యనువారలు చిత్తరువులు వ్రాయుటయందును లీ యనుమహోపాధ్యాయుఁడు ప్రాగ్దేశభాషాపాండిత్యమునందును ప్రవీణులయి యుండిరి.

నేతపనివారిలోనుండి గణితశాస్త్రజ్ఞుఁ డగుసిమ్సను, చిత్రకారుఁ డగుజేకను, పక్షిశాస్త్రము నెఱింగినవాఁ డగువిల్సను, మతబోధకుఁ డగులివింగుస్టను, కవీశ్వరుఁ డగుటన్నాహిల్లును, జన్మించినవారలు. చెప్పులు కుట్టుతరగతివారిలోనుండి నౌకాసైన్యాధ్యక్షుఁ డగు సర్ క్లవుడ్లేసు షావెల్లనునాతఁడును, విద్యుచ్ఛక్తిశాస్త్రజ్ఞుఁ డగుస్టర్జియా

ననునాతఁడును, విన్యాసకుఁ డగు సేమ్యుయల్ డ్రూ యనునాతఁడును, పత్త్రికాధిపతియగు గిఫ్ఫర్డనునాతఁడును, కవీశ్వరుఁ డగు బ్లూమ్‌ఫీల్డనునాతఁడును, మతబోధకుఁ డగు ఉల్లియమ్ క్యారే యనునాతఁడును, ప్రఖ్యాతమును గాంచియున్నారు. ప్రసిద్ధ మతబోధకుఁ డగుమారిసా ననునాతఁడు చెప్పులను కుట్టుటకొఱకు దిమ్మలు చేయు పనివాఁడు. ప్రసిద్ధపదార్థశాస్త్రజ్ఞుఁ డయిన థామస్ ఎడ్వర్డ్సనునాతఁడు చెప్పులు కుట్టుకొని జీవించుచుండెను.

దేశచరిత్రమును వ్రాసిన జాన్ స్టో యనువాఁడు కుట్టుపని చేయుచు జీవించుచుండెను. చిత్తరువులు వ్రాయుటయందు నేర్పరి యగుజాక్సననునాతఁడు యౌవనవంతుఁడగువఱకు బట్టలు నేసికొని బ్రదుకుచుండెను. మొదట లండనునగరములో నొకకుట్టుపనివానివద్ద పని నేర్చుకొనిన సర్ జాన్ హాక్సువూడ్డనునాతఁడు యుద్ధములం బ్రసిద్ధకీర్తుఁడయి మూడవ యెడ్వర్డుప్రభువుగారిచేత బహుబిరుదములఁ బడసినవాఁడుగా నుండెను.

ప్రసిద్ధనౌకాధ్యక్షుఁ డగు హోబ్సానుసయితము హాక్సువూడ్డువలెనె మొదట కుట్టుపని నేర్చుకొనియుండి తరువాత నావికాసైన్యమునం జేరి ప్రాముఖ్యతకు వచ్చియున్నాఁడు. అసమానమేధాసంపన్నుఁడును, సాటిలేని సత్ప్రవర్తనము గలవాఁడును సంఘరాష్ట్రముల (United States) కధ్యక్షుఁడును నగు ఆండ్రూ జాన్సను గొప్పకుట్టుపనివాఁడుగా నుండి పై యున్నతపదవికి వచ్చియుండెను. అతఁ డొకనాఁ డుపన్యసించునపుడు "కొందఱు పెద్దమనుష్యులు నన్ను గుట్టుపనివాఁడందురు; అయ్యది నన్నెంతమాత్రమును సంభ్రమపఱుపఁజాలదు; ఎందువల్లనన నాకుట్టుపని చేయుకాలమున మంచివాఁడ నని పేరుపొందియుంటిని; నాకు పని యప్పగించువారిమనస్సునకు నొప్పి గలిగింపక వారికి చేసినవాగ్దత్తముప్రకారము సకాలమున వారియంగీలను వారల కిచ్చియుంటిని; ఎప్పుడును మంచిపని చేసియుంటిని" అని చెప్పియున్నాఁడు.

ప్రసిద్ధులగు కార్డినల్ వూల్సె, డీఫో, ఏకెన్‌సైడ్, కర్కువైట్ మొదలగువారు కసాయీలబిడ్డలే. బన్యను లోహపాత్రములను జేయువాఁడు. జోసఫ్ లంకాస్టరు బట్టలల్లువాఁడు. ఆవిరియంత్రమును గనిపెట్టినవారిలో న్యూకోమనువాఁడు కమ్మరివాఁడుగాను, వాట్టనువాఁడు గణితశాస్త్రసంబంధ మయినసాధనములను చేయువాఁడుగాను, స్టీఫెన్స ననువాఁడు కొలిమిలో నిప్పు వేయువాఁడుగాను నుండిరి. హట్టింగ్ట నను

మతబోధకుఁడు నేలబొగ్గుగనిలో బొగ్గులెత్తువాఁడుగా నుండెను. కట్టుమీఁదను జిత్రపుఁ బని చేయు బీవిక్కనువాఁడుసయితము బొగ్గు త్రవ్వువాఁడుగా నుండెను. సర్ థామస్ లారెన్సు సారాయియంగడివాని కొడుకు. కమ్మరివానిపుత్రుఁడయిన మైకేయల్ ఫారడే యనునాతఁడు బాల్యంబునఁ బొత్తముల కట్టలు గట్టువానివద్దఁ బని నేర్చుకొనుచు నిరువదిరెండుసంవత్సరములవయస్సు వచ్చువఱకు నావ్యాపారమునే చేయుచుఁ దరువాతఁ బ్రకృతిశాస్త్రమునందలి బహుకఠినము లయినసందిగ్ధవిషయములను దేటపఱచు ప్రజ్ఞావిశేషమునందు తనగురు వయిన సర్ హంఫ్రి డేవీని సయితము మించినవాఁడయి తత్త్వశాస్త్రజ్ఞులలో మొదటితరగతి నాక్రమించి యుండెను.

జ్యోతిశ్శాస్త్రము నభివృద్ధికిఁ దీసికొనివచ్చినవారిలో కోపర్నికస్సనువాఁడు మెఱుఁగురొట్టెలను జేయువాని కొడుకు; కెప్లర్ సారాయియంగడివానిపుత్రుఁడయి యుండి గాజుపనివాని భార్యచేఁ బోషింపఁబడియెను; న్యూటననువాఁడు గ్రంథాము పురసమీపమున నొకయీనాముదారుని కుమారుఁడు; లాప్లేసు బీదరైతువానికొడుకు; బాల్యమున గర్భదరిద్రులుగా నుండి యెట్టికష్టములపాల్పడినను తరువాత విలువకట్ట సాధ్యముకాని నిరుపమానమేధాశక్తిచేఁ బ్రసిద్ధిఁ గాంచియుండిరి. జ్యోతిశ్శాస్త్రజ్ఞుఁడును గణితశాస్త్రవేత్తయునగు లాగ్రేంజి యనునాతనితండ్రి ట్యూరిను యుద్ధములోఁ గోశాధిపతి యుద్యోగమున నుండియును అతిలాభాపేక్షచేత సాహసముతోఁ జేయు వ్యాపారములం దగిలి చెడిపోయి మిగుల దరిద్రస్థితికివచ్చి యుండెను. ఇట్టిదుస్థితియే తనకీర్తికిని సౌఖ్యమునకును గారణ మయ్యెనని చెప్పుకొనుచు వచ్చెను. "నేను ధనికుఁడ నయి యుంటినేని గణితశాస్త్రజ్ఞుఁడ నయి యుండకపోవుదు" నని యాతఁడు చెప్పి యుండెను.

మతబోధకులయొక్కయును, మతగురువులయొక్కయును పుత్రులు దేశచరిత్రములయందుఁ బ్రఖ్యాతిఁ గాంచియుండిరి. నెల్సన్, డ్రేక్, నావికాసంబంధ మయిన శూరత్వమునఁ బ్రసిద్ధి కెక్కియుండిరి. వల్లాస్టన్, ఎంగ్, ఫ్లేమ్‌షేర్, జెల్ మొదలగువారు ప్రకృతిశాస్త్రమునందును, రెన్, రెయినోల్డ్సు, విల్‌సన్, విల్కీ మొదలగువారలు కళలయందును, థర్లో, క్యాంబెల్ మొదలగువారు న్యాయశాస్త్రములయందును ఎడ్డిసన్, థామ్సన్, గోల్డుస్మిత్తు, కాలరిడ్జి, టెన్నిసన్, మొదలగువారు భాషాపాండిత్యమునందును ప్రసిద్ధినిగాంచియుండిరి. హిందూదేశపుయుద్ధములయందుఁ బేరెన్నికఁ గాంచిన "లార్డు హార్డింజి, కర్నల్ ఎడ్వర్డ్సు, మేజర్ హాడ్జసాన్ మొదలగువారు

మతాచార్యుల పుత్రులుగా నుండిరి. హిందూదేశమున బ్రిటీషుప్రభుత్వమును స్థాపించిన వారలగు క్లైవు, వారన్ హేస్టింగ్సు, మొదలగువారు సామాన్యకుటుంబములలో జన్మించిన వారలే. వారలతరువాత వచ్చి రాజ్యమును బలపఱచినవారలుసయితము పెక్కండ్రు యంత్రశాలలలోఁ బెంపఁబడి కార్యనిర్వాహకత్వమున సాటిలేనివార లయి యున్నారు.

ఎడ్మండ్ బర్కు, యంత్రశాస్త్రజ్ఞుఁ డగు స్మీటను, స్కాట్, వర్డ్సువర్తు, సోమర్సు, హార్డ్విక్కు, డన్నింగుప్రభువులును న్యాయవాదులబిడ్డలుగా నుండిరి. ఉల్లియమ్ బ్లాక్స్టన ననునాతఁడు పట్టుబట్టలవర్తకుఁడు మృతిఁజెందినతరువాత నతనికి జన్మించినవాఁడుగా నుండెను. గిఫ్ఫర్డుప్రభువుతండ్రి డోవరుపట్టణమువద్ద కాఫీ, తేయాకు మొదలగుసరకుల విక్రయించువాఁడుగా నుండెను. డెన్మానుప్రభువుతండ్రి వైద్యుఁడుగా నుండెను. న్యాయాధిపతి యగుటాల్ఫర్డుప్రభువుతండ్రి పల్లెటూరిలో సారాయి వండెడువాఁడుగా నుండెను. న్యాయాధిపతులలో ముఖ్యుఁ డగుపోలక్ ప్రభువుతండ్రి చారింగు క్రాసను స్థలమువద్ద గుఱ్ఱపుజీనులపని చేయువాఁడుగా నుండెను. మహాకవి యగుమిల్టను లండనునగరలేఖకులలో నొకనికుమారుఁడు.

పోపు, సౌదే యనుకవులు సారెబట్టలవర్తకులబిడ్డలుగా నుండిరి. విల్సనను మహోపాధ్యాయుఁడు సకాయకష్టకర్మవలన జీవించువానిపుత్రుఁడుగానుండెను. మెకాలే ప్రభు వాఫ్రికాఖండపు వర్తకుని కుమారుఁడుగానుండెను. కీట్సు రంగులు వేయువాఁడు. సర్ హంఫ్రిడేవీ యనునాతఁడు స్వదేశవైద్యునికడఁ బని నేర్చుకొని యుండెను. ఆతఁ డొకసారి ప్రసంగించునపుడు తనకుఁజాలె స్వయంకృషివలన నున్నతపదవికి వచ్చితినని నిర్మలహృదయముతో డంబమును విడిచి పలుకుచున్నానని చెప్పెను. జీవకోటివర్ణనమునకు (Natural History) న్యూటనువంటివాఁ డయిన రిచార్డు వోవె ననునతఁడు తొలుదొల్త నోడలో నొకయుద్యోగస్థుఁడుగా నుండి జీవనము చేసినవాఁడే; అప్పటి నుండియు నీతఁడు శాస్త్రవిమర్శనపద్ధతులయందు మిక్కిలి ప్రావీణ్యుఁడయి యుండినను మిక్కిలి వృద్ధాప్యము వచ్చునంతవఱకు నందుఁ జొఱఁబడియుండలేదు. అడ్రియాననునాతఁడు బాలుఁడుగా నుండినపుడు దీపము పెట్టుకొనుటకయిన గతిలేనివాఁడయి వీధులలోను ప్రార్థనమందిరములవద్దను నుండుదీపములకడఁ గూరుచుండి పాఠములను జదువుకొనుచు విద్యాభివృద్ధిఁ గాంచి యుండెను.

# ప్రసన్నయాదవనాటకము.

## ప్రథమాంకము.

### నాంది.

మ. మును లాస్థానకవీంద్రు; లాగమచయంబు ల్వందిబృందంబు; స
జ్జనచిత్తంబులు కొల్వుకూటములు; సంద్రంబు ల్ధనాగారము
ల్మనుజుల్ సేనెడిసేవ యప్పనము; బ్రహ్మాండంబు సామ్రాజ్య మె
వ్వని కాయాదిమచక్రవర్తికృపఁ గాపాడు న్సభాస్తారులన్. 1.

మఱియు

తే. గీ. ప్రాణికోటుల నెల్లఁ బాత్రములఁ జేసి
జగ మనెడు మహారంగదేశంబునందు
నావలెనె నాటకంబులు నడపునట్టి
సూత్రధారుండు మిముఁ బ్రోచు శుభము లొసఁగి. 2.

సూత్రధారుఁడు—(నాంద్యనంతరమున తెరవంకఁ జూచి) పారిపార్శ్వకా! నీ వొకసారి యిటు రాఁగలవా?

పారిపార్శ్వకుఁడు—(ప్రవేశించి) అయ్యా! ఇదిగో వచ్చియున్నాఁడను. నే నేమి చేయవలసియున్నది?

సూత్ర—ఓయీ! సాయంకాలమునుండి ప్రయత్నము చేయుచున్నను నీ విప్పటికిని రంగకృత్యమును సిద్ధము చేయలేకపోయితివా?

పారి—అయ్యా! మీరు నిష్కారణముగా నాపై నేరమును మోపుచున్నారు. అంతయు నీవఱకే సిద్ధమయి యున్నయది. సభాసదులతో మనము ప్రయోగింపఁబోవు రూపకమునుగూర్చి మీరు చెప్పవలసినది చెప్పకపోవుటయే యాలస్యము.

సూత్ర—ఏమీ! నాదే యాలస్యమా? అట్లయిన నిదిగో చెప్పుచున్నాఁడను. రసికశిఖామణు లగు నో సభాసదులారా! విద్వజ్జనవిధేయుఁ డగు బ్రహ్మశ్రీ చిలకమర్తి

లక్ష్మీనృసింహాకవిచేత నాంధ్రభాషలో రచియింపఁబడిన ప్రసన్నయాదవమను వీరరస ప్రధానరూపకమును, మేమీరాత్రి యచ్చటఁ బ్రయోగింపఁ దలఁచుకొన్నారము. కావున మీరు సావధానులరయి చిత్తగింతురుగాక !

పారి—అయ్యా! ఈనాటకగుణాగుణంబులఁగూర్చి యించుకేనియుఁ జెప్పవైతివేమి ?

సూత్ర—దానింగూర్చి చెప్పఁదగినవాఁడను నేను గాను.

మ. కవి సాన్నారి, కృతుల్నగ, ల్కథయె బంగారంబు, శ్లేషాదిస
త్కవనంబు ల్నగిషీపను, ల్లసదలంకారంబు లుద్యన్మణీ
నివహంబుల్; గ్రృతిమేల్మి యెట్టిదియొ తన్నిర్మాత నేర్పెట్టిదో!
వివరింపందగు నాణెకాండ్రు గద! యుర్విన్పండితగ్రామణుల్. 3.

పారి—ప్రబంధ మెట్లున్నను బ్రయోగకుశలుల మగుమనము సభాసదుల రంజింపఁ జేయఁగలమని నేఁ దలంచెద.

సూత్ర—ఓపండితంమన్యా! గర్వోక్తులతో నేమిప్రయోజనము ?

క. తనరూపము, తనవిద్యయుఁ
దన నేర్పును దనగుణంబు తనగానము, గ
న్గొని యెవఁడు సంతసింపఁడు ?
తనవిషయము నెంచ నోరులె తగువారుసుమీ ! 4.

మఱియు నీ వనినయట్లు మనము ప్రయోగకుశలులమే యయిన నంతమాత్రమున సభాసదులు సంతసిల్లరు. ఏమనిన—

చ. కృతి రసవంతమయ్యు మది కింపొనగూర్పదు నాటకు ల్సమ
ర్థత మెయి నాడకుండినఁ బ్రదర్శకు లెల్లఁ బ్రయోగపద్ధతి
న్జతురులె యైన నేమి కృతి చప్పని దైనపు డాప్రయోగము
న్గృతియును మంచిదైనపుడె నిండుముదం బగుఁ జూచువారికిన్ 5.

పారి—అట్లయిన గ్రంథచమత్కృతియుఁ బ్రదర్శకులసామర్థ్యముఁ గనిపెట్టుటకు, సభాసదులుమాత్రము నేర్పరులయి యుండవలదా ?

సూత్ర—ఓయీ ! ఇటువినుము ?

తే. గీ. కవియు నాటకు ల్నేర్పరు ల్గావలయును
సభ్యు లగువార లెప్పుడు చతురమతులె

వంటకత్తియ జాణ గావలయుఁ గాక!
తినెడువారికిఁ దద్రుచు దెలియకున్నె ? 6.

పారి—సరే! చతురమతు లయినసభాసదు లందఱు కావ్యమునందును మన ప్రయోగమునందును గలగుణమ్ములు గ్రహించి యానందింతురుగాక !

సూత్ర—గుణగ్రహణపారీణులే యట్లు చేయుదురు. తదితరులు దోషాన్వేషణముఁ జేయుచుందురు. అయినను నీనాటకమును బ్రయోగించునపుడెల్ల సభాస్తారులతో నిట్లు మనవిచేయుమని కవి యానతిచ్చియున్నాఁడు.

తే. గీ. సత్కవి యొనర్చు కావ్యంబు సరసు వోలె
స్వచ్ఛమై రసవంతమై సౌఖ్యదమగుఁ
గుటిలధీవరు ల్రసములు గ్రోలలేక
నీచగతి విసారములకై నెమకికొంద్రు. 7.

మఱియు

తే. గీ. శ్రీపురాణపండకులాబ్ధిశీతకరుఁడు
సరసుఁ డాంధ్రగీర్వాణభాషావిదుండు
మల్లయార్యుండు నా మేనమామ యగుటఁ
గవిత యెటులున్న నీకృతి గణుతిఁ గాంచు. 8.

పారి—అయ్యా! నీవు సభాసదులతోఁ జెప్పవలసిన దంతయుఁ జెప్పితివిగనుక నే నిఁక నాటకప్రయోగమున కారంభించెదను.

సూత్ర—వేషము లన్నియు సిద్ధము చేసితివా ?

పారి—సిద్ధమయి యెంతసేపయినది ? అదిగో! మనసుమిత్రుఁడు మహేంద్రుని వేషము వేసికొని మహావైభవముతోఁ గొలువుండుటకు ముచ్చటపడుచున్నాఁడు.

సూత్ర—(చూచి) ఔనౌను. ఈసభాసదులతో నింకొకమాట మనవిచేసి పోవుదము. ఓ సదస్యులారా ?

మ. అమరాధీశుని కొల్వుఁ జూచి, యటపై నయ్యూర్వశీమంజువా
క్యము లాలించి సుఖించి, ద్వారకను సత్యాపద్మగంధీసమే
తు మురారాతినిఁ గాంచి, మీఁద హరి దైత్యుల్ పోరు సంగ్రామరం
గమునం దించుక నిల్చి, మీమనస్సు లానందాబ్ధి నోలాడుతన్. 9.

(అని యుద్దఱు నిష్క్రమించుచున్నారు.)

ఇది ప్రస్తావన.

# ప్రథమాంకము.

రంగము—ఇంద్రసభ.

[అప్పుడు పీఠములమీఁదఁ గూరుచుండి మహేంద్రుఁడు, బృహస్పతి, జయంతుఁడుఁ బ్రవేశించుచున్నారు.]

మహేం—(విచారముతో నిట్టూర్పువిడిచి) ఆచార్యా!

చ. పొడ వడఁగెన్ హిరణ్యకశిపుండు, గతించెను దారకాసురుం
డడఁగెఁ గథావశేషుఁడయి యాదశకంఠుఁడు, మా కిఁకన్ భయం
బుడిగె నటంచు నీత్రిదివముద్ధృతదానవకంటకంబ యు
య్యెడుఁ గదయంచు నేఁదనర నీ నరకుం డెటనుండి వచ్చెనో. 1.

బృహ—మహేంద్రా! ఎటనుండి వచ్చెనో యన నేల? పద్మగర్భుని యవివేకమునుండియు మనమందభాగ్యమునుండియు—

ఆ. వె. మొదలఁ జేసినాఁడు పిదప దైత్యతపంబు
మెచ్చినాఁడు వరము లిచ్చినాఁడు
వేల్పు పెద్దయనుచుఁ బేరు పెద్దయె కాని
యతఁడ చేసె మనకు నధికహాని. 2.

మహేం—పద్మగర్భుని నిందించుటకన్న మనభాగధేయమును దూఱుట యుక్తము. నేఁ జేసినదోస మేమో కాని యీనాకపరిపాలనము దినదినగండము వేయేండ్లాయు వన్నట్టు లున్నది. ఒకరాక్షసుఁడుగాఁడు. ఒకనాఁటిపరితాపముగాదు. మూఁడు జగంబులకు నేకచ్ఛత్రాధిపత్యంబు వహించి ముప్పదిమూడుకోటులదివ్యులకు నాయకుఁడ నయిన నేను క్షణక్షణము నసురభీతిచే గుండెలు చేతఁ బట్టుకొనియుంటఁ జూడ నాలోనాకె సిగ్గగుచున్నది. అనవరతచిత్తసంక్షోభకారణ మయిన యీసామ్రాజ్యంబు నేలుటకన్న నిరపాయంబును, నివృత్తసకలలౌకికవ్యాపారంబును, నిర్మనస్తాపమును నగు మునివృత్తిఁ బూని నారాయణుచరణంబు శరణంబుగాఁ గానలనుంట సముచితం బని తోఁచుచున్నది. అమరపక్షపాతి యగు నబ్జనాభుం డెన్నెన్ని యవతారంబు లెత్తి యెందఱెందఱదైత్యులనుం దునిమినను నిర్జరులభాగ్యదోషమున వారికులంబులు తామరతంపరలయి నానాఁట నభివృద్ధిఁ జెంది యిసుకపాతరలట్లు తఱుగ

కున్నవి. పాపనిరతంబును, గుణవిరహితంబును నగు నాయధమదానవానీకంబునకు వంగివంగి జోహారు లొనర్ప లేక, యొదిఁగియొదిఁగి యుండలేక, సపర్యలు సలుపలేక, విసిగి పోవుచుంటిని. ఈనరకాసురుండు ప్రచ్ఛాదనమున సోమకునికన్నఁ, గ్రౌర్యంబునఁ దారకునికన్న, మగఁటిమి హిరణ్యకశిపునికన్నఁ, బరకాంతాసక్తి రావణునికన్న, మిన్నయఁట. విశేషించి లోకభయంకరుండగు మురుండును, దుష్కరారంభుండగు నిశుంభుండును క్రూరస్వభావుండగు హయగ్రీవుండును శౌర్యధనుండగు పంచజనుండును వానికిం బాసటయయి వచ్చి నాలుగుభుజంబు లట్లుపచరింతురు. ఇంతకు వారిపై నరిగిన మనబలంబు గతి యేమి యయ్యెనో తెలియదయ్యె. నేఁడది యేమో కాని శూరజనసులభమగు నుత్సాహము నాహృదయమున నెలకొనియుండలేదు. నామనస్సు పరాజయమునే శంకించుచున్నది.

బృహ—మహేంద్రా! వెఱవ నేటికి?

తే. గీ. మూఢఁదలఁచిన మేల్కీళ్ళు నీడలట్లు
ధృతియు భీతియుఁ బొడసూపుహృదయమందు
సాధుజనములు వానిసూచన లెఱింగి
భావిగతులబుద్ధిని నెంచి పని యొనర్తురు. 3.

వెఱచినమాత్రమున నాపదలు దూరమునకుఁబోవు. ధైర్యమూనిన నవి సమీపమునకు రావు. వగచి చేయునదిలేదు. కావున నుదాత్తపురుషలక్షణ మగుధైర్యము విడిచి యుండరాదు.

జయం—ఆచార్యా! అసురేశ్వరున కింత వెఱగుఁబాటుఁ గలిగించు నాదైత్యుఁ డెవ్వరి కొమారుఁడు? ఏమిమహిమవాఁడు? ఈయుదంత మెఱిఁగింపఁబోలునేని నా కెఱిఁగింప వేఁడెదను.

బృహ—వత్సా! ఎఱిఁగింపరాకేమి? చెప్పెద వినుము. వినియుండువుగదా! తొల్లి భువనకంటకుఁ డగుహిరణ్యాక్షుఁ డనుదానవకులసార్వభౌముఁడు కలఁడని. అతఁడు తనమగఁటిమి నిర్జరుల కజేయుఁడై భూమిదేవిని సిలుగులఁబెట్ట నాకారణమున ననవరతము దేవపక్షపాతి యగునారాయణుండు శ్వేతవరాహరూప మెత్తి యారక్కసుఁ బరిమార్చి భూమిదేవి నుద్ధరించి తనకోనకొమ్మున ధరియించి బుజ్జగించె. అప్పుడు పురుషోత్తమునకును భగవతియగు వసుంధరకును నరకుఁడు జన్మించె. పదఁపడి వాఁడు తనతపోవిశేషమున వారిజాసనుని మెప్పించి వరములఁ బడసి మర్త్యలోకము జయించి దివమును జుట్టుముట్టి యిప్పుడు మనకు వెఱపుఁగొలుపునంతవాఁ డయ్యె.

జయం——(ఆశ్చర్యముతో) ఏమి ? భువనరక్షణపరాయణుఁ డగు నారాయణు నకును, విశ్వహితకారిణి యగు ధారుణికిని నుదయించిన నందనుఁడో యితఁడు ? ఈతఁడు నింద్యకర్మములకు వెనుదీయనిరక్కసుఁ డెట్లయ్యెను.

బృహ——కుమారా ! ఆశ్చర్య మేల ? చూడుము.

తే. గీ. నిఖిలజనులకుఁ జల్లనినీడనిచ్చు
వృక్షశాఖలు రాపాడువేళలందు
పొడము నగ్నికణము కాల్చునడవు లెల్ల
జన్మభూమితో నేమి యసాధువులకు. 4.

మహేం——కుమార ! అదియట్టిద. చూడుము.

తే. గీ. జలదములనుండి పిడుగులు జాలునట్లు
మంచివారికి ఖలులు జనించుచుంద్రు
మంటిలో నుద్భవిల్లెడు మణులలాగు
ఖలులకడుపున నుత్తము ల్గలుగుచుంద్రు. 5.

జయం——అయ్యా మీరు సెలవిచ్చినదంతయు నిశ్చయము. దానవకులక్రమాగతం బగు క్రౌర్యమునకుఁ దోడు రణస్థైర్యంబునను నప్రతిహతప్రతాపంబునను వాఁడు క్రమంబునఁ దలిదండ్రులఁబోలి పుట్టెఁ గావున నతఁడు నిర్జరుల కజేయుఁడని తోఁచుచున్నది. యుద్ధవార్త దెలుపుటకు సమరరంగంబునుండి యింతవఱకు మనభటుం డొక్కఁడు రాకుండుటకుఁ గారణ మేమయి యుండును ?

బృహ——అదిగో నెవ్వరో యిటువచ్చుచున్నారు. (పోల్చి చూచి) కుబేరపరిజనుఁ డగు మాణిభద్రుఁడు

మహేం——ఈతఁ డేమివార్త చెప్పనోకద! ముఖవైఖరి కీడును సూచించెడును.

[అప్పుడు మాణిభద్రుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మాణి——(తనలో) కటకటా ! నేను మిక్కిలి మందభాగ్యుఁడను. ఈశ్రవణకఠోరమగు వార్త మహేంద్రునకు నే నెట్లు విన్నవింతును ? అయినను స్వామియగు కుబేరుని నియోగము నడుపక తప్పదుగదా !

చ. అనుపమధర్మమార్గచరు లైనసుపర్వులు పాఱుచుంట దు
ర్జనులు కృపావిహీనులును రక్కసు లాజిజయంబు గాంచుటల్
గనుఁగొన ధర్మమే జయము గాంచెడు నంట యబద్ధ మంచునున్
ఘనభుజసారమే విజయకారణ మంచును నేఁ దలంచెదన్. 6.

(ప్రకాశముగా) రక్షింపుము. రక్షింపుము. త్రిలోకాధినాథా! (అని పాదములమీఁదఁ బడుచున్నాఁడు.)

మహేం—(సంభ్రమముతో) ఓయి! ఏమి మూడినది? దేవసేనల పరాజయ మెఱిఁగింప వచ్చితివా?

బృహ—నాకలోకము ముక్కుడిరక్కసులపాలయినదా?

జయ—దేవకాంతల యదృష్టములు విపరీతములె యయ్యెనా?

మాణి—(లేచి) దేవా! మందభాగ్యుఁడనైన నేను దేవరకు దేవసేనలవిజయ మంగళవార్తలు దెలుప నోచుకొననైతిని.

మహేం—ఆదేవాసురసమరము మనకశుభపరిణామ మెట్లయ్యెనో సంగ్రహముగా మాకెఱిఁగింపుము. కాలోచితముగ వలయుప్రతిక్రియ యొనర్చుకొందము.

మాణి—(అంజలిపట్టి) దేవరవారవధరింతురుగాక. ఆవిధమున ముర, నిశుంభ, పంచజన, హయగ్రీవ సమధిష్ఠితంబులయి దైత్యదానవానీకంబులు లోకంబులు మ్రింగు లాగున నార్చుచుఁ జేర్చి నిల్చిన, యమ యాదఃపాల, దహన ధనద, పవన, పశుపతి ప్రముఖులగు దిక్పాలకులు వేలుపుమూఁకలం గూర్చుకొని యరదంబులు, ద్విరదంబులు, బాణంబులు, తూణంబులు, హయంబులు భటచయంబులు సాయత్తంబు గావించుకొని మొగ్గరంబులు వన్ని యెదుర్కొనుటయు నుభయబలంబులు నోహరిసాహరిఁ బెనఁగి సమరంబొనర్చె. అప్పుడు నిర్జరసైన్యారణ్యంబుపయిఁ గాఱుచిచ్చుమచ్చున దైత్యనాయకుఁడు పెచ్చుపెరిఁగి.

సీ. కఱకుఁగత్తులఁ బూని కౌబేరబలములఁ జెఱకుఁగట్టల నట్లు నఱికినాఁడు
యఱకాలఁ జెలరేఁగి యగ్నిదేవునిమూఁక సన్నచీమల నట్లు చమిరినాఁడు
గుదియచేతను బూని కదిసి వారుణసేన నాలమందల నట్లు తోలినాఁడు
శరపరంపర లేసి జముబంట్లమేనులు చించిజల్లెడ లట్లు చేసినాఁడు
క్రోల్పులులఁబోలు దైత్యులకోల్తలఁ జెడి
వేల్పులలవేక లటు పాటి విఱుగవలసె
దిక్కు లేలినవారలో దివిజనాథ
దిక్కుమాలినవారలై తిరుగవలసె.

మఱియు సేనలు పోయినపోకగాఁ దిరిగిచూడక చనుటయు.

తే. గీ. మనకృశానుని తేజంబు మంటఁగలసె
నాఁటివరుణదేవునిశక్తి నీటఁగలసె

నెచటికో పాయుబలమెల్ల నెగిరిపోయెఁ
జిక్కి సగమయ్యె నీశానుఁ డుక్కుదక్కి. 8.

మహేం—(విచారముతో) అన్నన్నా! ఎంతకష్టము. అవ్వల నేమయినది ?

మాణి—అనంతరము సంగ్రామప్రసిద్ధులగు సిద్ధులును రిపుజనదుస్సాధ్యులగు సాధ్యులును, పరాక్రమహార్యతులగు యతులును, ధనుర్విద్యాధరులగు విద్యాధరులును, గరుడగంధర్వాదులగు తక్కుంగల ఖేచరులును; నిశాచరులం దలపడిరి.

బృహ—దైవము వారికయినఁ దోడుపడఁ డయ్యెనుగా ?

మహేం—దానవులకుఁ దోడుపడియె ననుఁడు. అతరువాత నేమి యయినది?

మాణి—ఏమి జరిగినది యని యడుగ నేల ? ఈయశుభము తుదముట్టఁ జెప్పెద వినుండు.

తే. గీ. అసురసేన విజృంభించి యంతఁ దఱుమ
వేల్పుజోదులు వెన్నిచ్చి విఱిగి చనిరి
యొకరు పోయినదెసకు నింకొకరు పోక
తెగినహారంబులోని ముత్తియము లట్లు. 9.

బృహ—సరే. ఇంక వినవలసిన దేమి యున్నది ?

ఆ. వె. జ్వలనదేవుఁ డోడె జలధినాయకుఁ డోడె
దండపాణియోడె ధనదుఁ డోడె
కూల్చువాఁ డెవండు కుటిలదైత్యులఁ గర్త
మనుభవింపవలయు నంతెగాక. 10.

మహేం—అయ్యోమాణిభద్ర! ఇప్పుడు మాయనుంగు నెచ్చెలులగు దిక్పాలు రెందున్నవారు ?

మాణి—దేవా! ఎందున్నవారని తెలుపుదును ? కొందఱు పలాయితులగుచుండ దానవులు వారినిఁబట్టుకొని బంధించి శిబిరంబులనుంచిరి; కొందఱు వాహనంబుల నెక్కియు మఱికొందఱు పాదచారులయియుఁ దల విరియఁబోసికొని వెనుక చూడక పోయెడుచోటెఱుంగక దానవులబారిఁబడక తప్పించుకొన నూడనిఁబోవుచుండిరి. కొందఱు పఱువిడలేక యెందేని నక్కి గ్రుక్కియున్నవారు.

మహేం—హా సఖులారా! దిక్పాలురార! మీ కిట్టిగతి ప్రాపించెను ? ఓయీ దండధర! ఎన్నఁడును నీడవోని నీకాలదండమునకు నే డింతపాటు

వచ్చెనే. నిజప్రతాపప్రకంపితకాలకంఠుం డగు దశకంఠునిఁ బూరికిం గొనని నీ మగఁటిమి తుచ్ఛుఁడగు నరకునిముందు మొక్కవోయెనే? ఓయి వరుణా మృత్యుజాలసంకాశంబులగు నీపాశంబులు దనుజకంఠప్రదేశంబుల నిరర్థకంబు లయ్యెనే? అగ్నిదేవా! శాత్రవసేనాతూలంబులం గాల్చు నీకీలంబులు దనుజులకుఁ జంద్రకిరణజాలంబు లయి తోఁచెనే? ఓయీ నైరృతా! 'వజ్రం వజ్రేణభిద్యతే' యన్నట్లు మాయాబలాభిశోభితులగు దానవులను దానవాంశమునఁ బొడమిన నీవు నిర్జింతువని కొంతయాశతో నుంటిమి. అదియెల్ల వమ్మయ్యె. మిత్రమా! కుబేరా! నిగ్రహానుగ్రహసమర్థుఁ డగు భగవానుఁడు కాలకంధరుఁడు నీకుసంగడీకాఁడై నినుఁ గాచుచున్నను నీకీపాటులు దప్పవయ్యె.

ఆ. వె. నరకుఁ డెంతవాఁడు నారాయణుఁడు తోడు
మదనవైరితోడు మనకటంచు
చింత దక్కియుండ చిట్టలింతలు వుట్టె
నుక్కుమేడ కాల్చె లక్కసీల. 11.

జయం—అయ్యా! మిక్కిలి యధైర్యముపడియెద రేల? ఆపత్సమయంబున కార్యము లనుసరింపఁదగినమార్గ మనుసరింపుఁడు.

మాణి—మహేంద్రా! ఊరక యధైర్యముపడి యేమి చేయుదురు. ఇంకను నాలోచింపవలసిన దించుక కలదు. నేను చెప్పునది సాంగముగా విని సమయానుకూలముగా నేయ్యది కర్తవ్యమో దాని నొనర్తురుగాక.

మహేం—అట్లయిన నీచెప్పవలసిన దంతయుఁ జెప్పుము. వినుచున్నాఁడను.

మాణి—పిమ్మట యక్షేశ్వరుఁడు కుబేరుఁడు రణరంగమునుండి తొలఁగి తన కాయముపైఁ గూరుచుండి పరుగిడుచు మార్గాయాసముచేత వగర్చుచు నెంతయుఁ గష్టమున నన్నుఁజేరి తమ కిట్లు సందేశ మంపె. "త్రిలోకాధినాథా!"

చ. నే నిటులైతి; నాజి రజనీచరవీరుఁడె గెల్చె; వాయు, వై
శ్వానరముఖ్యులుం దొలఁగి పాఱిరి; కావఁ గదయ్య నందనో
ద్యానము నంగనాతతి, సుధాకలశంబును బారిజాతసం
తానముఖామరద్రుమవితానమును న్ననకామధేనువుల్. 12.

మహేం—మిత్రమా! కుబేర! ఆపత్సమయమునందును స్వామిహితమును మఱువని నీచరిత్రము శ్లాఘాపాత్రము. ఓయీ! మాణిభద్ర! అట్లయిన నిప్పుడు రాక్షసేంద్రుని యుద్యమ మేమి?

మాణి—దేవా! దురాత్ములయిన శాత్రవులు జయమొందినపుడు పరాజితులయిన పగతుర నేమి సేయుదురో యదియే వాని యుద్యమము.

బృహ—అది యేదో తేటతెల్లముగా నెఱిఁగింపుము.

మాణి—దానవబలంబులు దేవబలంబులను నురుమాడి వెన్నంటి తరుముచుండ మేఘగంభీరభీషణంబు లగు ఘోషణంబులతో రాక్షసరాజు తనబలంబుల కిట్లని యానతిచ్చె.

ఆ. వె. పూలతోట లనక పుణ్యభూము లనక
రాచనగరు లనక రచ్చ లనక
వేప్రోలు సొచ్చి వీరదానవులార
గొంకుజంకులేక కొల్లఁగొనరో. 13.

బృహ—అట్లయిన మనము మనజాగ్రత్తమీఁద నుండవలయును.

మహేం—అయ్యా! ఎయ్యది యీయవసరమం దాచరణీయమో యెయ్యది యనాచరణీయమో నే నెఱుఁగఁజాలకున్నాఁడ. మనసేన చన్నతెఱఁగును రాక్షసుల యున్నతెఱఁగును విన నామనమున సమరసన్నాహనోత్సాహంబు డిందుపడినది. త్రిదివంబు విడిచిపోవుదమన్న పరిజనంబులు పడునగచాట్లు దలఁపునకు వచ్చి నన్నఁ జాలు గదపనీయవు. దానవు నెదుర్కొందమన్న వాని నోర్చుటరిది. కావున నిప్పుడు నే నేమార్గ మవలంబింపవలయునో మీరు నిర్ణయింపవలయును.

(తెరలో) ఓహో! సిద్ధ, సాధ్య, విద్యాధర, గంధర్వ, యక్ష, కిన్నరఖేచరులారా! త్రిలోకాధినాథుఁ డగుమహేంద్రుఁ డెందున్నాఁడు. ప్రాగ్జ్యోతిషాధినాథుఁ డగుదానవేశ్వరుఁ డాతని దర్శనము చేయవచ్చినాఁడు. కావున నాతఁ డున్నతావెఱిఁగింపుఁడు.

బృహ—(ఆలకించి) కడమపని చేయుటకు రాక్షసాధముఁ డిదిగో నీకడకే వచ్చినాఁడు.

మహేం—ఆచార్య! ఆచార్య! కర్తవ్యము? కర్తవ్యము?

జయం—అతఃపురరక్షణ మవశ్యకర్తవ్యము.

బృహ—మహేంద్రా! ఆ. వె. శౌర్యశక్తి దలఁపఁ జనక యుండుట మేలు
శత్రుఘాటిఁ దలఁపఁ జనుట మేలు
రెండు పోల్చిచూడ మొండిరక్కసునకు
సకల మిచ్చి చనుట చాలమేలు. 14.

మహేం—అట్లయిన స్త్రీలగతియేమి? తక్కుఁగలవారలగతియేమి?

సీ. కనబడ్డసతి నెల్లఁ గవయఁ జూచెడునీచు గారవించునె వేల్పుఁ గన్నియలను
మాపేరు వినినంత మండిపడెడు దాయ ముద్దుసేయునె నాదుపుత్రకులను

స్వర్గ మంతయుఁ బాడుసలుప నెంచెదుకూళ విడిచిపోవునె కల్పవృక్షములను
మునియాగపశువుల ముచ్చిలించెడుపాపి యపహరింపఁడె వేల్పుటావు నకట
కవుణ యెట్టిదో యెఱుఁగని కటికచెనఁటి
బ్రతుకనిచ్చునె యింక నైరావతమును
ముజ్జగంబులవారి కింత మూఁడు ననుచు
నించుకేనియుఁ గలనేని నెఱుఁగనైతి. 15.

బృహ——నాఁ డెంతఘాతుకకర్తయైన నొనర్చుటకు సందేహింపఁడు. కావున నచ్చరలను దక్కఁగల వియచ్చరాంగనలను మేరుపర్వతగుహలకుఁ దోడ్కొనిపొమ్మని జయంతకుమారు నంపుట యుచితము. అమృతభాండమును గామగవియు వారలతోఁ బోవుఁగాక.

మహేం—అట్లయిన నింక జాగొనరించిన ప్రయోజన మేమి? వత్సా! జయంతా!

చ. తడయకమున్న దానవకదంబము సేరకమున్న వేలుపుం
బడఁతులతోడ మీజనని భద్రముగాఁ గొనిపోఁగదన్న కా
ఱడవులకైనఁ బర్వతగుహాంతరభూములకైనఁ జెచ్చెర
న్నడువఁగఁ గొంతకాల మిటఁ గ్రమ్మఱవత్తువుగాక యుందఱున్. 16.

మఱియుఁ బులోముని గారాపుఁబట్టియుఁ, జతుర్దశభువననాయకునిపట్టమహిషియు, ససూర్యంపశ్యయునగు మీయంబతో నాలుబిడ్డల సంరక్షణము సేయఁజాలని వజ్రపాణి యిట్లు చెప్పెనని పలుకుము.

చ. మనమునఁ దొంటిసంపదలమాట దలంపకు శోక మెమ్మె; నొ
క్క నెలవునందె కష్టములు కాపుర ముండునె యెల్లయప్డు? మే
ల్దినములు వచ్చు నెంతయును దివ్యులకో సఖి! యాకు రాలు వే
ళను జిగిదూలుచెట్లు మరల న్మధుమాసమున న్జిగుర్పవే. 17.

జయం——దేవా! అట్లయిన మీ రానతిచ్చినట్లు చేసెద. (అని పోవును.)

[తెరలో]

చ. తునియలుగాఁగఁ గొండలను ద్రుంచినదోర్బలశాలి, యా యహ
ల్యను వలపించినట్టిరసికాగ్రణి, స్వర్గపురైకనాథుఁడున్
గను లొకవేయి దాల్చి జగత్త్రియము న్గనిపెట్టు నేత, య
య్యనిమిషనాథుఁ డేడి' దనుజాధిపుఁ డాతనిఁ జూడఁగోరెడున్. 18.

బృహ——అదిగో నడచుచున్న తమాలవృక్షములో, పుంజీభూతములగు కారు చీఁకటులో, యసరాక్షసులు మన మున్నదెసకే వచ్చుచున్నవారు. ఇదియును మేలె. ఇంతలో జయంతకుమారుఁడు కాంతాసంతానమును నిరపాయముగాఁ గొనిపోవచ్చును.

మహేం—ఆచార్యా! ఇపు డితనితో నెట్లెదుర్కొని సంభాషింతము? సామవాక్యములతోఁ బట్టుపఱచిన సంధికి సంగీకరించునేమో?

బృహ—ఎంత వెఱ్ఱివాఁడవు? దురాత్ముఁడు శాంతవచనములఁ జక్కఁబడునే?

తే. గీ. అధముఁ డగువాని సామవాక్యముల యోగ్యు
లను నయింప నాతనియల్కఁ యినుమడించు
నెఱియఁగాలిన పెనముపై నీళ్లుచల్ల
పొగయు మంటయు బుస్సన నెగయునట్లు. 19.

మహేం—అట్లయిన నతఁడు రాకమున్న యనుష్ఠేయము నుపదేశింపుఁడు.

బృహ—అది యీవఱకే యుపదేశింపఁబడినది. అయినను మఱియొకమాట చెప్పెద. ఆదానవుఁ డీకోలుపుకూటమునం జొచ్చినతోడనే నీవును నేనును మనవైరమును మనమనములనుండి దూరంబుగఁ ద్రోలి యతని సబహుమానంబుగ నెదుర్కొని చింతామణీభద్రపీఠంబున నాసీనుఁ గావించి నాకభువనంబును, నందనవనంబును, గల్పభూరుహంబులును, గనకాంబుజములు వాని కొసంగి మనము దొలఁగుట కార్యము.

మహేం—మన మెచ్చట నుండవలసినవారము?

బృహ—మేరుగుహాలచెంతనో? మానససరోవరముపొంతనో?

మహే—మన కీదుఃఖమునుండి విమోచన మెప్పుడు?

బృహ—రాక్షసుని మరణసూచన మెప్పుడో యప్పుడు.

మహేం—అది సంభవించు టెట్లు?

బృహ—ఇట్లు. ఆశ్రితావనపరాయణుఁ డగు నారాయణుఁడు దుష్టదానవనిగ్రహంబునకును, శిష్టమానవానుగ్రహంబునకును యాదవవంశంబున నుదయించెనని పరమేష్ఠి సనత్కుమారునకుఁ జెప్పుచుండఁ దొల్లి యొకనాఁడు నేను వింటిని. మన మాదేవకీనందను నాశ్రయించి యీవిపత్సాగరము నీదుదము. అతనిచేతఁగాని తదన్యునిచే నీలోకకంటకుఁడు పిల్కుమారఁడు. మేటిరాకాసులఁ బోకార్ప నతఁడు కంకణముఁ గట్టియున్నవాఁడు. ఆనందనందనచరణారవిందముల పాలఁబడినవారు చెడినవారు లేరు.

మ. అగదంకారము లాజవంజవతమోహారప్రభావంతము
ల్జగదానందదము ల్సురారియువతీసౌభాగ్యలుంటాకము
ల్నిగమోర్వీజశిఖాప్రవాళములు కాళీయాహినిర్బంధము
ల్భగవంతుండగు దేవకీతనయు శుంభత్పాదపంకేజముల్. 20.

కావున నాపుండరీకాక్షుకడకు మాణిభద్రుని నుచితసందేశముతోఁ బుత్తెంచుము. దాన మన నెంజిలి సమగ్రముగాఁ దీరును.

మహేం—అవివేకాంధకారాతిశయమునఁ దెన్నుగానక తిరుగులాడుచున్న నామనస్సునకు మీవచోదీపికలచేఁ జక్కనిదారి పొడకట్టినది. అట్లొనర్చెద. అయ్యా! మాణిభద్ర! నీవుమాకుదూతవై యమరకార్యముం దీర్పవలయు. ఇదిసకలభువనహితము.

మాణి—దేవా! ఆజ్ఞాపింపుము. సేవకున కిది మహాప్రసాదము.

మహేం—అట్లయిన నోమాణిభద్ర! జగద్భద్రసంధాయకుఁ డగువాసుదేవుఁడు వాసము సేయు ద్వారకానగరమునకుఁ జని యదుకుల కమలాకరప్రభాకరుం డగు నాపుండరీకలోచను సందర్శించి దివౌకసులయార్తి సమగ్రముగా విన్నవించి.

సీ. కాళీయఫణిఫణాగ్రములఁ దాండవమాడు నడుగుఁదమ్ములకు జోహారులనుము
అదితికశ్యపులకు నవతరించిననాఁడు మా కొనర్చిన మేలు మఱువమనుము
అమరసంతతి యిట్టు లగచాట్లుపడుచుండ నొరుని కైవడిఁజూచుటొప్పదనుము
ఈ తెఱంగునఁ జేయ లాఁతివార మె మేము చాలకాలమునాఁటిసఖుల మనుము.
ఆలుఁబిడ్డల దెసఁ జూచి యమరవిభుఁడు
వేయుఁగన్నుల బాష్పము ల్విడిచె ననుము
అసురఁగడతేర్చుపని తనకలఁతి యనుము
దైవహిత మాటఁ నీయది తప్ప దనుము. 21.

మాణి—దేవా! అట్లంతయు విన్నవించెదను.

బృహ—దానవుఁడు వచ్చువఱకు నీ విటనుండి యతనికులుకులు విని చెయిదములఁ గని యవ్వల నరుగుము. అప్పుడు నిర్జరులయవస్థ యాదవేంద్రునకు సమగ్రముగ నెఱిఁగింప నవకాశ ముండును.

మాణి—హా! కష్టము. కష్టము. దానవసైన్యంబులు సవిధభూములకు రానే వచ్చినవి.

బృహ—మహేంద్రా!

చ. మనమున నించుకేని యనుమానము నొందక దానవేశ్వరు
న్గని వినయంబుతో నెదురుగాఁ జని గద్దియఁ జేర్పు; లావు మా
యునపుడు నల్పుఁడై యొదిఁగియుండుట న్యూనత గాదు గ్రీష్మమం
దున బలుతిప్పలుంబడు నదు ల్తొలుకారునఁ బూర్తి నిండవే? 22.

మఱియు నోసునాశీర!

తే. గీ. అధిక తేజస్వులకు నైన నప్పుడప్పు
డుచ్చనీచదశలు గల్గుచుండుఁ జూవె

జగము వెలయింపఁగల సూర్యచంద్రులకును
గ్రమత నుదయాస్తమయములు గల్గునట్లు. 23.

మహేం—దేవగురువుల యుపదేశము శిరసావహించినాఁడ. (అప్పుడు నరకాసురుఁడు, పంచజనుఁడు, వజ్రకంఠుఁడుఁ బ్రవేశించుచున్నారు.)

నర—ఓయీ పంచజనుఁడా! బాహుబలంబున, బుద్ధివైభవమున మనకన్న నల్పుఁడగు మహేంద్రుని సింహాసనభ్రష్టునిఁ గావించి నాకలోకమునుండి పాఱఁద్రోలక మన వంశకర్తలగు నాదిరాక్షసు లూరకుండుటకుఁ గారణమేమి?

పంచ—దేవా! ఆమహాత్ము లూరకొనలేదు. దివిజదుస్సాధవిక్రమక్రీడారంభులయిన మనపూర్వులు త్రిలోకవిజయంబు గావించినప్పుడు కుటిలుఁడగు విష్ణుదేవుఁడో మతిలేని శంకరుఁడో యేవో రూపములెత్తి వారల గడతేర్చుచుండువారు. ఆకారణంబున నీతని కింతవిభవము జరుగుచున్నది. ఈపర్యాయము మీ రన్నట్లు నిరాటంకముగా జరుగఁగలదు.

నర—(నవ్వుచు) మనదానవవీరులు నిజముగా నాదామోదరుని చేతసయితము నిహతులయిరా? అట్లయిన వానిపరాక్రమ మెట్టిదో చూడవలసినదే.

వజ్ర—మహాప్రభూ! వాఁడు వట్టిపిఱికివాఁడు. మీముందర వాఁడు దిగఁదుడుపునకైనను బనికిరాఁడు.

బృహ—మహేంద్రా! అదిగో దానవుఁడు. వాని నెదుర్కొందము రమ్ము.

మహేం—దానవేంద్రా! నీకు స్వాగతము.

బృహ—దానవేశ్వరా! విజయమగుఁగాక.

పంచ—నీ వన్నను ననకున్నను విజయ మీవఱకే యయినది,

నర—(ఆశ్చర్యము నటించుచు నింద్రునితో) ఎవరు వీరు? నముచిగర్వనిర్వాపణధూర్వహులు, పాకప్రతాపగంధసింధురపంచాననులు, బలప్రాణానిలకాలభుజంగులు నగునహల్యాభుజంగులా? మహేంద్రా!

మ. అపరాధంబులు గల్గె మావలన చండారాతిసైన్యాటవీ
తపనోద్యద్దహనాయమానపటుదోర్దర్పప్రతాపాఢ్యు ని
న్నిపు డీరీతినిఁ జూడవచ్చితిని నే నిన్నాళ్లు రాకుంటకు
నృపతోడన్ క్షమియింపు తమ్ముఁడఁ గదా యెంతైన దేవేశ్వరా. 24.

అయ్యో! మఱచితిని. నేను మీకుఁ దమ్ముఁడ ననుట మిమ్ము రెండవమాఱవమానించుట గదా.

వజ్ర—అజాగళ స్తనమువలె నిరర్థకమైన వజ్రాయుధము ధరించిన యీపరాక్రమహీనుని తమ్ముఁ డనిపించుకొన్న మీ కవమానము మహాప్రభూ.

పంచ—ఓమహేంద్రా! ఓదేవగురూ! నేను పంచజనుఁ డను నరకమహారాజు బంటను.

బృహ—మేము మిమ్మెఱుఁగకపోలేదు.

మహేం—దానవేశ్వరా! ఉల్లసప్పుఁబలుకులతో నేమి ప్రయోజనము? శత్రురాజులపై దండువెడలుట క్షత్రియధర్మ మగుటచే నీవిటు చేసితివి. ఇందు క్షమింపవలసిన దేమున్నది? జయము నొందితివని యెఱుఁగుదును.

మాణి—(తనలో) ఈసమయమున నేనిచ్చట నుండరాదు. చాటుననుండి వీరిపనులఁ గనిపెట్టెద. (అని పోవును)

నర—పురందరా! నామాటలకు నీ వింత యుడికెదవేల? అట్లయిన నిఁక నుల్లసప్పుఁబలుకులతో నేమి. నావచ్చినపని చెప్పెద వినుము.

తే. గీ. ఎల్లభువనంబులకు నీవ యేలికవఁట
బలము గలవాఁడవఁట మానవంతుఁడవఁట
కొండరెక్కలఁ గొన్నింటిఁ గూల్చితివఁట
యేది చూతము రణ మిప్పి యించుకంత. 25.

బృహ—(తనలో) మా యసహాయత్వము నెఱిఁగి వీఁడు మమ్ము మాటిమాటికి రణమునకుఁ బిల్చుచున్నవాఁడు.

మహేం—దనుజేశ్వరా! రణమునకేమి? అది యొకభాగ్యము కాదు. చూడుము.

చ. కనుఁగొన దేవదానవులు కశ్యపుసంతతివారె కావున
న్దనుజవరేణ్య! యన్నలకుఁ దమ్ములకుం బగ జెల్లునయ్య? తోఁ
గినియక మీరు మే మెపుడు క్షీరము నీరమునట్లు లుండిన
న్నన నికఁ దేరిచూడఁ దరమా యొకమాత్రపుహాని కాజిలోన్. 26.

నర—ఆహాహా! ఎంతకాలమునకు నేను మీకు చుట్టమ నయితిని?

పంచ—సోదరప్రేమ మహేంద్రునిశరీరమునుండి వెల్లివిరిసి పాఱుచున్నది.

వజ్ర—పిల్లుల కెలుకలును దోడేళ్ళకు మేఁకలును నెంత దగ్గఱచుట్టములో మాకు మీరును నంత చుట్టములే.

బృహ—ఓదానవసార్వభౌమ! ఈమహేంద్రుఁడు వచియించినట్లు మన యుభయకులములు పొందుపొసఁగియుంట యుచితము. మీరు రాకరాక వచ్చినయతిథులగుటచే

మా కాదరణీయులరు. అందుచేఁ గూరుచుండి ప్రసంగింతము. నీ వామహేంద్రపీఠము నధిష్ఠింపుము.

మహేం—దానవేంద్రా! అట్లు చేయుము. మాకు మీ రతిథులుగదా.

నర—ఓహోహో!

ఉ. ఎన్నఁడు లేనికూర్మి యిది యెప్పటినుండి జనించెనయ్య నీ
కిన్నరకుండు దేవవిభుఁ డెక్కెడుపీఠము నెక్కువాఁడె మీ
రన్నను నే నొనర్పఁగలనా యిది యయ్యది యెక్కువాఁడు తాఁ
గన్నులు వేయి దాల్పవలె గౌతమునింటను గోడి గావలెన్. 27.

వజ్ర—నిజము. నిజము. అంతమహిమ గలవాఁడే దాని నధిష్ఠింపవలెను. పాప మీమహేంద్రుఁడు కష్టపడి రేయి యనక పగలనక కోడియో కుక్కయోనై వేయిగన్నులు దెచ్చుకొన్నాఁడు. అంతపాటిశక్తి యెవరి కున్నది?

బృహ—(తనలో) రాక్షసుల యెత్తిపొడుపుమాటలు భరింప శక్యముగాకున్నవి.

మహేం—(తనలో) ఇంతకన్న శూలములతోఁ బొడిచిన మేలు. కటకటా! కాల మెంతలో మారినది?

బృహ—దానవనాయక! ఎన్నఁడో పొరబొటున నొనర్చిన లోపముల నెంచి యింతవానిని మీ రధిక్షేపించుట మీవంటి వీరపురుషుల కుచితముగాదు.

నర—అట్లయిన మీకు హితమగుపనియే యొనర్చెదను. చిత్తగింపుఁడు. ఓయి మహేంద్ర! భూధరపక్షచ్ఛేదనశౌండ!

మ. ధరణీరాజ్యము వీరభోజ్య మని పెద్దల్సెప్పఁగా వీఁడు ని
ర్జరలోకేశ్వర! రెండుపల్కుల కిట న్బ్రత్యుత్తరం బిమ్ము నీ
కరమందుం గులిశాయుధంబు గొని సంగ్రామంబు గావింతువా
సురసామ్రాజ్యపదంబు నాకుఁ గరము ల్జోడించి యర్పింతువా. 28.

పంచ—మహారాజా!

తే. గీ. కాలుదండంబు ధనదునికఱకుఁగత్తి
వరుణుపాశంబు మనమీఁద వమ్ములయ్యె
వజ్ర మేటికి ధరియింపవలయు వీఁడు
కొండలను రాళ్ళ మలిచి చెక్కుటకె గాక. 29.

వజ్ర—దేవా! మీరు చూచినతోడనే యెన్నఁడో చచ్చినట్లు నిశ్చేష్టులగు నీదేవరాజ బృహస్పతులు యుద్ధము సేయుదురా? బలహీనులమీఁద నెగురుచున్నచో నీయనవంటివారు మఱియుండరు.

నర—మహేంద్రా! ఊరకయుండెదవేల? ప్రత్యుత్తర మిమ్ము.

పంచ—హరియో హరుఁడో తమకుఁ దోడ్పడువఱకు నిరుత్తరులై యుందురు కాఁబోలు.

వజ్ర—హరియా వచ్చుట? అతఁడు తనరక్షణముఁ జేసికొన్నఁ జాలు వీరిని రక్షించినంతఫలము.

నర—అన్నట్లు మఱచితిని. ఓదేవరాజా!

మ. హరి మీపాలిఁటిదైవతం బనుచు దైత్యధ్వంసి యంచు న్సతిం
తురుగా మీరలు సర్వకాలమును జేతుల్మోడ్చి వాఁ డేడి యు
క్కఱకు న్నాడది యేమి? వచ్చి మిగుల న్గారుణ్యమేపార ని
ర్జరుల న్బ్రోవఁడదేమి? పిమ్మట సమాశ్వాసింపఁ దావచ్చునే. 30.

మహేం—(తనలో) హరిని నీవిధముగా నిందించు వీని కేమిగతి కలదో కదా?

బృహ—(తనలో) ఇట్టివైపరీత్యములు కాలమాసన్నమైనవానియందుఁగన్పట్టును.

వజ్ర—గురుశిష్యు లిద్దఱు బెల్లముగొట్టినరాళ్ళవలె నూరకొనియెదరేల? మహారాజున కేదో యొకప్రత్యుత్తర మిందు.

మహేం—ఆచార్యోత్తమా! ప్రత్యుత్తర మొసఁగుఁడు.

బృహ—దానవేంద్రా! వేయుమాటలేల? ప్రతాపానలపరిశోషితదిక్పాలకసేనాసముద్రులును తృణీకృతనారాయణులును నగు మీతో సమర మొనర్ప మహేంద్రుఁ డెంతవాఁడు? అతఁడు సంధి యుచిత మని యూహించుచున్నాఁడు,

పంచ—దేవదానవులవైరము సంధిచేసికొనుటకుఁ బాకము తప్పినది.

వజ్ర—ఇంద్రున కిప్పుడు భయజ్వరముచే నొకపెద్దసంధిరోగము ప్రవేశించినది.

నర—మహేంద్రా! అట్లయిన నానిశ్చయము విస్పష్టముగాఁ జెప్పెద వినుము.

చ. పలుమఱు వింటివచ్చరలపాటలు చేర్చితి వీవు మేను ని
ర్మలమృదుపారిజాతకుసుమంబుల సెజ్జలమీఁద నాకభూ
ములు చిరకాల మేలితివి పూర్తిగఁ జెల్లెను వంతు మీకు దై
త్యుల కిఁక వంతు చెల్లదగు దూరము పొందు తొలంగి వేలుపుల్. 31.

దేవత లెంతకాలము స్వర్గము పరిపాలించి రంతకాలము దానవులును పరిపాలించిగాని తొలఁగరు. మఱియు మీరు స్వర్గమునుండి యొక్కఱుపూరిపుల్ల యయినఁ గొనక యెందయినఁ జని బ్రతుకుఁడు. దీనికి విరుద్ధముగాఁ బ్రవర్తింతురేని యీనరకుఁడు వేల్పులపై జాలినొందువాఁడు కాఁడని మీర యెఱుఁగుదురు.

పంచ—దేవా! మీరు లెస్సగా సెలవిచ్చితిరి.

వజ్ర—ఈపాడుదేవతలు నేటికాలమునకు మాయునురుతగిలి పోవుచున్నారు.

మహేం—(విచారముతో తనలో) రాజ్యలక్ష్మీ! నీవు చంచల వనుమాట నేఁడు నిశ్చయమయినది.

బృహ—(తనలో) అనుకొన్నదాని కేమియుఁ గొఱఁత గలుగలేదు.

ఘృణి—(తనలో) కటకటా! త్రిలోకాధీశ్వరున కెంతకష్టమువచ్చినది? ఇంక నే నిచట నిలువఁజాలను. నాపనిమీఁదఁ బోయెదను. (అని నిష్క్రమించెను.)

నర—ఓయింద్ర బృహస్పతులారా! మీయునికి నాకోపానలంబునకుఁ బ్రజ్వలన హేతువు. కావున మీ రిటనుండి సత్వరము పొండు.

వజ్ర—చుట్టుపట్ల పొలిమేరలలోనైన మీరు కనఁబడుదురేని మీగుండెలలో నిద్రపోయెదను. జాగ్రత.

బృహ—మహేంద్రా! ఏలయాలశ్యము. పోవుదమురమ్ము.

మహేం—(తన్నలో)

సీ. చిరకాలముననుండి సురల కాణాచియగు విబుధలోకంబును విడుచు టెట్లు
చింతామణీభద్రసింహాసనం బున్న యమరావతముఁ బాసి యరుగు టెట్లు
మధువైరిచరణాబ్జమకరందరస మైనమందాకినీనది మఱచు టెట్లు
సిరికిఁ దోబుట్టువై క్షీరాబ్ధి నుదయించు పారిజాతముఁ బాసి బ్రతుకు టెట్లు
దినము నైరావతము నెక్కి తిరుగకుండ
కాలినడకను నట్టిట్టు కదలు టెట్లు
నందనోద్యానవీధుల నడవకుండ
నిముసమైన నే పెఱచోట నిలుచు టెట్లు. 32.

(మహేంద్రబృహస్పతులు నిష్క్రమించుచున్నారు.)

వజ్ర—ఇప్పటికి నాకమునకు దరిద్రదశయంతయుఁ దొలఁగి శోభ కలుగు కాలము వచ్చినది. దేవా! మీ రీచింతామణీభద్రసింహాసన మధిష్ఠించి దేదీప్యమాన ప్రభలతో కొలువుదీర్చి మాకన్నులకు విందు సేయవలయును.

పంచ—దేవా! ఇప్పు డీపీఠము నెక్కవలదు. భగవంతుఁడును దానవకుల క్షేమంకరుండును నగుశుక్రాచార్యుని యనుమతంబునఁ బుణ్యదినంబున సుముహూర్తంబున మీరు సురసామ్రాజ్యపట్టాభిషిక్తు లగుట యుచితము.

నర—ఇది యవశ్య మాచరణీయము. ఇంతలో నాకలోకవైచిత్ర్యములఁ గనుఁగొందము రండు. పట్టాభిషేకముకన్న ముందు మహేంద్రుని యుంపుడుకత్తెయగు నూర్వశిని సందర్శించుటకై నామనంబు తత్తరపడుచున్నది. దానిచక్కఁదనము వర్ణనాతీతమని మున్ను నారదాదిమునులవలన వినుచుందును. కావున సత్వరము పోదమురండు.

పంచ—చిత్తము. (అందఱు నిష్క్రమించుచున్నారు.)

# కర్పూరమంజరి.

## మొదటి ప్రకరణము.

"అహాహా! జన్మస్థానవియోగదుఃఖము దుస్సహముగదా! ఆలుబిడ్డల, నన్నదమ్ముల, నాప్తబంధుమిత్రుల, విడుచుట యెంతకష్టమో, స్వదేశమును విడుచుటయు నంత కష్టమే. వేదాంతశాస్త్రజ్ఞు లీయనురాగ మజ్ఞానజనితమనియు, మమత్వము లేనివారలే విజ్ఞానులనియుఁ జెప్పుదురు. కాని యది యొప్పుకొనఁదగినమాట కాదు. ప్రపంచమున నరుఁడు జీవించునంత కాలము మమత్వాదులు లేక యుండుట యసంభవము. స్వాభిమానము బంధుజనాభిమానము, గృహాభిమానము, దేశాభిమానము, మతాభిమానము, మొదలగునవి శ్లాఘ్యములే యగును గాని, గర్హ్యములు గావని నాయభిప్రాయము. నే నెంత ప్రయత్నించుచున్నను నామనసునుండి యీయభిమానమును బారఁదోలఁజాలకున్నాఁడను. కటకటా! మూఁడుతరములనుండి మాకుటుంబమునకుఁ గాపురమై, నాకు జన్మభూమియై, సకలసంపదలకుఁ బుట్టినిల్లై ముక్తిప్రదాయకము లగునగరములలో నొకటియై, విలసిల్లు నుజ్జయనీ మహానగరమును నేనిఁక నెన్నఁడైన గన్నులపండువుగఁ జూడఁగాంతునే? వసంతకాలమున సాయంసమయంబుల శిప్రానదీతీరంబునకుం బోయి, యాయేటినీటిబొట్టులఁ గలసి, వీచు మందమందమలయానిలంబులు నెమ్మేనుసోఁక నెన్నఁడైన సౌఖ్య మనుభవింతునే? ప్రదోషకాలమున నాలయంబునకుంజని, సకలభువనరక్షకుఁ డగు విరూపాక్షు, మహాకాళేశ్వరు నింక నెన్నఁడైన జేతులారఁ బూజించి, మనసార ధ్యానింపఁగలుగునే. వత్సరాజు ప్రద్యోతమహారాజనందనయగు వాసవదత్తా దేవిని పితృగృహమునుండి తీసికొనిపోయిన చిత్రకథలు పల్లియలనుండి వచ్చుచుట్టమునకు నెన్నఁడైన వీనులవిందుగ వినిపింతునే? అంతభాగ్యము నావంటియదృష్టహీనునకుఁ గలుగదు. నేనెక్కడ యుజ్జయినియెక్కడ? పరమసాధ్వి యగునిల్లాలిని ప్రపంచ మెట్టిదో యెఱుఁగని పసిబిడ్డసయితముగఁ బుట్టినింట నునిచి దిక్కుమాలినపక్షినయి కానిదేశములఁ జరియింపు మని పద్మగర్భుఁడు నా నెన్నుదుట మూఁడుబంతుల వ్రాసియుండ నేను సుఖించు టెట్లు? ఓమహాకాళేశ్వరా!

నా కిట్టిదుర్భర మగునవస్థ గలుగుటకు నాచేసినదోస మేమి? అతిథులకు నభ్యాగతులకు మునుమున్న పెట్టక మూఢుప్రొద్దులంగుడువ; వైశ్వదేవంబుసేయక యిల్లువెడల; నీపాదారవింద ధ్యానము చేయక నిదురవోవ, అబ్రాహ్మణకర్మంబుల నాచరింప. అట్లు మెలఁగుచున్నను నాకిట్టిగతిప్రాప్తించుటకుఁ గారణమేమి? భవతారకంబులగు నీయడుగుఁదామరలనొకసారియైన ధ్యానింపనిఖలులు, కలకండంబులకన్న దియ్యనగు నీనామంబు నెన్నండును స్మరియింపనికష్టులు, మంగళప్రదమగు నీకోవెలగడప నొకతూరియైనఁ ద్రొక్కిచూడని మొక్కలులు, విశ్వమోహనంబగు నీసుందరవిగ్రహంబు మరపునకైన గనుంగొనని యధములు, ధనధాన్యములు నాయురారోగ్యములు, నిత్యకల్యాణంబులు కలిగి వర్ధిల్లుచుండ నాజన్మశుద్ధుఁడనై, విప్రుఁడనై, ఘనాంతస్వాధ్యాయవేత్తనై, వేదాంతశాస్త్రపరిజ్ఞాతనయి, విశేషించి నీచరణారవింద సేవకుఁడనై, నలువురలోఁ దలయెత్తుకొని గౌరవముగా కాలక్షేపము సేయుచున్న నే నిట్లు దుస్తర దుఃఖసముద్రంబునం బడియుండ నుపేక్షించుట నీకు న్యాయమే? అయ్యయో! నిష్కారణముగాఁ గర్మసాక్షి యగుభగవంతుని దూర నేల? పూర్వజన్మకృత మగుకర్మమే దీనికిఁ గారణము. ఆకర్మయే కారణము గాదేని, కాశ్మీర, నేపాళ, విదర్భదేశములను గోబ్రాహ్మణపక్షపాతులు, వైదికమార్గప్రవర్తకులునయి, ధర్మస్వరూపులయినరాజులు పరిపాలించుచుండ మాళవదేశమునకు బ్రాహ్మణద్వేషియు, వేదబాహ్యుఁడు నసంగతుఁడునగు పరమనాస్తికుఁడు బౌద్ధరాజు సుదర్శనుఁడేల దాపురమయ్యె. నావలె నాసుదర్శనుఁడెన్నఁడైన నుజ్జయనీనగరంబువిడిచి, మనస్తాపంబుఁజెందునే? నావలె నెన్నఁడైన నాదురాత్ముఁడు తనయాలుబిడ్డలఁబాసి యేకాకియైచరించునే? నాయును రెన్నఁడైన వానికి వానికుటుంబమునకు దగులునే? ఏలతగులకపోవు! సాధులగు నగ్రజన్ము లొక్కనిముసము ననుభవించు చిత్తక్షోభము నూఱుమడుంగులై, వేయిజన్మములనైన తత్కారకులకు ఫలముగట్టి కుడుపకపోదు. పాడియుఁ, బంటయు, సిరియు, సంతతియు, గలిగి, పండువలెనున్న నాకాపురము గూలంద్రోసిన యారాజాధముని దైవంబు సెరుపకుండునే. ప్రాణంబులు కంఠంబున నుండునంతకాలమును నేనాతనితో పగసాధించి నాయావచ్ఛక్తి వినియోగించి పరరాజుల వానిపై దండువిడియఁబంపి, యాతని రాజ్యభ్రష్టునిగావించి యుజ్జయనీనగరము పాడుచేసి, యాలుబిడ్డల నెడబాపి వానినమ్మిన ప్రజలనిడుమలగుడిపి, వేధింపకపోయితి నేని నేను బ్రాహ్మణుఁడనుగాను. ఇదియే నాశపథము. దేవసింహుఁడు, హిరణ్యమిశ్రుఁడు, సత్యమిహిరుఁడు మొదలగు బౌద్ధపండితులందరు తమరాజునుంగూడి నాకొనర్చిన యపకారమునకు ప్రతిఫలమనుభవింతురుగాక! మాళవదేశస్థులందరు పరమవైదికుఁడగు ఛాందసబ్రాహ్మణుఁడు రుద్ర

భట్టుమహత్త్వమించుక యెఱుంగుదురుగాక! సరే! అదియటుండనిమ్ము. ఇప్పుడు నే నేదేశంబులకుఁబోయి వసింతును? తక్కినవిషయంబులకన్న కాశ్మీరంబు సుభిక్షంబని వింటి. దానికి రాజధానియగు శ్రీనగరము సార్థకనామమై సిరులకు నివాసమనివింటి. దానిం బాలించు హేమచంద్రమహారాజు బ్రాహ్మణపక్షపాతియని వాడుకగలదు. కావున నానగరంబునకుం బోయి తలదాఁచుకొనుట యుచితము. అచ్చట నేనెవ్వరి నెఱుంగుదును? క్రొత్తవారి నెవ్వ రాదరింతురు? ఏమయిననుసరే దైవముపై భారమువైచిపోయెదను. అదిగో నాయెట్టయెదుట నొకపల్లియగానవచ్చుచున్నది. చీఁకటిపడకుండ నాగ్రామము చేరవలయును. ఇది యరణ్యమగుటచే దైవోపహతుఁడ నగు నేను మరికొన్ని యుపద్రవముల పాలుగావలసివచ్చును. భాస్కరుఁడును నావలెనే తనతోంటి తేజము డీలుపడి యొకమూరు మూల తలఁదాఁచుకొనుచున్నవాఁడు” అని తనలో తాను వితర్కించుకొనుచు నొక బ్రాహ్మణుఁడు వేసవికాలమున నొకనాఁటి సాయంకాలము సింధునది తూర్పుటొడ్డున గల యొకయడవిలోనుండి మునుపరిపల్లెకుఁ జీఁకటిపడకుండ పోవలయు నని విసవిస నడచుచుండెను.

అతఁడు ఏబదిసంవత్సరములు దాటినవాఁడు. శరీరము దబ్బపండువంటి పచ్చని ఛాయఁగలిగి స్థూలమై యుండెను. అతఁడు పొడగరి యనవచ్చును గాని స్థూలముగ నుండుటచేఁ జూచువారి కించుక పొట్టిగఁ గానఁబడుచుండును. మెడలో బంగారు తీఁగెను జుట్టిన రుద్రాక్షతావళమును, తలకుఁ జుట్టిన విలువగల పచ్చని కాశ్మీరశాలువయు, చెవుల నలంకరించు కనకకుండలములు, చుట్టఁజుట్టి వీపుపై సిడుకొన్న కృష్ణాజినము, వ్రేలనున్న కాసికాముద్రయుంగరమును తద్బ్రాహ్మణుఁడు శిష్టుఁడనియు, విద్వాంసుఁడనియు దెలుపు. వానికన్నులు మేడికాయలట్లు పెద్దవై యెఱ్ఱజీరలు గలవై చూపఱ కించుక వెఱపుగొలుపుచుండును. స్వభావముచేత నావిప్రుఁడు ధూర్తవర్తనుఁడు కోపకాఁడు నయినట్లు వాని మొగముఁ జూచువారు మునుముందు యూహింపవచ్చును. ఆమహీసురుఁడు మధ్యాహ్నమంతయు నెండలో నడచుటచే వాని మొగమెంతయు సూర్యకిరణసంతప్తమయి జేవురించి చెమ్మటలు గారుచుండెను. దీర్ఘప్రయాణంబున నతఁడతిశ్రాంతుఁడై యెడనెడఁ జెట్లనీడల నించుక విశ్రమింప నిచ్చగించెను. కాని ప్రొద్దు గ్రుంకుచుండుటయు మార్గము నిమ్నోన్నతమగుటయు, చిరుచీఁకటులు గ్రమ్మనారంభించుటయు, నెంచి సాధ్యమయినంత వేగముగఁబోవలసి వచ్చెను. పథికు లెంతవిసువుగ నడచినను శ్రాంతులగునప్పుడు వానికి గమ్యస్థానము కడుంగడువవ్వున కరిగినట్లు దోఁచునుగదా! ఎంతనడచినను బ్రాహ్మణుఁడు చీఁకటి పడునప్పటికి గ్రామము చేరలేకపోయెను. నిర్జనమగు నాప్రదేశము, సహజముగ ధైర్యశీలుఁ డగు నాతనికిని భయముగొలుపఁజొచ్చెను. రాత్రియును నంగన తలవెండ్రుకలువలె కారుచీఁకటులు నలుదెసలఁ గ్రమ్మెను. ఘాతుకమృగంబులు, దుష్టసర్పములు, చోరకిరాతులు, భూతపిశాచములు బ్రాహ్మణునితలఁపున నిలువ నతఁడు భయకంపితుఁడయి

మాటిమాటికి వెనుకఁ దిరిగి చూచుచు హరినామస్మరణము చేయుచుఁ జేతికఱ్ఱతో నేలఁ దట్టుచుఁ దాఁ జేయుచున్నపని తా నెఱుంగక యెట్టెటో నడచుచుండెను.

ఇట్లు విహ్వలచిత్తుఁడగు నాజన్నిగట్టు చేసినదోసంబు మూర్తీభవించెనో యన నొకకిరాతుఁడు నల్లనిమేనివాఁడు వానివెనువెంటనె వచ్చి చేతిదుడ్డుకఱ్ఱతోఁ దలపై నొక్కపెట్టు పెట్టెను. వెంటనే బ్రాహ్మణుఁడు గొడ్డలిపెట్టునం బడుచెట్టులాగున హా రా యనుచు నేలంగూలె.

## రెండవ ప్రకరణము.

ప్రపంచమునందలి కొండలలో హిమాలయపర్వతమె మహోన్నతమయినది. ఇది నిరంతరమును మంచునకు నెలవగుటచే దీని కాపేరు కలిగినది. ఈమంచుఁగొండ యార్యావర్తమునకుత్తరదిగ్భాగమునఁ బూర్వమునుండి పడమరకు వ్యాపించి భగవన్నిర్మితమగు రాతిగోడచందంబున దుర్భేద్యమయి యుండు. ఆధిక్యతనుబట్టి మనపూర్వులీనగమునకుఁ బర్వతరాజను బిరుదము నిచ్చిరి. ఆవైశాల్యము, నాయౌన్నత్యము, నాగాంభీర్యము నొక్కమాఱు గన్నవారు శైలచక్రవర్తినామము దానియందు సార్థకమయ్యెనని దలఁపకపోరు. ఏశైలంబు తలదాఁచుకొనుట కిల్లులేక వల్లకాడులఁ గాపురముండు మూఁడుకన్నులవేల్పునకు నిలువనీడ యయ్యె, నేనగాధిరాజుకడుపున నుదయింపవలయునని దాక్షాయణికోరి పార్వతియయి జన్మమందె, నేకొండరాజు తనయనుంగుకూఁతురును, కాళ్లుకడిగి కన్యదానమిచ్చి చిరబ్రహ్మచర్యముచే వెతలఁబడు మహేశ్వరు నొక్కయింటివానిఁ జేసె, నేమహీధరగుహాంతరంబులు ప్రమథగణంబుల కోలాహలంబులను, పిడుగులచప్పుడువోలె వినంబడునం దీశ్వరుని యంకెలకును బ్రతిధ్వనులిచ్చుచుండు, నేభూధరకూటములు తమప్రియులం గలసిమెలసి యెడలేనిమమతల విహారంబుసలుపు కిన్నరవిద్యాధరబాలికల కాటపట్టులయ్యె, నేమహీధరంబు పరమతపోనిష్ఠులగురాజర్షి, బ్రహ్మర్షి, దేవర్షి, గణంబులకు యజ్ఞభూమియై దేవతలకన్న సత్రమయ్యెనని పురాణంబుల వినుచుందుమో, యేగుబ్బలి భువనపావనములగు సింధుగంగాప్రముఖనదీమతల్లికలకుఁ గన్నతల్లియయి విలసిల్లునో, యేగట్టులవారి కటిప్రదేశమునందె మేఘమండలములు చరియించుచుండునో, యాహిమవంతము, దీర్ఘశృంగములతో దుర్గమారణ్యములతో, నమూల్యరత్నములతో, సువర్ణాదిలోహములతో, నుత్తమదివ్యౌషధులతో, గైరికాదిధాతువులతో బహుసత్వములతో నెల్లపుడుం బాఱు సెలయేళ్లతో, సొబగుమీఱు దరియలతో నిండియుండి, చూపఱకు కనులపండువు సేయుచు నాశ్చర్యమును సంతోషమును భయమును గొలుపుచుఁ బరమేశ్వరుని యనంతమహిమంబును బ్రకటించుచుండును ఈచలికొండ కుత్తరభాగంబునఁ. గైలాసంబున సింధునదిజన్మించె. సింధుశబ్దమునకు సముద్రమర్థమగుటచే నీనదిపొడవు వెడల్పులంజూడ చిన్నసముద్రమోలేక సముద్రుని

బిడ్డయేమోయని సందియము తోఁచును. ఈమహానది పుట్టిన చోటునపలి కొంతదనుక టిబెట్టు దేశమునఁ బ్రవహించియనంతరమునఁ గాశ్మీరదేశంబుసొచ్చి తన్మధ్యభాగంబునం బాఱి యవ్వలపాంచాలసింధుదేశంబులు ప్రవేశించి, యనేకోపనదులంగలసి చవిటిపఱ్ఱల రత్నగర్భలఁగఁజేసి, పట్టణంబులఁ బల్లియలనుండు జనంబులకు జీవనంబు లొసంగుచు, పలుపాయలై పశ్చిమసముద్రమునఁ బడుచున్నది. ఈనదియొడ్డున నిప్పటికిని పట్టణంబులగు కాఱడవులు కొన్ని కొన్ని తావులంగలవు. ఈగ్రంథమునఁ జెప్పఁబడుకథ శాలివాహన శకప్రారంభమునకును విక్రమార్క-శకప్రారంభమునకును జాలమున్ను జరిగినదగుటచే నాకాలంబున నిప్పటికన్న దుష్టమృగకిరాతశరణ్యంబు లగునరణ్యంబులు విశేషంబుగ నుండెను. కాశ్మీరదేశ మిప్పటియట్లు చిన్నదిగ నుండక యాకాలమున మిగులఁ బెద్దదై యిప్పుడు పంజాబనఁబడుదేశమును జాలవఱి కాక్రమించెను. చీనాబను నుపనది సింధునదితోఁ జేరుప్రదేశమునకు నుత్తరమున నొకయామడదూరమున సింధునది పరిసరంబున నొకయడవిలో నొకచిన్నపల్లె యుండె. ఆపల్లియయందు బోయలు మొదలగు నాటవికులే గాని బ్రహ్మ, క్షత్రియ, వైశ్యు లెవ్వరును గాపురముండుటలేదు.

నాగరికుల మొగమెన్నఁడుఁ గనుంగొనని యాగ్రామవాసులనడుమ గాపురముండుటకు నూరుపేరెవ్వరికిఁ దెలియనిపురుషులు కొందఱువచ్చియెందు చేతనో నచటఁ గాలముఁ బుచ్చుచుండిరి. వారిలో నాఁడువాండ్రెవ్వరును గానఁబడరు. తెలివిమాలిన వనౌకసులు వారిపూర్వవృత్తాంతముంగూర్చి తలఁచి యడుగక, వారివేషభాషలం గనుంగొని సందియపడక వారికిం దమచేతనైన సాయంబు నెఱపుచు వారితోఁ గలసిమెలసి యుండిరి. ఒకనాఁ డానాగరికులలో నొకఁడు సేవకు లిరువురితో మధ్యాహ్నము వేఁటకుం జని యెందేనిఁ జరియించి కొన్ని పులుఁగుల మృగములఁ జంపి చచ్చినవానిని సేవకు లిరువురు మోసి తేర సాయంకాలమున కిప్పటియ ట్లిలుఁ జేరలేక, చీఁకటులు గ్రమ్మినవెనుక నది యొడ్డున నడచి వచ్చుచు వెంటవచ్చుపరిచారకులలో నొకనితో నిట్లనియె. "కరటకా! మన మీవేళఁ జాల యాలస్యముఁ జేసితిమి. వేఁట మొదలగు దుర్వ్యసనములం దగిలిన వారికి నాఁకలియుఁ దప్పియుఁ బ్రొద్దును దెలియవని పెద్దలు చెప్పుమాటలు నిశ్చయములే యని నేను దలంచెద. మనము నడచుచున్న దరణ్యప్రాంతము, క్రమ్మినది కాఱుచీఁకటి, కావున జాగరూకతతో నడువుఁడు." అని పలుకఁ గరటకుండు వానితో "స్వామీ! కొంచెము ప్రొద్దుపోయిన నేమి. కావలసినన్ని మృగములు పక్షులు లభించినవి. మన మింకఁ గొంత సేపటికయిన నిల్లు సేరకపోము. మనము మువ్వురమున్నాము గనుక నంతగ భయపడవలసినదిలేదు." అని పలికి వాఁ డింక నేదియో యనఁబోవుచుండ "నయ్యయో! కటకటా! యేమిచేయుదు" నని యొకయార్తనాదము వారి చెవులంబడె. ఆపురుషులు మువ్వు రాశబ్దము విని నిశ్చేష్టులయి నిలిచి యది యేమయి యుండునని తమలోఁదారు మెల్లఁగ విచారించుకొని, క్రమ్మర నట్టిశబ్దము వినఁబడక పోవుటచే మరల సాఁగి నడచుచుండిరి. వారు కొన్నిగజములదూరము నడచునప్పటికి

ముందు నడచుచున్న కరటకునికాలి కేదియో దగిలెను. వెంటనే వాఁడు పీనుఁగ పీనుఁగ యని యఱచుచు వెనుకకుం బరుగెత్తెను. వాని యజమానుఁడయిన నాగరికుఁడు కరటకా! భయపడకు భయపడకు పీనుఁగునకంత వెఱువవలెనా? ప్రాణమున్న జంతువులు హాని సేయఁగలవుగాని మృతజంతుకళేబరములు కీడొనరింపఁజాలవుగదా. దగ్గఱకుఁ బోయి చూతము రమ్మని పిలిచి దృఢమనస్కుఁడయి ముందుకు నడచుటయు యజమానునివెంటఁ గరటకుఁడును గరటకునివెంట రెండవసేవకుఁడగు పింగళుఁడును నడిచిరి. అతఁ డాకళేబరమును సమీపించునప్పటికి పాదములు నెత్తుటం దడసిన నేలం దాఁక వానిమేను పులకరించెను. ఈయాశ్చర్య మేమయి యుండునని యాపురుషుఁడు విచారించుట కారంభింప నంతలో "నయ్యా నేను పీనుఁగను కాను. భగవదనుగ్రహముచేత నిప్పటికి సజీవుఁడనే నాయం దనుగ్రహముంచి నాగాయములకుఁ గట్టుకట్టి నాకించుక సాయంబు సేయుదురేని నే నాజన్మాంతము మీకుఁ గృతజ్ఞుఁడనయి విధేయుఁడనయి యుందు" నని కొన్నిమాటలు హీనస్వరమున వినంబడెను. ఆపలుకులు విని యజమానుఁడును సేవకులును పడియున్నవాఁ డాపదలో నున్నమనుష్యుఁడని యెంచి దగ్గఱకుఁ బోయి "అయ్యా నీ వెవఁడవు? ఏల యిట్లు పడియున్నవాఁడ" వని యడుగ నామనుష్యుఁడు గద్గదస్వరముతో వారి కిట్లనియె. "అయ్యా నే నొకబ్రాహ్మణుఁడను. నాపూర్వవృత్తాంత మంతయు సవిస్తరముగ మీ కెఱిఁగించుట కిది సమయము గాదు. నా కిప్పు డోపికయు లేదు; ప్రస్తుతచరిత్ర మెఱిఁగించెద వినుఁడు. ఈరాత్రి ముందు గనంబడుపల్లెకుఁ బోవలయునని వడివడి నీదారిని నడుచుచుండ దురాత్ముఁ డొకచోరుఁడు నాకుం దెలియకుండ నావెనువెంట నంటివచ్చి చేతిదుడ్డుకఱ్ఱతో నానడినెత్తి పగుల మోదెను. ఆప్రహారముతో తలకుం జుట్టుకొన్నశాలువ యొకమూలంబడ నెత్తినుండి క్రొన్నెత్తురు జొటజొటగాఱ గొడ్డఁట నరకినతరువువలె నేను హరహరా యనుచు నేలం గూలితిని. అంతట నాకిరాతుఁడు నారత్నకుండలములు శాలువ వ్రేలియుంగరము దొంగిలించుకొని యెందేనిం జనియె. నన్నుం గనికరించియీయూరికిం గొంపోయి నాగాయములు మాన్పవేఁడెద." అని జాలిగదురఁ బలుకుటయు, వానిని లేవఁదీయుమని యజమానుఁడు సేవకులం బనిచి, బ్రాహ్మణునకు ధైర్యము చెప్పి మెల్లమెల్లఁగ నడిపించుచు నూరికిం దోడ్కొనిపోయి, గాయంబులకు దగుచికిత్సలఁ జేసి పాలు ద్రావనిచ్చి పన్నుండుటకు మంచము వేయించి బహువిధంబుల నాదరించె. తరువాత నాలుగైదుదినములకు బ్రాహ్మణునిగాయము కుదుర నారంభింప వానికాయంబు క్రమక్రమంబుగ దృఢంబు గాఁజొచ్చెను. ఆవిప్రుఁ డొక్కనాఁడు నిజప్రాణసంరక్షకుఁ డగునాపురుషుని నామధేయంబు దెలియఁగోరి యడుగ నాతఁడు కొంచెము విచారించి "అయ్యా నన్నిచటివారు సుమిత్రుఁ డందురు. ఏపేరయిన నేమి నన్ను మీరిచ్చవచ్చినపేరం బిలువుఁ" డని ప్రత్యుత్తర మిచ్చెను. తనపేరు చెప్పుటకు నతఁడు సందేహించినట్లు గనఁబడుటయు, వానియున్నతావు ననికియు, వానిసుందరాకారంబునకును, మృదుభాషణంబుల

కను భగనివై యుంటయు, బుద్ధిం దలపోసి యతఁడు ప్రచ్ఛన్నవేషుఁడై యుండవచ్చునని బ్రాహ్మణుఁ డూహించి యడిగి తెలిసికొనఁగోరి సమయము నిరీక్షించుచుండెను. సుమిత్రుఁడును సేవకులును బ్రాహ్మణునియెడ భయభక్తులు గలిగి యుపచారములు చేయుచుండిరి.

## మూడవ ప్రకరణము.

ఆపద లిట్లుఁ గట్టుకొని కాపురముండవని తెల్పుటకో యన చీఁకటులు గడచిపోయె. దుఃఖానంతరమున సుఖంబు లిట్లె వచ్చునని యెఱుంగఁ జేయుటకో యన కృష్ణపక్షంబు గడచుట్టుటయు మాపులు వెన్నెలలు గాయఁజొచ్చెను. దుఃఖానుభవంబున గలుషంబు లగు మొగంబులు సుఖానుభవంబున గళావంతము లగునని వెల్లడిచేయుటకో యన దిశాముఖంబులు నిర్మలఁ దెలివినొందె. దేశ మజ్ఞానాంధకారమయ మగు నప్పుడు మిగులం దేజరిల్లు కించిజ్ఞులు దేశము జ్ఞానదీప్తిమంతం బగునప్పుడు తమ యూరు పేరులేక యుండు రనునీతి లోకంబునకుఁ జాటుటకో యన మున్ను చీఁకటిరాత్రుల తళతళమని మెఱసిననక్షత్రంబులు వెన్నెలలో వెలుఁగు డిందుపడి కానఁబడవయ్యె. రాజు లొకవేళ జనుల కార్తికరులయి మఱియొకవేళ నానందకరు లగుదురనుమాట నిజమని ప్రకటించుటకో యన నిశారాజగుచంద్రుఁడు హేమంతఋతువున జగజ్జనులను జలిచేత వడకించిన చల్లనికిరణములచేతనే యావసంతరాత్రులలో జనుల నానందాబ్ధిఁ దేలించుచు కువలయానందప్రదాయకుఁడయి యుండెను. ఎంతటిస్వచ్ఛమూర్తులకయిన నెంతటికళావంతులకయిన, నెంతటిసన్మార్గవర్తనులకయిన వెదకిచూచిన నించుకలోపముండకపోదనుపలుకు నొక్కివక్కాణించుటకో యన స్వచ్ఛమయి, షోడశకళాపరిపూర్ణమై యాకసంబు నలంకరించు చంద్రమండలంబున, మచ్చ చూపఱకుం గానఁబడఁ జొచ్చెను. నిండుచందురుండు పండువెన్నెలలు గాయు పున్నమనాఁటిరేయి సుమిత్రుఁడు నడివాకిట నొకచాపవేయించుకొని వెన్నెలలో బ్రాహ్మణుఁడుఁ దానును గలసి కూరుచుండి పురాణగాథలు, పూర్వరాజులచరిత్రములు నాతనివలన వినుచుండెను. కరటకుఁడు పింగళకుఁడు మొదలగు సేవకులు పగలెల్ల నొడ్లు దంచి పనిసేయుటచే మేను మఱచి గాఢముగ నిద్రించుచుండిరి. గ్రామమంతయు మాటుమణఁగి నిశ్శబ్దమై యుండె. కొంతసేపు పురాణగాథలు విని సుమిత్రుఁడు బ్రాహ్మణుని జూచి యార్యా! మీముఖవర్చస్సును పాండిత్యప్రభావమును జూడ మీరు సామాన్యులు గారని తోఁచుచున్నది. మీ రెవ్వరో యేదేశంబునుండి యెం దరుగుచున్నవారో, యట్లరుగుటకుఁ గారణ

పెద్దినో నా కెఱుంగఁజేయ వేఁడెదను. నేను మీకు విధేయుఁడ నగుశిష్యుఁడనుగాని యన్యుఁడనుగాను. మీచరిత్రము గోప్యమగునేని నే నది యిచ్చట నే మఱచిపోవఁగల వాఁడనని శపథంబు చేసెద. మందభాగ్యుఁడ నగునేను నాచరిత్రమును మీకు విన్న వింపఁదలఁచుచున్నాఁడను. కాని మునుముందు మీరు నన్ను నమ్మి మీకథ నెఱిఁగింతు రేని నే నప్పలఁ దెలిపెదను. కావున ననుగ్రహించి సెలవిండని ప్రార్థించె. ఆవేఁడి కోలువిని మహీసురుఁడును కొండొకవడి యాకసంబుపంక దలయెత్తి చూచి విచారించి, యెట్టకేల కిట్లు తనవృత్తాంతముఁ జెప్పఁదొడంగె. “ఓసుమిత్ర ! మిత్రదర్శనము లేమిచే శోషిల్లిన నామనఃపద్మము మిత్రుఁడవగు నిన్నుంజూచి మరల వికాసవంత మయినది. ఆప్తబాంధవుల నందఱ విడిచి వచ్చిన నాకు దైవము దయాళువై లోక బాంధవుఁడ వగు నిన్నుం జూపె. భాగ్యహీనంబగు నాచారిత్రమును జెప్పెద వినుము. ఆర్యావర్తమునకును దక్షిణాపథంబునకును నడుమను మాళవదేశము గలదు. ఆదేశంబున కలంకార మగునుజ్జయినీపురంబు నాకాపురంబు. నాపేరు రుద్రభట్టు, నాతండ్రి కుమార భట్టు మంత్రశాస్త్రపారంగతుండై పేరుమోసినవాఁడు. మాతాత మహాదేవభట్టు నిరతా న్నప్రదాతయై మడిమాన్యంబులవిక్రయించి బ్రాహ్మణసంతర్పణములు చేసి కుటుంబము నకు పేదఱికముఁ దెచ్చినను వంశమునకుఁ గావలసినంత కీర్తిధనము సంపాదించి యిచ్చి పోయెను. కూటికి పేదయైనను కులమునకు సంపన్నుఁ డగుటచే మాతండ్రి యొరుల నాశ్రయింపక నీచవృత్తులకు నింద్యకర్మములకు నొడఁబడక, తనకున్నంతలో గడపు కొని తనివిగలిగి పదిమందిలో నింతవాఁడు లేఁడనిపించుకొని గౌరవంబుగఁ గాలక్షేపము చేసె. నేనును మాతండ్రినడచిన తెన్నున నడువఁదలంచి కులగౌరవమునకు భంగము రాకుండ దినములు గడపుచుంటి. నాపూర్వపుణ్యవశమున నాజనకుఁడు నా కనప హార్యంబగు విద్యాధనంబు నొసంగిపోయెను. నాప్రజ్ఞాదికములు నేను జెప్పుకొనుట యనుచితమే యగునుగాని క్రొత్తవాఁడ నగుటచే నించుక నుడువవలసివచ్చెఁ గావున మీరు క్షమియింతురుగాక ! చతుర్వేదములధిగమించితి. షడ్దర్శనముల నేర్చితిని. చతు ష్షష్టికళల నలవరుచుకొంటి నాపాండిత్యప్రభావమున కక్కజపడి, యాదిశేషునకైన జతుర్ముఖునకైన వంకలు దిద్దగల కాశీకానగర పండితులు నాకు విద్యానిధియని బిరుదొ సంగిరి. శాస్త్రిచర్చలయం దెంతెంత దిగ్దంతులవంటి పండితులనైన నే నవలీల నోడించి పుచ్చుటం జేసి లోకులు నన్ను ప్రతివాదిభయంకరుండని చెప్పుకొనుచుందురు. అత్త కోడ ఱికపుఁబగచే లక్ష్మియు సరస్వతియు నొకతావున నుండనిచ్చగింపరు గావున నాకు [illegible] విద్య యెంత యతిశయముగా నుండెనో నాయింట పేదఱికమంత యతిశయముగ నుండెను. మాళవదేశస్థులభాగ్యదోషమున నుజ్జయినీనగరంబు రాజధానిగఁ జేసికొని సుదర్శనుఁడను

బౌద్ధమతస్థుఁడొక రాజు తద్దేశమును పాలించుచున్నవాఁడు. అతఁడు పండితపక్షపాతియగుటచే నాకీర్తి కర్ణాకర్ణిగ విని తన కొలువుకూటమునకు నన్నుం బిలిపించి, యుచితాసనంబిడి తనదేశీయు లగు కొందఱిపండితులతో నన్ను వాదింపఁబనిచి నాప్రసంగంబులకు గడు మెచ్చి యానాఁడు మొదలు నన్ను తనయాస్థానపండితులలో నొకనిగాఁ జేసికొని సబహుమానముగ, సగౌరవంబుగ నన్నాదరించె. అతనియాస్థానమున హిరణ్యమిత్రుఁడు ధర్మగుప్తుఁడు దేవసింహుఁడు సత్యమిహిరుఁడు మొదలగు బౌద్ధపండితు లనేకులు విద్యాధనులు గలరు. వారికి నాకు వేదములఁ గూర్చి యభిప్రాయభేదములు గలిగి వాదములు సంభవించుచుండుటంజేసి మనస్పర్ధలు పొడముచు వచ్చినవి. రాజు బౌద్ధుఁడగుటచే మతవిషయముల ! నాతో నేకీభవింపక వారితోఁ గలియుచుండు. ఇట్టి సువర్ణనుం గొలిచి జీవయాత్ర నడపుచుండ విదర్భరాజునకును మాయేలికకు నెల్లలఁ గూర్చి పోరపులు పొడమినవి. ఆవివాదంబులు పరిష్కరింపుమని తనమంత్రులలో నొకఁడగు కేసరి యనువాని నియోగించి వానికిం దోడుగ నన్నుం బొమ్మని మారాజానతిచ్చె. మే మిరువురమును జని వివాదహేతువు లగుప్రదేశంబులఁ జూచి విదర్భరాజుపక్షమే న్యాయమని యెంచి, మా ఱేనికి విన్నవించి ; యాప్రదేశంబు వైదర్భులకిప్పించితిమి. మాపైఁ గిట్టనివారు కొందఱు మేము వైదర్భేశ్వరునివద్ద లంచములు గ్రహించి తత్పక్షమున దీర్పులు చెప్పితిమని మానృపునితోఁ గొండెములు చెప్పి కినుకఁ దెప్పించె. రాజును మొట్టమొదట వారిమాటలు విశ్వసింపక కొంతకాలంబు వోయిన వెనుక సాక్ష్యంబు విచారించి మమ్ము నేరస్థులుగా నెంచి దండ్యులమని నిశ్చయించి మమ్ముం గొఱతవేయుమని పలువురు పురికొల్పిన నెందుచేతనో యట్లు సేయక మాసర్వధనంబులు దాను గైకొని మమ్ము దేశంబునుండి వెడలనడచె. నావిద్యకు నాగౌరవంబునకు దగనిపని నేను చేసితినని నమ్మి ప్రజలును, "యథారాజా తథాప్రజా" యనుమాట నిశ్చయముగ రాజుతోపాటు నాపై నలిగిరి. భార్యను పుత్రసమేతముగఁ బుట్టినింటికనిపి పైబట్టతో నిలువెడలి కాశ్మీరదేశమున వసియింపవలయునని పోవుచు, మీపాలఁ బడితి. సాయనా ! రాజులు విశ్వసనీయులుగారు. వారితోఁ గూటములు పాముతోఁ జెలగాటములు, వారిపోరాటములు కత్తివీఁదిసాములు, వారినెయ్యములు పులులతోడి వియ్యములు, వారియనుగ్రహంబులు నీటిబుగ్గలవోలె క్షణవినశ్వరంబులు, వారియాగ్రహంబులు చిరస్థాయికంబులు, వారిచ్చుసంపదలు మెఱుపుదీఁగలట్లు చంచలంబులు, వారొనరించు నపకారంబులు శాశ్వతంబులు, వారియాకారంబులు కోడెత్రాఁచులట్లు దర్శనీయంబులు, అంతరంగంబులు విషాశయంబులు, వారిమొగంబులు పుష్పసుకుమారంబులు, మానసంబులు వజ్రకఠినములు, వారిదయావృష్టు లెవ్వరిపై గురియుచుండు వారిమీఁదనే బిట్టుబుక లనుపిట్టపిడుగులు పడుచుండు. వారికి నేల యాగ్రహంబు గలుగునో యెల యనుగ్రహంబు పొడమునో యెఱుంగ నలవిగాదు. సహజదుర్గుణంబులకుఁ దోడు మారాజు బౌద్ధమతావలంబకుఁడు. వానికి దైవంబు నాస్తి గురువు నాస్తి దయ నాస్తి

ధర్మమునాస్తి సర్వంనాస్తి; అట్టిపాపకర్మం డగుటచేతనే నన్నింతచేసె; పిల్లలు గల వాఁడను, పెద్దవాఁడను, పేదవాఁడను. కుటుంబభారము మోవలేక కడుపుకక్కుఱితిచే సాల్గువరాలసొమ్ము తింటినేయనుము. ఇంతమాత్రమున నన్నింత క్రూరశిక్షపాలు చేయఁ జెల్లునే. నాభార్య భూలోకమాత, పరమసాధ్వి గోలుగోలుమని యేడ్చుచు యిటు వెడలి పుట్టినింటికింజనియె. అయుసుకు వానికిఁ దగులక పోవునే? వాఁడు ధర్మాత్ముఁడఁట మంచిరాజఁట మహాశాంతుఁడఁట; వానిధర్మము మండిపోను, వానిరాజరికము కడతేరి పోను; ఆదురాత్ముని వానియాస్థానపండితులను నేమిచేసినను దోసములేదు. దైవానుగ్రహ మువలన నేను బ్రతికియుంటినేని వారిపాటులం జూడఁగలను. వేదములు పౌరుషేయము లఁట! తత్కారణమున నప్రమాణములఁట, వశిష్ఠాదిమహర్షులు మనవంటి సామాన్యమను ష్యులేయఁట, గోమాంసభక్షకులఁట; దేవాలయములలోనివిగ్రహాలు కాఱురాళ్ళఁట; పూజానర్హములఁట, పురాణము లన్నియుఁ గల్పనాకథలఁట, విశ్వసనీయములుగావఁట; భగవంతుఁడు లేఁడఁట, పరమభాగవతోత్తములు దొంగలఁట; ఇట్లు ప్రేలు వానినో ళ్ళన్నఁడేని బడిపోవునే; వారినాలుకలు చీలుకలు గావలదే. అయినను నీపవమవాక్య ముల నానోట రానీయ నేల? భగవంతుఁడే పాలించుచున్నాఁడు; కలిప్రభావమతి శయమయిన యీదినములలో దురాత్ములకే సమస్తకళ్యాణములు లభించుచున్నవి; సద్ధర్మలే దురవస్థలఁ బడుచున్నారు. పరమఛాందసుఁడనగు నేనేమి రాజద్రోహము సేయుటయేమి. ఇంతమాత్ర మారాజాధమునకుఁ దోఁచినదిగాదు. వానికొలువుననున్న బౌద్ధపండితులు నాకుం దమకుంగలతొంటిస్పర్ధలమనంబులఁ బెట్టుకొని నేను లంచగొండి నని రాజుతోఁజెప్పి నన్నింత సేయించియుండురాయని యనుమానమును నామనస్సునం గలదు. పాపపుణ్యములు భగవంతుఁ డెఱుఁగు. ఇంతకన్న నేఁ జెప్పవలసినది లేదు. ఇదియె నావృత్తాంతము'' అని చెప్పి యాబ్రాహ్మణుఁడు కన్నుల నీరుపెట్టుకొని యూరక కొనియె. ఆతనిపలుకులు వినినవెనుక సుమిత్రునిమనసు జాలిచే గరఁగి వికలమగుటయు నాతఁడు తనయుత్తరీయపుచెంగుతో విప్రునికన్నీరు దుడిచి యిట్లనియె. "భూసు రోత్తమా! నీకథ వినినపిదప నీవు నిర్దోషివని నాకుం బోడకట్టినది. నీవు వెఱవనక్కఱ లేదు. నీ వెందఱికిఁగిన నచ్చట నభ్యుదయంబు గలుగు; నీవు కాశ్మీరంబునకుఁ బోవుదు ననుచుంటివి. అదియే యవశ్యమాచరణీయము. నామేనం బ్రాణంబు లున్నంతకాలము నేను నీకాప్తమిత్రుండనై యుండెద. ఈమాట దప్పితినేని విశ్వేశ్వరునిపాదంబులాన'' అనుటయు బ్రాహ్మణుఁడు సుమిత్రుని గౌఁగిలించుకొని సంతోషపారవశ్యము నంది "నాయనా! నాపాలిదైవంబవు, చింతామణివి'' యని స్తోత్రముఁ జేసి వానిగుణంబులు పలువిధమ్ముల పొగడఁజొచ్చెను.